


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 57

శనివారం 11-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా రచిన్

న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రకు దక్కిన గౌరవం - 12లో



స్వల్ప లాభాలతో వీడ్కోలు


ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు ఇంట్రాడేలో పరిమిత శ్రేణి ట్రేడింగ్ - 13లో



ఆలయాల్లో తోపులాట

పూరీ, హసన్ ఆలయాల్లో జరిగిన తోపులాటలో 27 మంది భక్తులకు గాయాలవ్వగా..పలువురు స్పృహ కోల్పోయారు.

వివరాలు 6లో ►



నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు

బిల్లులను ఆమోదించే విషయంలో పంజాబ్ గవర్నర్ నిప్పుతో చెలగాటమాడుతున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ►



ఆ భారం మాపైకి నెట్టేయకండి

కాలుష్యాన్ని నియంత్రణలో కోర్టుపైకి భారం నెట్టేసే ప్రయత్నాలు మానుకోవాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది.

వివరాలు 6లో ►



అక్రం ఖాన్ కాల్చివేత

లష్కరే తోయిబా మాజీ కమాండర్, భారత వ్యతిరేక ప్రసంగాలతో గుర్తింపు పొందిన అక్రం ఖాన్ పాక్‌లో హత్యకు గురయ్యారు.

వివరాలు 6లో ►

సాధికార నినాదానికి..

జన నీరాజనం

సీఎం జగన్ చేయూతతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి

- కేబినెట్ నుంచి నామినేటెడ్ పోస్టుల వరకూ సింహభాగం పదవులు వారికే
- తాము సాధించిన సాధికారత రాష్ట్రమంతా చాటి చెబుతున్న బడుగు, బలహీన వర్గాలు
- తంబళ్లపల్లె, పెదకూరపాడు, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఘనంగా యాత్ర

సాక్షి, అమరావతి: బడుగు, బలహీన వర్గాలు విజయ యాత్ర చేస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన చేయూతతో ఎలా అభ్యున్నతి చెంది, సాధికారత సాధించాయో రాష్ట్రమంతా చాటి చెబుతున్నాయి. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర రాష్ట్రమంతా విజయవంతంగా సాగుతోంది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతనిస్తూ, కేబినెట్ నుంచి

మిగతా 2వ పేజీలో ►



పార్వతీపురం పట్టణంలో సామాజిక సాధికార యాత్రకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

అమరావతిలో ధ్వనించిన సామాజిక సాధికారత

పెదకూరపాడులో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

కళ్లకు కట్టిన బడుగు, బలహీన వర్గాల చైతన్యం

2లో

తంబళ్లపల్లెలో సంక్షేమ యాత్ర

సామాజిక సాధికార యాత్రకు వెల్లువెత్తిన బడుగు, బలహీన వర్గాలు

సీఎం చేపట్టిన సంస్కరణలు, పథకాలను వివరించిన మంత్రులు, నేతలు

కేబినెట్ కళ్లుగప్పి ఖజానాకు కన్నం

యథేచ్ఛగా ఇసుక లూటీ సాగించిన చంద్రబాబు

- మెమో, జీవోలు మంత్రివర్గం ఆమోదం లేకుండానే జారీ
- ఒకపక్క ఉచితమంటూనే మరోపక్క జరిమానాలు.. కావాల్సిన వారికి సంతర్పణకే
- ఇప్పుడు పారదర్శకంగా తవ్వకాలతో ఖజానాకు రూ.770 కోట్ల ఆదాయం
- నాడు రూ.వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన బాబు.. అడ్డుకున్న అధికారులపై దాడులకు తెగబడ్డ పచ్చ ముఠాలు
- కరకట్ట నివాసం పక్కనే కొల్లగొడుతున్నా మొద్దునిద్రను ఆక్షేపించిన ఎన్జీటీ



సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో ఇసుక దోపిడీకి బరి తెగించిన మాజీ సీఎం చంద్రబాబు ఉచిత విధానం ముసుగులో నిర్భీతిగా అన్ని విధి విధానాలను ఉల్లంఘించారు. ఒకపక్క ఇసుక ఉచితమంటూనే మరోపక్క అక్రమ తవ్వకాలకు భారీ జరిమానాలంటూ మెలిక పెట్టారు. కేంద్ర ప్రభుత్వ చట్టం, గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను తుంగలో తొక్కడంతోపాటు కేబినెట్‌ను చీకట్లో ఉంచి మరీ దోపిడీకి తెరతీశారు. కేబినెట్ ఆమోదం లేకుండా మొదట ఓ మెమో.. తరువాత జీవో ద్వారా ఇసుక దందాకు తెగబడ్డారు. ఇప్పుడు పారదర్శకంగా ఇసుక తవ్వకాలను నిర్వహిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రెండేళ్లలో దాదాపు రూ.770 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అంటే గత సర్కారు హయాంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి ఖజానాకు చంద్రబాబు గండి కొట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆ ఆదాయం అంతా పచ్చ ముఠాలకు చేరిపోయింది. అంతేకాకుండా ఉచితం ముసుగులో టీడీపీ నేతలు విచ్చలవిడిగా

మిగతా 7వ పేజీలో ►

ఫ్యాక్ట్‌చెక్

బెల్టు షాపులంటూ గిల్టు కథనాలా?

- బాబు హయాంలో ప్రయివేటు షాపుల లాభాపేక్ష
- అందుకే ఊరూరా బెల్టు షాపులు పెట్టి అమ్మకాలు
- ఇప్పుడు మొత్తం విక్రయాలు ప్రభుత్వ దుకాణాల్లోనే
- షాపుల తగ్గింపు; విక్రయ వేళల కుదింపు, పర్మిట్ రూమ్‌ల రద్దు
- ప్రభుత్వంపై బురద జల్లటమే ధ్యేయంగా 'ఈనాడు' కథనాలు

- వివరాలు 5లో

తక్కువ ధరకు వస్తుంటే ఎక్కువకు కొంటారా?

- విద్యుత్ కొనుగోళ్లపై ఈనాడు వింత కథ.. బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3 నుంచి రూ.4.50 మాత్రమే
- తక్కువకే దొరుకుతున్నప్పుడు ఎక్కువకెందుకు కొనడం?
- అందుకే స్వల్పకాలిక కొనుగోలు ఒప్పందాల నుంచి తగ్గింపు
- లోడ్ షెడ్డింగ్ లేకుండా రియల్ టైం మార్కెట్ నుంచి కొనుగోలు
- అవగాహన లేకుండా కథనం

- వివరాలు 3లో

'సంగం' సర్కారుదే

- డెయిరీని కబ్జా చేసిన ధూళిపాళ్ల: మంత్రి సీదిరి అప్పలరాజు
- ట్రస్టు పేరుతో ప్రభుత్వ భూముల్లో పాగా
- దీనిపై న్యాయ పోరాటం చేస్తున్నాం
- ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడంలో చంద్రబాబు బృందం ఆరితేరింది..
- పవన్ జనసేనను అమ్మేశారు

3లో

వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ఆర్‌కే వ్యాలీ పోలీస్‌స్టేషన్ ప్రారంభించిన అనంతరం అధికారులు, సిబ్బందితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మీ ప్రోత్సాహం మరువలేను

వేముల మండల నాయకులతో సీఎం జగన్

పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

ఇడుపులపాయ, జమ్మలమడుగు నూతన పోలీస్‌స్టేషన్లు ప్రారంభం

వైఎస్సార్ కడప జిల్లాలో ముగిసిన సీఎం జగన్ పర్యటన

3లో

నోటీసులు పంపడంలో జాప్యం ఎందుకైంది?

స్కిల్ కేసులో ఉండవల్లి పిల్‌పై హైకోర్టు విచారణ

2లో

చంద్రబాబు, తదితరులకు నోటీసుల జారీలో జాప్యంపై ధర్మాసనం విస్మయం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం

తదుపరి విచారణ 29కి వాయిదా



మా హక్కులను పరిరక్షించండి

గోదావరి-కావేరి అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏకు తేల్చిచెప్పిన రాష్ట్ర జలవనరుల శాఖ.. గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనాన్ని అంగీకరించేది లేదని స్పష్టీకరణ

శాస్త్రీయంగా అధ్యయనం చేసి నీటి లభ్యతను తేల్చాలంటూ డిమాండ్

పోలవరం నుంచే అనుసంధానం చేపడితే భూసేకరణ సమస్య తప్పుతుంది..

కానీ, అనుసంధానాన్ని ఇచ్చంపల్లి కంటే ఎగువ నుంచి చేపట్టాలన్న తెలంగాణ.. మా కోటా నీళ్లను ఎలా తరలిస్తారంటూ ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షిస్తూ గోదావరి-కావేరి అనుసంధానాన్ని చేపడితే స్వాగతిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ (జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ)కు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. గోదావరి మిగులు జలాలపై పూర్తి హక్కును నదీ పరీవాహక ప్రాంతంలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు జీడబ్ల్యూడీటీ (గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్) ఇచ్చిందని గుర్తుచేసింది. రాష్ట్రంలో వర్షాభావ ప్రాంతాల అవసరాలను తీర్చాకే గోదావరి జలాలను కావేరికి తరలించాలని స్పష్టంచేసింది. అలాగే, గోదావరి-కావేరి అనుసంధానాన్ని ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం నుంచి చేపడితే భూసేకరణ, నిర్వాసితుల సమస్యను నివారించవచ్చునని సూచించింది. ఈ రెండు నదుల అనుసంధానంపై శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ భేటీ కాగా.. సాయంత్రం ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్ అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైంది. గోదావరి-కావేరి పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల జలవనరుల శాఖాధికారులు

మిగతా 2వ పేజీలో ►

తంబళ్లపల్లెలో సంక్షేమ యాత్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్


అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జన సందోహంలో ఓ భాగం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మేలు ప్రతిబింబించింది
- సామాజిక సాధికార యాత్రకు వెల్లువెత్తిన బడుగు, బలహీన వర్గాలు
- జై జగన్ నినాదాల హోరు
- సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు, పథకాలను వివరించిన మంత్రులు, నేతలు

బి.కొత్తకోట: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన చర్యల ఫలితం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రతిబింబించింది. శుక్రవారం నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు వెల్లువెత్తారు. సీఎం జగన్ తమకు చేసిన మేలును వివరిస్తూ యాత్రలో సాగారు. పీటీఎం నుంచి మద్దయ్యగారిపల్లె వరకు పాదయాత్ర సాగింది. అనంతరం ములకలచెరువులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పెద్ద ఎత్తున పాల్గొని, జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మంత్రులు, నాయకులు వివరించారు.

సామాజిక సాధికారతను నిజం చేసిన సీఎం జగన్: మంత్రి మేరుగు

ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకూ మేలు చేసి ప్రతి గుండెలో సీఎం వైఎస్ జగన్ ఉన్నారని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ కలలుగన్న సామాజిక సాధికారతను సీఎం జగన్ ఆచరణలో నిజం చేస్తున్నారని అన్నారు. దేశ ప్రధానులకే సాధ్యంకాని సామాజిక విప్లవానికి సీఎం వైఎస్ జగన్ నాంది పలికారని అన్నారు. చంద్రబాబు 2014లో 645 హామీలతో గెలిచి ప్రజలను మోసం చేశారన్నారు. 2024లో మరోసారి మోసం చేసేందుకు బాబు వస్తున్నారని, ప్రజలు మోసపోవద్దని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా మరింతగా ఎదగడానికి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

జగన్‌తోనే స్వాతంత్య్రం: మంత్రి గుమ్మనూరు జయరాం

75 ఏళ్ల స్వాతంత్య్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వాతంత్య్రం వచ్చిందని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బీసీల్లోని అన్ని వర్గాలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని చెప్పారు. జగన్ అనే శక్తి లేకపోతే, పార్టీ పెట్టకపోతే ఈ మార్పు ఉండేది కాదని అన్నారు.

స్కీం సీఎం జగన్ : మంత్రి ఉషశ్రీ చరణ్

ఏపీలో స్కీం సీఎం జగన్ అయితే స్కాం సీఎం చంద్రబాబు అని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మహిళలను కార్పొరేషన్ చైర్మన్లు చేసిన ఘనత జగన్‌దేనని చెప్పారు. కనకదాస్, వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించి గౌరవం పెంచారన్నారు.

టీడీపీ నేతల మాటలు ఏవరూ వినడంలేదు: మాజీ మంత్రి అనిల్ కుమార్

చంద్రబాబును స్థానిక ఎన్నికల్లో సొంత జిల్లా చిత్తూరు ప్రజలే తిప్పికొట్టారని, ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ,బీసీలు మైనార్టీలంతా వచ్చే ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి అనిల్ కుమార్ పేర్కొన్నారు. నెల్లూరు గడ్డపై ఓ బీసీకి టికెట్ ఇచ్చి రెండుసార్లు గెలిపించి మంత్రిగా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కష్టంతో పాలు పోసిన వారి ఆదాయంతో చంద్రబాబు హెరిటేజ్ ఆస్తులు పెరిగాయని అన్నారు. ఎన్నికల్లో కిలో బంగారం, బెంజి కారు ఇస్తామని చెబుతారని, అలాంటి వారి మాటలకు మోసపోవద్దని కోరారు. సామాజిక సాధికార యాత్రలో నల్ల రిబ్బన్లతో నిరసనలు తెలపాలని టీడీపీ నేతలంటున్నారని, వారి మాటలు ఎవరూ వినడంలేదని చెప్పారు.

అమరావతిలో ధ్వనించిన సామాజిక సాధికారత

- పెదకూరపాడులో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- అణచివేతను సంహరించిన సంబరమే సామాజిక సాధికారత : మంత్రి రజిని
- వెనుకబడిన వర్గాలు నాయకత్వం వహించాలని చెప్పిన మొదటి నేత జగన్: మాణిక్యవరప్రసాద్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో బడుగు, బలహీన వర్గాల్లో వచ్చిన చైతన్యం కళ్లకు కట్టింది. అమరావతి జనసంద్రం అయింది. వేలాది బడుగు, బలహీన వర్గాల ప్రజలు తరలిరాగా కృష్ణాతీరాన అమరేశ్వరుడి సన్నిధిలో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నేతృత్వంలో బస్సు యాత్ర విజయవంతంగా సాగింది. అనంతరం జరిగిన సభకు వేలాదిగా ప్రజలు పోటెత్తారు. మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు సీఎం జగన్ చేస్తున్న మేలును వివరించినప్పుడు ప్రజలు జేజేలు పలికారు.

ఇది బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వం : మంత్రి విడదల రజిని

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార సభలో మంత్రి రజిని మాట్లాడుతూ.. మహిషాసురుడ్ని సంహరిస్తే దసరా, నరకాసురుడిని సంహరిస్తే దీపావళి చేసుకుంటామని, తరతరాలుగా బడుగు, బలహీన వర్గాల అణచివేతను సంహరిస్తే ఆ ప్రభుత్వ పాలనను ఏమనాలని, ఆ సంబరాన్ని ఏమని పిలవాలని అన్నారు. ఆ ఉత్సవాలే సామాజిక సాధికారత అని చెప్పారు. నాలుగున్నరేళ్లలో విద్యా, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సీఎం జగనన్నకే సొంతమన్నారు. ఏ ముఖ్యమంత్రీ ఆలోచన చేయని విధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రభుత్వ వైద్యులు గ్రామానికే వచ్చి సేవలు అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఒక్క స్కూల్ బాగు చేయాలన్న ఆలోచనే చేయలేదని, ఆఖరికి పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనాన్ని కూడా సొమ్ము చేసుకున్నారన్నారు.

ఆంధ్రప్రదేశ్ బిడ్డని అని గొప్పగా చెప్పకుంటా : అలీ

ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి అనితర సాధ్యమని అన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ఆంధ్రప్రదేశ్ బిడ్డని అని గొప్పగా చెప్పుకుంటానన్నారు. పెద్దగా చదువుకోని తనకే తెలుగు, తమిళ్, మళయాళం, కన్నడం, హిందీ, ఇంగ్లిష్ బాషలు వచ్చని, మన పిల్లలు ఇంగ్లిష్‌లో చదవకూడదా? మాట్లాడకూడదా? అని ప్రశ్నించారు. మారుతున్న ప్రపంచంతోపాటే మన పిల్లలు కూడా మారాలన్నది సీఎం జగన్ ఆలోచన అని చెప్పారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు నాయకత్వం వహించాలని చెప్పిన మొట్టమొదటి నేత వైఎస్ జగన్ అని చెప్పారు. పెత్తందారీ వ్యవస్థకు సీఎం జగన్ ఒక సవాలుగా నిలబడ్డారన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్ల కోసం మాయమాటలు చెప్పాయని, సీఎం జగన్ మాత్రం ఈ వర్గాల కోసం లక్షల కోట్లు ఖర్చు పెట్టి, అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. చంద్రబాబు బడుగుల జీవితాలను వెక్కిరించారని, మనం ఇంగ్లిష్ మీడియం చదివితే పోటీకి వస్తారని భయపడి అడ్డుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. అయినా, సీఎం జగన్ ఈ వర్గాల అభ్యున్నతి కోసం బాబు పన్నాగాలను విజయవంతంగా ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు శంకరరావు, మహ్మద్ ముస్తఫా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పల్నాడు జిల్లా పెదకూరపాడులో నిర్వహించిన సామాజిక సాధికార సభకు తరలివచ్చిన జన సందోహంలోని ఓ భాగం (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మంత్రి రజిని

సంబరంలా పార్వతీపురం సాధికార యాత్ర

- పార్వతీపురంలో ఘనంగా సామాజిక సాధికార యాత్ర
- బైకులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సందడి
- మహిళల కోలాటం, తప్పిటగుళ్లు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ యాత్ర
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన పట్టణం
- జనంతో కిక్కిరిసిన సభాస్థలి


పార్వతీపురంలో నిర్వహించిన సామాజిక సాధికార సభలో పాల్గొన్న జనవాహినిలో ఓ భాగం, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం/ పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార యాత్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సాధించిన సాధికారతకు సూచికగా ఓ సంబరంలా సాగింది. జిల్లాలోని సీతానగరం మండలం లచ్చయ్యపేటలో ఆరంభమైన బస్సు యాత్ర పార్వతీపురం పట్టణంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రవేశించింది. మోటారు బైకు ర్యాలీతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు యాత్రలో పాల్గొన్నారు. మహిళల కోలాటం, తప్పిటగుళ్ల కళాకారుల ప్రదర్శనలు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ యాత్ర ముందుకు సాగింది. జై జగన్ నినాదాలతో పార్వతీపురం పట్టణం హోరెత్తింది. పార్వతీపురం బస్టాండ్ వద్ద జరిగిన సభలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటాపాట అందరినీ అలరించింది. సభకు తరలివచ్చిన జనంతో పార్వతీపురం పట్టణంలోని అంతర్రాష్ట్ర రహదారి కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మంత్రులు, నేతలు ప్రసంగించారు.

రాజ్యాంగం ఆశయాలు ఇన్నాళ్లకు సాకారమయ్యాయి: మంత్రి ధర్మాన

భారత రాజ్యాంగ ఆశయాలను స్వాతంత్య్రం వచ్చిన ఇన్నాళ్లకు దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ సాకారం చేశారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. సామాజిక సాధికార సభలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రకారం అర్హత ప్రాతిపదికన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. దీనివల్ల పేదవారు సైతం పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవడానికి, ఉచిత వైద్యం పొందడానికి, సొంత ఇంటిలో ఉండటానికి, స్వేచ్ఛగా జీవించడానికి అవకాశం లభించిందన్నారు. ధనిక వర్గాలకే పరిమితమైన ఆంగ్ల విద్యను అందరికీ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు.

జగన్‌తోనే బడుగులకు మేలు: మంత్రి రాజన్నదొర

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌తోనే మేలు జరిగిందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. ఎస్సీల కోసం టీడీపీ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తే, సీఎం జగన్ రూ.61 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. పోడు, బంజరు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత జగన్‌దేనన్నారు.

దశాబ్దాల సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఈ ప్రాంతంలో దశాబ్దాల కాలంనాటి సమస్యలను సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు చెప్పారు. ఆర్టికల్ 11, 17, 1 5(సి)ని పూర్తిగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ రిజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన్నఅప్పలనాయుడు, కంబాల జోగులు, పుష్పశ్రీవాణి, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, నవరత్నాల కమిటీ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి పాల్గొన్నారు.

నోటీసులు పంపడంలో జాప్యం ఎందుకైంది?

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించాలంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్‌లో తదుపరి విచారణ 29కి వాయిదా పడింది. ప్రతివాదులుగా ఉన్న చంద్రబాబు, అచ్చెన్నాయుడు, సీబీఐతో పాటు మొత్తం 44 మందికి తాము అక్టోబర్ 13న నోటీసులు జారీ చేస్తే, వాటిని హైకోర్టు రిజిస్ట్రీ ఈ నెల 9న పంపడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. జాప్యానికి బాధ్యులైన వారిని గుర్తించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు ఉండవల్లి అరుణ్‌కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ, నోటీసులు పంపడంలో జరిగిన జాప్యాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ జాప్యానికి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. రికార్డులను ధర్మాసనం పరిశీలించింది. జాప్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఐడీని ఆదేశించింది.

సాధికార నినాదానికి జన నీరాజనం

▶ మొదటి పేజీ తరువాయి

నామినేటెడ్ పోస్టుల వరకూ సింహభాగం పదవులివ్వడం ద్వారా పరిపాలనలో భాగస్వామ్యం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ చేసిన సామాజిక న్యాయం ఆ వర్గాల ప్రజల్లో చైతన్యాన్ని రగల్చింది. సామాజిక సాధికార యాత్రలు జగన్నినాదమై ప్రతిధ్వనిస్తున్నాయి. సామాజిక సాధికార యాత్ర శుక్రవారం అన్నమయ్య జిల్లాలో తంబళ్లపల్లె, పల్నాడు జిల్లాలో పెదకూరపాడు, పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం నియోజకవర్గాల్లో జరిగింది. మూడు నియోజకవర్గాల్లో యాత్రకు జనం నీరాజనాలు పలికారు. ఆ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు ప్రజలు కడలిలా తరలివచ్చారు. నేతల ప్రసంగాల్లో సీఎం వైఎస్ జగన్ పేరును ప్రస్తావించినప్పుడల్లా 'మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్తు' అంటూ ప్రజలు ప్రతిస్పందించారు.

■ తెలంగాణ

నేడు తెలంగాణకు ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ బీజేపీ తరఫున ప్రచారంకోసం మరోసారి తెలంగాణకు రానున్నారు. శనివారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 4.45కు ఆయన బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకుని మాదిగల విశ్వరూప మహాసభకు హాజరవుతారని పార్టీ నేతల సమాచారం. సాయంత్రం 6 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

మా హక్కులను పరిరక్షించండి

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డిలు హాజరయ్యారు. రెండు సమావేశాలు వాడివేడిగా జరిగాయి. గోదావరిలో ఛత్తీస్‌గఢ్ కోటా కింద వాడుకోని 147.94 టీఎంసీలను తెలంగాణలోని ఇచ్చంపల్లి నుంచి సాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా) మీదుగా గ్రాండ్‌ఆనకట్ట (కావేరి)కి తరలించేలా గోదావరి–కావేరి అనుసంధానాన్ని చేపట్టామని వెదిరె శ్రీరాం చెప్పారు. ఇందులో ప్రవాహ నష్టాలుపోనూ ఏపీ, తెలంగాణలకు చెరో 44.14 టీఎంసీలు, తమిళనాడుకు 40.61 టీఎంసీలు, కర్ణాటకకు 15.89 టీఎంసీలను ఇస్తామన్నారు.

నీటి లభ్యతను పునఃసమీక్షించండి..

గోదావరి, ఉప నదులలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) తాజాగా నిర్వహించిన అధ్యయనం ఏపీ హక్కులకు విఘాతం కల్పించేలా ఉందని.. దాన్ని అంగీకరించే ప్రశ్నేలేదని శశిభూషణ్‌కుమార్ స్పష్టంచేశారు. తక్షణమే గోదావరి, ఉప నదులలో నీటి లభ్యతను పునఃసమీక్షించి.. శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, గోదావరి, కృష్ణా బేసిన్‌లలో దిగువ రాష్ట్రమైన ఏపీకి.. ఆ నదుల్లో మిగులు, వరద జలాలపై పూర్తి హక్కును సంబంధిత ట్రిబ్యునళ్లు కల్పించాయని గుర్తుచేశారు. ఈ రెండు నదుల్లో ఏ నది నుంచి జలాలను మళ్లించినా ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షించాలన్నారు. ఛత్తీస్‌గఢ్ సర్కార్ కోటా నీటిని వినియోగించుకునేలా ప్రాజెక్టులను నిర్మించి.. ఆలోగా హిమాలయ నదుల అనుసంధానం ద్వారా గోదావరికి నీటిని తరలించకపోతే.. గోదావరిలో నీటి లభ్యత ఉండదని.. అప్పుడు గోదావరి–కావేరి అనుసంధానం ప్రశ్నార్థకమవుతుందన్నారు. మరోవైపు.. ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని శశిభూషణ్‌కుమార్ సూచించారు. పోలవరం కుడి కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజ్‌లోకి.. అక్కడి నుంచి కృష్ణా నదిపై నిర్మించే వైకుంఠపురం బ్యారేజ్‌లోకి.. అక్కడి నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తరలించి.. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు.. అక్కడి నుంచి కావేరికి తరలించేలా గోదావరి–కావేరి అనుసంధానం పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. దీనివల్ల భూసేకరణ, నిర్వాసితుల సమస్య ఉత్పన్నం కాదన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల ఆయకట్టుకు విఘాతం కలగకుండా.. రిజర్వాయర్లలో అదనంగా నీటిని నిల్వచేయడంపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ అనుసంధానంలో అంతర్భాగంగా కర్ణాటక సర్కార్ ఆ రాష్ట్ర పరిధిలో నదులను అనుసంధానం చేసినట్లే.. రాష్ట్రంలో దుర్భిక్ష ప్రాంతంలోని తుంగభద్ర హెచ్చెల్సీకి నీళ్లందించేలా అనుసంధానం చేపట్టాలన్నారు. దీనిపై కర్ణాటక, తమిళనాడు, ఏపీ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సూచించారు.

అవగాహన ఒప్పందానికి సిద్ధంకండి..

మరోవైపు.. గోదావరిలో మా కోటా నీళ్లను ఎలా తీసుకెళ్తారని ఛత్తీస్‌గఢ్ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో కోటా నీటిని వాడుకునేలా ప్రాజెక్టులు నిర్మించాలంటే కనీసం 20 ఏళ్లు పడుతుందని.. ఆలోగా హిమాలయ నదుల నుంచి జలాలను గోదావరికి తరలిస్తామని వెదిరె శ్రీరాం చెప్పారు. సమ్మక్క సారక్క బ్యారేజ్ బ్యాక్‌వాటర్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండాలంటే గోదావరి–కావేరి అనుసంధానాన్ని ఇచ్చంపల్లి కంటే ఎగువన చేపట్టాలని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ సూచించారు. తెలంగాణ హక్కులకు భంగం కలిగించకుండా అనుసంధానం చేపట్టాలని ఆయన చెప్పగా.. ఏ రాష్ట్ర హక్కులకు విఘాతం కల్పించకుండా అనుసంధానం చేపడతామని వెదిరె శ్రీరాం స్పష్టంచేశారు. అనుసంధానంలో కోటా నీటిని పెంచాలని తమిళనాడు, కర్ణాటకలు కోరగా.. ఇది తొలిదశ మాత్రమేనని, మలి దశలో దాన్ని పరిశీలిస్తామని శ్రీరాం చెప్పారు. ఇక మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా అధికారులు ఈ అనుసంధానాన్ని స్వాగతించారు. దాంతో.. గోదావరి–కావేరి అనుసంధానానికి అంగీకరిస్తూ అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేయాలని రాష్ట్రాల అధికారులను శ్రీరాం కోరారు. దీంతో ఎంఓయూ ముసాయిదాను అధ్యయనం చేశాక నిర్ణయం చెబుతామని రాష్ట్రాల అధికారులు తెలిపారు. ఈనెల 22న ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్నామని.. ఆలోగా ఎంఓయూపై అభిప్రాయం చెప్పాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ సూచించారు.

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 15కి వాయిదా

- ఆ రోజు వాదనలు వినిపించాల్సిందేనన్న హైకోర్టు
- 22కి వాయిదా వేయాలన్న సీఐడీ అభ్యర్థన తిరస్కరణ
- వాయిదాను తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు తరఫు న్యాయవాది

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 15కి వాయిదా వేసింది. ఆ రోజున వాదనలు వినిపించాల్సిందేనని సీఐడీకి తేల్చి చెప్పింది. విచారణను ఈ నెల 22కి వాయిదా వేయాలని సీఐడీ స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానంద అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేర న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జున రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అటు 17ఏతో పాటు, ఇటు బెయిల్ అభ్యర్థన సైతం సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఆ నిర్ణయం కోసం వేచి చూడకుండానే హైకోర్టు 15వ తేదీనే వాదనలు వినిపించాలని తేల్చి చెప్పడం విశేషం. సాధారణంగా ఓ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతున్నప్పుడు అదే అంశంపై హైకోర్టు విచారణ జరపదు. సుప్రీంకోర్టుకు గౌరవం ఇస్తూ విచారణను వాయిదా వేస్తుంది. తమపై ఇటీవల నమోదైన ఓ కేసులో బెయిల్ ఇవ్వాలంటూ టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో సైతం హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఆ అంశంపై వ్యాజ్యాలు సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉండటంతో హైకోర్టు ఆ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి చంద్రబాబు కంటి చికిత్స కోసం పొందిన తాత్కాలిక బెయిల్ గడువు ఈ నెల 28తో ముగుస్తుంది. ఆ రోజున చంద్రబాబు తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఈలోపు ఎలాగైనా పూర్తిస్థాయి బెయిల్ పొందేందుకు చంద్రబాబు న్యాయవాదులు వ్యూహాలను సిద్ధం చేశారు. అందులో భాగంగానే సీఐడీ సహేతుక కారణాలతో వాయిదా కోరుతున్నప్పటికీ చంద్రబాబు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం కూడా అదే జరిగింది. చంద్రబాబు బెయిల్ పిటిషన్ విచారణకు రాగా, సీఐడీ తరఫు న్యాయవాది స్పందిస్తూ అదనపు ఏజీ వాదనలు వినిపిస్తారని, విచారణను 22కి వాయిదా వేయాలని కోరారు. అయితే దీనిని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ తీవ్రంగా వ్యతిరేకించారు. వాయిదా వేయవద్దని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు. అమరావతి భూ కుంభకోణంలో సీఐడీ దర్యాప్తుపై ఏడాది క్రితం స్టే పొందిన చంద్రబాబు.. ఎప్పుడు తన పిటిషన్ విచారణకు వచ్చినా కూడా ఓవైపు వాదనలు వినిపించకుండా పలు మార్లు వాయిదాలు కోరి, మరోవైపు స్టే పొడిగింపు ఉత్తర్వులు పొందుతూ వచ్చారు. ఇప్పుడు మాత్రం బెయిల్ పిటిషన్‌లో ఆగమేఘాలపై విచారణ జరపాలని కోరుతుండటం విశేషం.

క్లుప్తంగా...

నేడు సీఎం జగన్ విజయవాడ పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విజయవాడలో పర్యటించనున్నారు. మైనారిటీస్ వెల్ఫేర్ డే, నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉదయం 10.20 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఇందిరాగాంధీ స్టేడియానికి చేరుకుంటారు. కార్యక్రమం అనంతరం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

సీఐడీ రీఓపెన్ పిటిషన్లపై విచారణ 22కి వాయిదా

సాక్షి, అమరావతి: రాజధాని అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో చోటు చేసుకున్న భారీ అక్రమాలపై మరిన్ని కీలక వివరాలు లభించాయని, అందువల్ల తమపై కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, నారాయణలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తిరిగి విచారణ చేపట్టాలంటూ సీఐడీ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాల్లో విచారణ ఈ నెల 22కి వాయిదా పడింది. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తారని, వ్యక్తిగత కారణాలతో ఈ రోజు విచారణకు రాలేకపోయారని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.దుష్యంత్‌రెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హైకోర్టు ఈ వ్యాజ్యాలపై విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో సీఐడీ 2021లో కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, నారాయణ అదే ఏడాది హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేసి దర్యాప్తుపై స్టే ఉత్తర్వులు పొందారు. ఈ వ్యాజ్యాలపై ఆగస్టులో జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు. ఆగస్టు 30న తీర్పు రిజర్వ్ చేశారు. తీర్పు వెలువరించాల్సి ఉన్న ఈ పరిస్థితుల్లో సీఐడీ ఇటీవల అనుబంధ పిటిషన్లు దాఖలు చేసింది.

ప్రజలంటే పురందేశ్వరికి చులకన

- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఏం చదువుకున్నారో గానీ ప్రజల తెలివితేటలపై ఆమెకు చాలా చులకన భావం ఉందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విమర్శించారు. అందుకే రాష్ట్రంలో మద్యం మృతులు 50 లక్షల మంది ఉన్నారని దిగ్భ్రాంతి కలిగించే అబద్ధాన్ని అవలీలగా వదిలారని తెలిపారు. కంటి శుక్లం ఆపరేషన్ చేయించుకుని కుడి కంటికి కట్టు కట్టుకున్న చంద్రబాబు ఎడమ కంటిలో ఆనందం చూడటం కోసమే ఆమె ఇలాంటి అసత్యాలు వల్లిస్తున్నారన్నారని విజయసాయిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

టీడీపీ, జనసేన నాటకాలు

- ధ్వజమెత్తిన ఎంపీ భరత్ రామ్



రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ, జనసేన, పార్టీలు సిగ్గు లేకుండా నాటకాలు ఆడుతున్నాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువలు లేకుండా తెలుగు రాష్ట్రాల్లో ప్రజలను మోసగించాలని ఆ పార్టీలు చూస్తున్నాయని మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీలో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేయాలని ఒప్పందం కుదుర్చుకుని తెలంగాణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తుండటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గతంలో టీడీపీ నేత కాబట్టి ఆయన పార్టీని గెలిపించేందుకు పోటీ నుంచి చంద్రబాబు తప్పుకున్నారన్నారు. తెలంగాణలో బీజేపీతో, ఆంధ్రాలో టీడీపీతో జనసేన పొత్తుని ప్రజలు స్వాగతించడం లేదన్నారు. బీజేపీకి టీడీపీ అంటే పడదని అటువంటిది జనసేన బీజేపీతో దాగుడు మూతలు ఆడుతోందన్నారు.

పవన్, చంద్రబాబుది రాష్ట్రానికో రాజకీయం

- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రానికో రాజకీయం చేస్తున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. విశాఖ నగరంలో శుక్రవారం రాత్రి మీడియాతో ఆయన మాట్లాడారు. పవన్ తెలంగాణలో బీజేపీకి మద్దతు తెలుపుతుండగా.. చంద్రబాబు కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్నారన్నారు. ఆ రాష్ట్రంలో వేర్వేరు పార్టీలకు మద్దతు తెలిపి ఏపీలో మాత్రం ఇద్దరూ కలిసి పనిచేస్తుండటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కాపులను ఒక సామాజికవర్గానికి పవన్ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీయేనని ప్రజలంతా నిర్ణయించుకున్నారని చెప్పారు.

జగనే రావాలి.. జగనే కావాలి

ఇంటింటా.. ప్రతి నోటా అదే నినాదం

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి విశేష స్పందన



కర్నూలు జిల్లా పెద్దకడబూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం పాములపర్రులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: ఏ ఇంటి తలుపుతట్టినా ఏ ఒక్కరిని కదిపినా ఒకే మాట.. ఒకే నినాదం.. అదే 'జగనే రావాలి.. జగనే కావాలి'. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నినాదం ప్రతిధ్వనిస్తోంది. వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. నాలుగున్నరేళ్లుగా చేసిన మంచిని వివరించడంతో పాటు గతంలో అధికారంలో ఉండగా చంద్రబాబు–పవన్ కళ్యాణ్ జోడీ చేసిన మోసాలను గుర్తు చేయడం, ఇప్పుడు మళ్లీ అదే జోడీ సుపరిపాలనను అడ్డుకోవడానికి వస్తున్నారనే విషయాన్ని చెప్పడమే లక్ష్యంగా చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం 26 జిల్లాల్లో 660 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో భారీ జనసందోహం మధ్య ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం ఆ 660 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నేతృత్వంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా చేసిన మంచిని.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడాన్ని వివరిస్తూ 24 పేజీలతో రూపొందించిన పుస్తకాన్ని ప్రతి ఇంటికీ అందించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు–పవన్‌లు ఇచ్చిన హామీలను.. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ ఇచ్చిన హామీల అమలు తీరుతో పోల్చుతూ నేతలు వివరిస్తున్నప్పుడు.. మోసం చేసిన చంద్రబాబు, పవన్‌ల మాటలను నమ్మం అంటూ ప్రతి ఇంటి అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు ప్రతిస్పందించారు. మంచి చేసిన జగన్ వెంటే నడుస్తామంటూ ప్రజాతీర్పు పుస్తకంలో తమ అభిప్రాయాన్ని నమోదు చేయించి.. 'ఆపు బాబు నాటకం.. జగనే మా నమ్మకం' అంటూ నినదించారు. 660 సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటి తలుపుతట్టే వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇక శుక్రవారం మరో 721 సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సచివాలయాల పరిధిలో ఇంటింటా ప్రచారం శనివారం నుంచి చేపట్టనున్నారు.

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పెద్దసవలాపురం సచివాలయంలో అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దంలో గ్రామ సచివాలయం-3 ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం వాకపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మీ ప్రోత్సాహం మరువలేను



ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న సీఎం జగన్

- వేముల మండల నాయకులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష
- ఇడుపులపాయ, జమ్మలమడుగు నూతన పోలీస్‌స్టేషన్లు ప్రారంభం
- వైఎస్సార్ జిల్లాలో ముగిసిన సీఎం పర్యటన

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం అలుపెరగకుండా శ్రమిస్తూ ప్రజలకు సహకారం అందిస్తున్న వేముల మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా వైఎస్సార్ జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం ఉదయం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో రూ.1.75 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, రూ.2.75 కోట్లతో నిర్మించిన జమ్మలమడుగు పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు. అనంతరం నెమళ్ల పార్కు వద్ద వైఎస్ ఫ్యామిలీ ప్రేయర్ హాలు ప్రాంగణంలో వేముల మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానికులు, స్నేహితులు, సన్నిహితులను ఒకేచోట కలుసుకున్న సీఎం జగన్ వారిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ హఠాన్మరణం అనంతరం మీరంతా అందించిన ప్రోత్సాహం, సహకారం, మనోధైర్యంతో ఈరోజు సీఎంగా అందరి మేలు కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గం, వేముల మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈ సందర్భంగా చర్చించారు.

'పాడా' అభివృద్ధిని వివరించిన కలెక్టర్

పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి జగన్‌కు కలెక్టర్ వి.విజయరామరాజు వివరించారు. వేముల మండల పరిధిలో పాడా, ఇతర శాఖల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియచేశారు. మండలంలో చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనులతోపాటు వివిధ అంశాలపై పలువురు నాయకులు వినతి పత్రాలను అందించి నేరుగా ముఖ్యమంత్రికి విన్నవించారు. పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌లో లైనింగ్ పనులు చేపట్టాలని వేముల మండల నాయకులు కోరారు. మైక్రో ఇరిగేషన్ పరిధిలో మంజూరైన 76 సంపులను త్వరితగతిన పూర్తి చేస్తే 15 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదం చేస్తుందని తెలిపారు. పెండ్లూరు చెరువు కాలువల ఆధునీకరణతో మరో 11 వందల ఎకరాలు ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. గాలేరు–నగరి కెనాల్ నుంచి నారేపల్లి చెరువుకు నీటిని లిఫ్ట్ చేస్తే మరిన్ని ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు. ఇవన్నీ పూర్తయితే మెట్ట ప్రాంతంలో 60 శాతం భూమి సాగునీటి పరిధిలోకి వస్తుందని వివరించారు. వేముల సమీపంలో బెరైటీస్, లైమ్ స్టోన్, బెలుకు లాంటి ఖనిజాలున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునేలా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని మరికొందరు విన్నవించారు. పత్తికి సీజనల్ క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింప జేయాలని, రబీలో మినుములు, పెసర రైతులకు రాయితీలు కల్పించాలని కోరారు.

భూ పరిహారంపై సమీక్షించండి

యూసీఐఎల్ యాజమాన్యం రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, తుమ్మలపల్లె ప్రాంతాల పరిధిలో 250 ఎకరాలను తీసుకుని పరిహారం ఇవ్వలేదని, భూములు కోల్పోయినవారికి ఉద్యోగాలు ఇవ్వలేదని స్థానికులు సీఎం జగన్ దృష్టికి తేవడంతో తక్షణమే స్పందించారు. దీనిపై సీఎస్ జవహర్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష నిర్వహించాలని తన వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయరెడ్డిని ఆదేశించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల రైతులను కూడా సమావేశానికి ఆహ్వానించి సమీక్ష నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం చివరలో ఈ నెల 14వతేదీ నుంచి 20 వరకు జరిగే 56వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా విడుదల చేశారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి, వేముల జడ్పీటీసీ కేవీ బయపురెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, వేముల మాజీ మండల ఉపాధ్యక్షుడు లింగాల రామలింగారెడ్డి, పొల్యూషన్ బోర్డు మెంబర్ మరకా శివకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ మోరంరెడ్డి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు

రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని గన్నవరం వెళ్లేందుకు మధ్యాహ్నం కడప ఎయిర్‌పోర్టు చేరుకున్న సీఎం జగన్ దంపతులకు పలువురు ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, జిల్లా ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, డీఐజీ సెంథిల్‌కుమార్, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, కడప మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు దాసరి సుధా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో మధుసూదన్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

రైతులకు అండగా నిలుస్తాం

వేముల మండల నాయకులు ప్రస్తావించిన అంశాలను సావధానంగా ఆలకించిన సీఎం జగన్ వీటిపై స్పందిస్తూ గత సర్కారు హయాంలో రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్‌పై అతి తక్కువ ఖర్చు చేశారని, మన ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లలో రూ.7,800 కోట్లు వ్యయం చేశామని గుర్తు చేశారు. వేముల పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు, రైతుల సమస్యలను పూర్తి వివరాలతో స్వీకరించాలని, పరిష్కార మార్గాలు సంతృప్తి కలిగించాయో లేదో నిర్ధారించుకొని ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. వారికి అందాల్సిన పరిహారం ప్రక్రియ నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామ లోగిళ్లలోనే సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను సంతృప్తికరంగా ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవస్థ సక్రమంగా నడవాలంటే ఎక్కడా వివక్షకు తావివ్వకూడదని సూచించారు. పరిపాలన పారదర్శకంగా సాగినపుడే వ్యవస్థ పటిష్టంగా సాగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అలుపెరుగకుండా శ్రమిస్తున్న పార్టీ నాయకులు, అధికారులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

'సంగం' సర్కారుదే

డెయిరీని కబ్జా చేసిన ధూళిపాళ్ల: మంత్రి సీదిరి

సాక్షి, అమరావతి: 'సంగం డెయిరీ కచ్చితంగా ప్రభుత్వ డెయిరీనే. ధూళిపాళ్ల నరేంద్ర అనే దొంగ సంగం డెయిరీని కబ్జా చేసి మింగేశారు' అని పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. పశువులు, మిల్క్ యూనియన్ డెయిరీల గురించి నాలుగైదు రోజులుగా విపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. ఎల్లోమీడియా దీనికి వంత పాడుతోందని దుయ్యబట్టారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

నరేంద్రకు ఆ అర్హతే లేదు..

ధూళిపాళ్ల నరేంద్రకు సంగం మిల్క్ యూనియన్‌లో కొనసాగే అర్హతలు, అవకాశాలే లేవు. ఆయన పేరిట అప్పటికే ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. అలాంటి వ్యక్తికి ప్రభుత్వ మిల్క్ యూనియన్‌లో సభ్యుడిగా ప్రవేశించే అర్హతే లేదు. ఎలాంటి అర్హతలు లేకుండానే ఆయన ప్రభుత్వ కో ఆపరేటివ్ సొసైటీ యూనియన్‌కు అధ్యక్షుడయ్యారు. తర్వాత జిల్లా మిల్క్ యూనియన్‌లో డైరెక్టర్ అయ్యారు. ఆ తర్వాత డిస్ట్రిక్ట్ మిల్క్ యూనియన్‌కు చైర్మన్ అయ్యారు. చైర్మన్ హోదాలో ఉంటూ కో ఆపరేటివ్ యాక్ట్ కింద ఉన్న సంగం డెయిరీని మ్యాక్స్ యాక్ట్‌లోకి కన్వర్ట్ చేశారు. ఆ తర్వాత సమయం చూసి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకున్నారు. ఆయన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పేరిట ఒక ట్రస్టు పెట్టి 10 ఎకరాల డెయిరీ భూమిని బదలాయించుకున్నారు. ఇదే ప్రభుత్వ భూముల్ని బ్యాంకులకు తనఖా పెట్టి రూ.100కోట్ల నుంచి రూ.150 కోట్లు వరకు రుణాలు తెచ్చుకున్నారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న సంగం డెయిరీ ధూళిపాళ్ల నరేంద్రకు ఎలా వచ్చింది? చంద్రబాబు సొంత మనిషి కావడంతో ప్రభుత్వ ఆస్తిగా ఉన్న డెయిరీని కబ్జా చేశారు. సంగం డెయిరీని ప్రజల ఆస్తిగా తిరిగి రాబట్టేందుకు న్యాయ పోరాటం చేస్తున్నాం. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడంలో చంద్రబాబు బృందం నైపుణ్యాలే ప్రత్యేకం.

చిత్తూరు డెయిరీకి పొగ

రాష్ట్రంలోని అనేక మిల్క్ యూనియన్ డెయిరీలను తాను నియమించిన జిల్లా అధ్యక్షులతోనే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా మార్చిన చంద్రబాబు చిత్తూరు జిల్లా విషయంలో తనదైన ప్రతిభను ప్రదర్శించారు. 5 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన డెయిరీని చంద్రబాబు తన స్వార్థానికి బలి చేశారు. దశలవారీగా దెబ్బ తీసి తన సొంత కంపెనీ హెరిటేజ్ డెయిరీని అక్కడ నెలకొల్పారు. చిత్తూరు డెయిరీని నిర్వీర్యం చేసి లిక్విడేషన్ స్థాయికి దిగజార్చడం చంద్రబాబు కుట్ర కాదా? ప్రభుత్వాధినేతలుగా ఉంటూ ప్రజల ఆస్తుల్ని తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటారా? ఇంతకంటే పాపం మరొకటి ఉండదు. రాష్ట్రంలోని ప్రైవేట్ డెయిరీలతో పాటు చంద్రబాబు హెరిటేజ్ కంపెనీకి కూడా ఒక ఛాలెంజ్ విసురుతున్నాం. మీరు మీ డెయిరీలను ప్రైవేట్ చట్టం నుంచి కో ఆపరేటివ్ యాక్ట్‌లోకి మార్చుకుంటే ప్రభుత్వం తరపున మీతో ఎంవోయూ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే సీఎం జగన్ పరిశీలనలోకి తీసుకుంటారు.


పాడి రైతులకు రూ.4,940 కోట్ల అదనపు లబ్ధి

అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం విజయవంతమైంది. జగనన్న పాలవెల్లువతో రైతులకు మేలు జరుగుతోంది. పాడి రైతులంతా అమూల్ వైపే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలోని పాడి రైతులకు రూ.4,940 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరింది. పవన్ కళ్యాణ్ సెన్సిబుల్ పర్సన్ కాదు. ఆయన జనసేనను అమ్మేశారు. మద్యం బ్రాండ్లపై అనుమానాలుంటే పురందేశ్వరి మొదట చంద్రబాబునే ప్రశ్నించాలి. బాబుకు వంత పాడుతూ పురందేశ్వరి చంద్రముఖిలా మారిపోయారు.

తక్కువ ధరకు వస్తుంటే ఎక్కువకు కొంటారా?

విద్యుత్ కొనుగోళ్లపై 'ఈనాడు' వింత కథ

- బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3 నుంచి రూ.4.50 మాత్రమే
- తక్కువకే దొరుకుతున్నప్పుడు ఎక్కువకెందుకు కొనడం?
- అందుకే స్వల్పకాలిక కొనుగోలు ఒప్పందాల నుంచి తగ్గింపు
- లోడ్ షెడ్డింగ్ లేకుండా రియల్ టైం మార్కెట్ నుంచి కొనుగోలు
- అవగాహన లేకుండా 'ఈనాడు' తప్పుడు కథనం



సాక్షి, అమరావతి: విద్యుత్ కొనుగోళ్లపై కనీస అవగాహన లేకుండా 'డిస్కంల మిగులు ఆట' అంటూ ఈనాడు ఓ తప్పుడు కథనాన్ని ప్రజలపై రుద్దింది. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విద్యుత్ దొరుకుతుంటే.. ఖరీదు ఎక్కువ ఉన్న స్వల్పకాలిక కొనుగోలు ఒప్పందాల నుంచి తగ్గిస్తున్నారంటూ ఓ వింత కథ అల్లింది. డిస్కంలకు.. తద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరే నిర్ణయాన్ని తప్పుపట్టింది. ఈ విషయంలో వాస్తవాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు వెల్లడించారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

- రాష్ట్రంలో మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ డిమాండ్ తగ్గింది. దానివల్ల స్వల్పకాలిక కొనుగోలు ఒప్పందాల నుంచి ఈ నెలలో రావాల్సిన విద్యుత్‌ను నిబంధనలకు అనుగుణంగా డిస్కంలు తగ్గించుకున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా వారం ముందు ప్రణాళికలో భాగంగా విద్యుత్ సేకరణ తగ్గించాయి. రోజువారీ, రియల్ టైం గ్రిడ్ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి తగ్గితే రియల్ టైం మార్కెట్ నుంచి కొని లోడ్ షెడ్డింగ్ రాకుండా, వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నాయి. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి. విద్యుత్ ఉత్పత్తిని ప్రతి నిమిషానికీ సర్దుబాటు చేస్తూ రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ సూచనల ప్రకారం అవసరమైన సమయంలో మార్కెట్ నుండి విద్యుత్ సేకరిస్తున్నాయి.
- దేశం మొత్తం డిమాండ్ తగ్గడంతో ప్రస్తుతం మార్కెట్‌లో విద్యుత్ ధరలు తగ్గాయి. యూనిట్ రూ.3 నుంచి రూ.4.50కే లభిస్తోంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని డిస్కంలు స్వల్పకాలిక ఒప్పందాల కొనుగోలు తగ్గించి, మార్కెట్ నుంచి అవసరానికి తగ్గట్టు కొంటున్నాయి. దీనివల్ల డిస్కంలకు ఆర్థిక లాభం చేకూరుతుంది. అంతేగానీ చేతిలో ఉన్న విద్యుత్‌ను వదిలేసి మార్కెట్ నుంచి కొనేందుకు డిస్కంలు పరుగులు పెట్టడం లేదు.

చంద్రబాబు హయాంలోనే అనవసర ఒప్పందాలు

రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నప్పటికీ బ్యాక్ డౌన్ చేసి అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు జరిగింది చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే. రాష్ట్రంలో 2015-16 మధ్య 642 మిలియన్ యూనిట్లు, 2016-17లో 12 వేల మిలియన్ యూనిట్లు, 2018-19లో 7,600 మిలియన్ యూనిట్ల మిగులు విద్యుత్ ఉండేది. రూ.2.40కు లభిస్తున్న బొగ్గు ఆధారిత ఈ మిగులు విద్యుత్‌ను బ్యాక్ డౌన్ (వృథా) చేసి ప్రైవేటు విద్యుత్ కొనుగోలును చంద్రబాబు ప్రోత్సహించారు. పవన విద్యుత్‌ను యూనిట్‌కు ఏకంగా రూ.4.84కు తీసుకున్నారు. ఫిక్స్‌డ్ చార్జీతో కలిపి ఈ ధర రూ.5.94 అయ్యేది. సౌర విద్యుత్ యూనిట్ రూ.3.54 కు బదులు రూ.8.90 వెచ్చించారు. ఇలా దాదాపు 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల ఏటా రూ.3,500 కోట్లు భారం ఇప్పటికీ పడుతోంది.



"మానవుడు జీర్ణమైన వస్త్రాలను విసర్జించి కొత్త వాటిని ఎలా ధరిస్తాడో,
అలాగే దేహధారి జీర్ణమైన శరీరాలను విసర్జించి కొత్తవాటిని స్వీకరిస్తాడు.
– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, 11 నవంబర్ 2023

కష్టాల్లో 'ఫైర్ బ్రాండ్'

తొలిసారి చట్టసభల్లో అడుగుపెట్టినవారికి గుర్తింపు రావటం అంత సులభం కాదు. ప్రసంగించే అవకాశం లభించటం, దాన్ని సద్వినియోగం చేసుకోవటం చాలా అరుదు. మహిళా ఎంపీల విషయంలో దాదాపు అసాధ్యం. కానీ రాజకీయ రంగప్రవేశం చేసిన కొద్దికాలంలోనే తృణమూల్ కాంగ్రెస్ తరఫున ఎన్నికై లోక్‌సభలో ప్రవేశించిన మహువా మొయిత్రా చాలా త్వరగానే 'వార్తల్లో వ్యక్తి' అయ్యారు. తీరా నాలుగేళ్లయ్యే సరికల్లా వివాదంలో చిక్కుకున్నారు. ఏం జరిగిందో అందరూ గ్రహించే లోగానే ఉరుము లేని పిడుగులా, ఊహించని ఉత్పాతంలా వచ్చిపడిన వివాదం చివరికామె పార్లమెంటు సభ్యత్వానికి కూడా ఎసరుపెట్టేలా పరిణమించింది. సభ్యుల నైతిక వర్తనను నియంత్రించే లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ఆమెను సభ నుంచి బహిష్కరించాలని స్పీకర్‌ను కోరుతూ గురువారం నివేదికను ఆమోదించింది. ఇందుకు ప్రధానంగా అనైతిక వర్తన, తీవ్ర తప్పిదాలకు పాల్పడటం కారణాలుగా చూపింది. అంతేకాదు... ఈ విషయంలో సంస్థాగత విచారణ, చట్టపరంగా గట్టి చర్యలు అవసరమని సిఫార్సు చేసింది. పార్లమెంటు సభ్యులు సభలో ప్రశ్నలు వేయటానికి వినియోగించే ఎన్ఐసీ వెబ్‌సైట్ లాగిన్, పాస్‌వర్డ్ ఆమె తన స్నేహితుడైన దుబాయ్ రియలెస్టేట్ వ్యాపారి దర్శన్ హీరానందానీకి ఇచ్చారనీ, ఆయన నుంచి కోటి రూపాయల ముడుపులు తీసుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీ సంస్థలపై ప్రశ్నలు సంధించారనీ మొయిత్రాపై వచ్చిన ఆరోపణలు. ఆ ప్రశ్నలు అదానీ సంస్థల ప్రయోజనాలు దెబ్బతీసేంత తీవ్రమైనవా? అందువల్ల హీరానందానీకి ఒరిగేదేమిటి? ముడుపుల సంగతిని మొయిత్రా తోసిపుచ్చారు. లాగిన్, పాస్‌వర్డ్ ఇచ్చినట్టు అంగీకరించారు. అందుకుగల కారణాలు చెప్పారు. ఇదంతా దేశభద్రతకు ముప్పు తెచ్చే చర్య అనీ, లంచం తీసుకుని ప్రశ్నలేయటం అనైతికమనీ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే గత నెలలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. కమిటీ విచారణ తీరుతెన్నులను ప్రశ్నిస్తూ ఇప్పటికే మొయిత్రా ఓం బిర్లాకు లేఖ రాశారు. కమిటీ తనను ప్రశ్నించిన తీరు 'వస్త్రాపహరణం' మాదిరిగా వున్నదంటూ దుయ్యబట్టారు.

మొయిత్రా రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వలె ఆంగ్ల భాషాప్రావీణ్యం వుండటం వల్లనే త్వరగా ఆమెకు పేరుప్రతిష్ఠలు సాధ్యమైనాయని అనుకోవటానికి లేదు. ప్రసంగించదల్చుకున్న అంశంపై పట్టు సంపాదించటం ఒక్కటే మొయిత్రా ప్రత్యేకతని చెప్పడానికి కూడా లేదు. విషయ పరిజ్ఞానంతోపాటు విస్ఫులింగాలు విరజిమ్మే స్వభావం, నిర్భీతిగా పాలక పక్షాన్ని నిలదీసే తత్వం ఆమెకొక విశిష్టతను తీసుకొచ్చాయి. అంతకుముందు మూడేళ్లు ఆమె తృణమూల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. కానీ మొయిత్రా గురించి దేశానికంతకూ తెలిసింది ఈ నాలుగేళ్ల కాలంలోనే. సభలోనే కాదు... వెలుపల కూడా ఆమె ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నిప్పులు చిమ్ముతారు. మూకుమ్మడి అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్షపడిన గుజరాత్ దోషులకు క్షమాభిక్ష పెట్టడాన్ని సవాలు చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎథిక్స్ కమిటీ విచారణలో నిర్ధారించిన అంశాలేమిటో, అవి ఏరకంగా తీవ్రమైన స్వభావంతో కూడుకున్నవో ఇంకా తెలియాల్సి వుంది. ఎన్ఐసీ లాగిన్, పాస్‌వర్డ్ ఇవ్వటం విషయంలో ఇంతవరకూ ఎలాంటి నిబంధనలూ లేవు. అయినా సరైంది కాదనుకుంటే ఆమెను మందలించవచ్చు. కమిటీలోని విపక్ష సభ్యులు చెబుతున్న ప్రకారం 800 మంది ఎంపీల్లో అనేకులు సగటున కనీసం ఇద్దరు ముగ్గురికి ఇలా ఇస్తారు. కంప్యూటర్‌ల వాడకం, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవటం ఇందుకు కారణం. ఈ విషయంలో స్పీకర్ ఏం నిర్ణయిస్తారన్నది చూడాలి. ఆ సంగతలా వుంచితే ఫిర్యాదు, విచారణ వగైరాలన్నీ ఆదరా బాదరాగా సాగినట్టు కనబడుతోంది. అక్టోబర్ 26న కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ నెల 2న జరిగిన రెండో సమావేశం మధ్యలోనే ముగిసింది. అడిగినవాటికి జవాబివ్వకుండా ఆమె దుర్భాషలాడారని కమిటీ ఛైర్మన్ వినోద్ కుమార్ సోంకార్ ఆరోపిస్తే... ఫిర్యాదుతో సంబంధం లేని ప్రశ్నలతో తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా వేధించారన్నది మొయిత్రా ఆరోపణ. దుబాయ్ వెళ్తే ఏ హోటల్‌లో దిగుతారు... మీతో ఎవరుంటారు... మీరు మీ మిత్రులతో మాట్లాడుతున్నట్టు వారి భార్యలకు తెలుసా అని అడిగారని కూడా ఆమె ఆరోపించారు. దీనికి నిరసనగా ఆమె, విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. కమిటీ విచారణ గోప్యం కనుక ఆరోపణలు, ప్రత్యారోపణల్లో నిజానిజాలేమిటో తెలియదు. అయితే ఈ మొత్తం వ్యవహారం మన పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నది మాత్రం వాస్తవం.

అసలు దూబే ఫిర్యాదుకు మొయిత్రా మాజీ సహచరుడు దేహద్రాయ్ లేఖ ఆధారమన్న సంగతి కమిటీకి తెలుసా? కమిటీకిచ్చిన అఫిడవిట్‌లో మొయిత్రాకు ముడుపులు చెల్లించానని హీరానందానీ అంగీకరించారా? లేదని విపక్ష సభ్యులు చెబుతున్నారు. విడిపోయిన జంట పరస్పరం ఆరోపించుకోవటం సర్వసాధారణం. ఇప్పటికే పెంపుడు కుక్క విషయంలో వారిద్దరూ కేసులు పెట్టుకున్నారు. కనుక దేహద్రాయ్ ఫిర్యాదు అంశంలో దూబే, ఎథిక్స్ కమిటీ ఆచితూచి అడుగు లేయాల్సింది. మహిళ గనుకే ఇలా చేశారన్న అపవాదు రానీయకుండా చూసుకోవాల్సింది. ఈ వ్యవహారంలో వ్యక్తిగతం, రాజకీయం కలగాపులగం చేశారన్న అప్రదిష్ట కలగడమూ మంచిది కాదు. ఏదేమైనా వ్యవస్థను ఢీకొట్టేవారు నిరంతరం అత్యంత జాగురూకతతో మెలగాలని మొయిత్రా ఇప్పటికే గుర్తించి వుంటారు. ఈ వివాదంలో పార్లమెంటరీ వ్యవస్థ ఔన్నత్యానికి అనుగుణమైన నిర్ణయం వెలువడాలని అందరూ కోరుకుంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.త్రయోదశి ప.12.47 వరకు తదుపరి చతుర్దశి, నక్షత్రం: చిత్త రా.1.43 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.8.30 నుండి 10.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.04 నుండి 7.34 వరకు, అమృతఘడియలు: సా.6.49 నుండి 8.33 వరకు, శని త్రయోదశి, మాసశివరాత్రి.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బాబు వారి అవినీతి చరితము

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

దేశంలోనే అత్యంత అవినీతిపరుడిగా నారా చంద్రబాబు నాయుడు అపఖ్యాతి మూటగట్టుకున్నాడు. చిన్న పూరిల్లు, రెండెకరాల పొలంతో చంద్రబాబు జీవితం మొదలైంది. కానీ 2004లో ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి అతని ఆస్తులు లక్ష కోట్లకు చేరినాయని అంచనా. అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన వాళ్లంతా అనుయాయుల రూపంలో ఇతని వెంటే ఉంటారు. ఇక 2014లో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని ఎలా లూటీ చేశాడో మొత్తం అవినీతి చరిత్రంతా ఆంధ్రప్రదేశ్ 'సీబీసీఐడీ' వారు సాక్ష్యాధారాలతో సహా కోర్టు ముందుంచారు. 2014 నుండి 2019 వరకు అతడు చేసిన అవినీతి పనులు, సంపాదించిన దాదాపు 6 లక్షల కోట్ల ధనం మీద ఇప్పుడు విచారణ మొదలైంది.

కోర్టు తీర్పుల వలన లభించిన ప్రోత్సాహంతో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు మరీ బరితెగించాడు. భార్య, కొడుకు పేర్లతో వందల కోట్ల రూపాయల విలువగల భూ క్రయ, విక్రయాలు కొనసాగించాడు. చివరకు రెండెకరాల ఆస్తి మాత్రమే కలిగిన వృద్ధురాలైన తన తల్లి అమ్మణ్ణమ్మను కూడా ఈ అవినీతి జాబితాలోకి లాక్కొచ్చాడు. ఆమె హైటెక్ సిటీ దగ్గర 35 లక్షలకు 5 ఎకరాల భూమిని కొని, దానిని ఆస్తిపరుడైన మనుమడికి కానుకగా ఇచ్చిందంటే నమ్మే విషయమేనా?



కోల్పోయిన 'ట్రస్ట్'

1995లో ముఖ్యమంత్రి పదవి చేపట్టి వారం రోజులు పూర్తి కాకుండానే మాదాపూర్‌లో ఒక ప్రభుత్వ అధీన సంస్థకు చెందిన 140 ఎకరాల భూమి, ఆ తరువాత అదే సంస్థకు చెందిన మరో 18 ఎకరాల భూమిని ఎల్ అండ్ టీ కంపెనీకి స్వాధీనం చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం వెనుక పెద్ద గూడుపుఠాణియే జరిగింది. ఆ కంపెనీ అధిపతి రామకృష్ణకూ, చంద్రబాబు నాయుడికీ ఉన్న సాన్నిహిత్యంతో అదే ఎల్ అండ్ టీ కంపెనీ భాగస్వామ్యం గల ప్రయివేటు సంస్థకు కాకినాడ రేవును అప్పగించాడు. 1,500 కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టులు ఎల్ అండ్ టీ కంపెనీకి అందాయి. దాని ఫలితంగా బంజారాహిల్స్‌లో 'హుడా' వారు మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించాలనుకున్న స్థలాన్ని స్వాధికారికంగా తనకు తనే అప్లికేషన్ పెట్టుకొని, ఆ స్థలాన్ని పొంది, ఇదే ఎల్ అండ్ టీ కంపెనీ రామకృష్ణ గారి దయతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనాన్ని నిర్మించిన మాట వాస్తవం కాదా?

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 'వెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ' పేర ఉన్న భవనం, పంజాగుట్టలో హెరిటేజ్ ఫుడ్స్ ప్రధాన కార్యాలయ భవనం, లెక్కల్లో చూపని ఆస్తులు. ప్రైవేట్ పవర్ ప్రాజెక్టుల కుంభకోణాలలో చంద్రబాబు సహాయం పొందిన ఒక కంపెనీ యాజమాన్యం పంజాగుట్ట భవన పునర్నిర్మాణానికి 2, 3 అంతస్తులు పెంచటానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

ఇంకా ఇతర ఆస్తులు: నల్లగొండ జిల్లా ఎమ్.డి.ఎల్. యల్లారెడ్డిగూడలో 19 సెంట్ల భూమి, ఎసి.ఓ. కొత్తగూడ, శేరిలింగంపల్లి మండలం ఆర్ఆర్ వద్ద 19 ఎకరాల భూమి, తమిళనాడులోని శ్రీపెరంబదూర్ సమీపంలోని టెన్నార్ కుప్పం గ్రామంలో 2.23 ఎకరాలు, మాదాపూర్‌లోని శ్రీరామ అగ్రికల్చరల్ ఫామ్‌లో 3.28 ఎకరాలు, వివిధ కంపెనీలలో రూ. 1 కోటీ 12 లక్షల 31 వేలు – ఇవన్నీ అతను ప్రకటించిన ఆస్తులే. ఇవి కాక శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో సుమారు 25, 30 రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా చంద్రబాబు అతని కుటుంబ సభ్యులు, సమీప బంధువులు వ్యాపార లేదా అవినీతి వాటాదారులు ఎన్నో స్థలాలను కొన్నారు. ఈ భూముల విలువ పెంచటానికి చంద్రబాబు ప్రజాధనంతో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి ఆ స్థలాల ధరలను పెంచుకున్నాడు.

ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను తన చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి భూతాల గృహంగా మారిన రామకృష్ణ స్టూడియోను అద్దెకు తీసుకోవటానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో, ప్రభుత్వం తరఫున ఉన్న రేట్ల కంటే రెట్టింపు కిరాయికి తీసుకొని నెలకు 12 లక్షల ప్రభుత్వ ధనాన్ని చెల్లించాడు. ఏ మాత్రం సౌకర్యాలు లేని ఆ స్టుడియోలోకి 'స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్' కార్యాలయాన్ని బలవంతంగా బదిలీ చేయించి అధికారులు, సిబ్బంది, విజిటర్స్‌ను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు.

వెయ్యి పేజీల పుస్తకమే!

ఆ సమయంలో వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్లో ఎక్కువ శాతం మాయమైపోయి ప్రజలకు, నిరుపేద దళిత విద్యార్థులకు అరకొరగా మాత్రమే లభించాయి. పనికి ఆహార పథకం కింద బియ్యం, స్టేషనరీ కొనుగోలులో కోట్లాది రూపాయలు గల్లంతయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బ్రూవరీస్ ప్రభుత్వ సంస్థకు మద్యం విక్రయించే ఉత్పత్తిదారులు, ఇతర రాష్ట్రాల్లో అమ్మే ధర కంటే ఏపీలో ఎక్కువ ధరకు పెంచి, ఆ లాభాల్లో చంద్రబాబుకు వాటా ఇచ్చేవారు. విద్యుత్ సంస్థల్లో కూడా అధిక ధరలకు అవకాశం ఇచ్చి వారిచ్చే లంచాలకు ఆశపడేవాడు. ఇక ఇతని బినామీలుగా మురళీ మోహన్, సీఎం రమేశ్ ప్రసిద్ధి చెందారు. ఇతని దారుణాలు ఇంకా చాలా ఉన్నాయి. అబ్బో...

'నారా'వారి అవినీతి చరిత్ర 1,000 పేజీల పుస్తకం అవుతుంది. దేవాలయ భూములు కోట్ల రూపాయల విలువ చేసేవి లక్షల రూపాయలకు అక్రమంగా విక్రయం అవుతున్నట్లు ఆనాడు చిన్నజీయర్ స్వామి వంటి వారే ఆరోపించారు. ఈ అక్రమ సంపాదనంతా ఎన్టీఆర్ ట్రస్ట్‌కు విరాళాల రూపంలో అందేది. అలాగే సిమెంట్ ఉత్పత్తిదారులు, స్టీలు, ఇసుక, కంకర వ్యాపారులకు ధరలు అధికంగా పెంచుకోవటానికి అనుమతినిచ్చి వారినుండి పెద్ద స్థాయిలో ముడుపులు తీసుకునేవాడు.

చివరకు వ్యవసాయదారుల నోట్లో మట్టికొట్టే విధంగా ఎన్నో కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మే సంస్థలకు అనుమతినిచ్చి వారి నుండి భారీగా డబ్బు వసూలు చేసేవాడు. దానివలన మోసపోయిన రైతులు సరిగా పంటలు పండక అప్పులపాలై చివరకు కొన్ని వేల మంది ఆత్మహత్యలకు పాల్పడితే నామమాత్రపు పరిహారాన్ని ప్రకటించి దానిని కూడా 'కడతేరని కష్టాలు కాదు, కడతేరితే ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం' అంటూ అమానవీయంగా ప్రకటన చేయించాడు. ఇతని హయాంలో అంటే 1998–99లో ఒక్క వరంగల్ జిల్లాలోనే 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కార్పొరేట్ వ్యవసాయం పేరుతో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశాడు. ఇతని హయాంలోనే ఎంతోమంది చేనేత కార్మికులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. కరెంటు లేక, పొలాలకు నీళ్ళందక లక్షల హెక్టార్లలో పైరులు ఎండిపోయాయి. అడిగినవాళ్ళను కాల్పించి తప్పించాడు. అందుకే 'తెలంగాణ వాదం' మరొక్కసారి ఊపిరి పోసుకుని ఉద్యమించింది.

తన కోసమే జనమనే అహంకారం

ఇప్పటికీ ఇతనికి కనువిప్పు జరగలేదు. 'తన కోసమే జనం తప్ప, జనం కోసం తాను కాదనే' అహంకారాన్ని పెంచుకున్నాడు. ఎన్ని పరాభవాలు జరిగినా ఇప్పటికీ అతని అవివేకపు కార్యక్రమాలు మానలేదు. ఇతడి వలన తెలుగుజాతి, తెలుగుదేశం పార్టీ పరువు దిగజారిపోయాయే తప్ప దేశ చరిత్రలో గొప్ప స్థానం పొందిన పథకం ఒక్కటీ రూపొందలేదు. పైగా, తెలుగు రాష్ట్రం మీద కొంచెం కూడా అవగాహన లేని ఇతడు విదేశాల మీద మోజుతో ప్రతి విదేశీ పథకాలను ప్రస్తావించేవాడు. ఉదాహరణకు మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమకు జర్మనీ, జపాన్‌లను, ఇన్ఫర్మేషన్‌కు ఇజ్రాయేల్‌ను అస్తమానం పొగుడుతూ సొంత రాష్ట్రాన్ని మట్టికరిపించాడు. ఎప్పుడు ఇతను అధికా రానికొచ్చినా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచటమే. ఆర్థికంగా, రాష్ట్రాన్ని దివాళా తీయించడం, అప్పులు చెల్లించలేనంత ఆర్థిక దుఃస్థితిలో ఉంచటం పరిపాటిగా మారింది. విపరీతమైన ధనకాంక్షతో హద్దుమీరి ప్రజాధనాన్ని లూటీ చేసి విదేశాలలో వ్యాపారాల మీద పెట్టుబడులు పెట్టాడు. 2004లో ఇతను దిగిపోయే నాటికి అతని ఆస్తులు లక్ష కోట్లకు చేరినాయని అంచనా. ఇక 2014లో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని ఎలా లూటీ చేశాడో మొత్తం అవినీతి చరిత్రంతా ఆంధ్రప్రదేశ్ 'సీబీసీఐడీ' వారు సాక్ష్యాధారాలతో సహా కోర్టు ముందుంచారు. గౌరవ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గారు అసెంబ్లీలో వాటి వివరాలను ప్రెజెంట్ చేయడం జరిగింది.

అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన వాళ్లంతా అనుయాయుల రూపంలో, అధికారుల రూపంలో ఇతని వెంటే ఉంటారు. వాళ్ళు పట్టుబడినా శిక్షలు ఉండవు. దొంగ నోట్లు ముద్రించిన రామకృష్ణ గౌడ్, కృషి బ్యాంక్ ద్వారా ప్రజల్ని మోసం చేసిన వెంకటేశ్వర రావు, విద్యార్థి స్కాలర్ షిప్పులను మాయం చేసిన వారు, పేదవాడి పనికి కూలీగా ఇచ్చిన బియ్యాన్ని లారీలు లారీలు అమ్ముకున్న పెద్ద మనుషులు, హత్యల్లో, బాంబు పేలుళ్లలో ప్రసిద్ధి చెందినవారంతా ఇతని అనుచరగణమే. ఏ శిక్షలూ ఉండవు. డబ్బు సంపాదించు, ఎన్నికల్లో గెలువు... ఇక వేరే పాపపుణ్యాల సంగతి నీకెందుకు – ఇదే ఆయన పార్టీ వారికి ఇచ్చిన గొప్ప సందేశం.

అదొక చీకటి యుగం

అలాగే ఇతని 2020 విజన్ గమనిస్తే తెలుగు రాష్ట్రాల పరిస్థితులు భౌగోళిక స్థితులు ఏ మాత్రం అవగాహన లేనట్లు కన్పిస్తుంది. మొత్తం ఇతని పరిపాలనా కాలమంతా విదేశీ పొగడ్తలతోనే సరిపోయింది. స్వార్థపరత్వం, పదవీ లాలస, అవినీతి... ఇతని సహజ లక్షణాలు. 14 సంవత్సరాల ఇతని పాలనా కాలమంతా ఆంధ్ర రాజకీయ చరిత్రలో ఒక చీకటి యుగంగా పరిగణించవచ్చు.

ప్రతి వ్యవస్థలో తన వ్యక్తులను ప్రవేశపెట్టి, కోర్టులను సైతం పక్కదారి పట్టించి, వచ్చిన కేసులన్నీ విచారణకు రాకుండానే కొట్టి వేయించుకోవడం ఇతనికే సాధ్యపడిన గొప్ప కళ. జస్టిస్ బీఎస్ఏ స్వామి గారు తాను రాసిన 'ఎ కాస్ట్ క్యాప్చర్స్ ఏపీ జ్యుడీ షియరీ' అనే పుస్తకంలో చంద్రబాబుకూ, న్యాయమూర్తులకూ ఒక మాజీ న్యాయమూర్తి అనుసంధానకర్తగా వ్యవహరించారు అని రాశారు. దీనిని బట్టే అర్థమౌతున్నది కదా, ఇతని కేసులన్నీ ఎందుకు పక్కదారి పట్టాయో! ఇతని హయాంలో మీడియాకు పెద్ద ఎత్తున నిధులు ఇవ్వబడ్డాయి. ఒక్క 'ఆంధ్రజ్యోతి'కే 750 కోట్లు ఇచ్చాడంటేనే మీడియానెంతగా జేబులో పెట్టుకున్నాడో అర్థమౌతున్నది.

ఇతని దరిద్రపు పాలనలో ఎన్నో పెద్ద పరిశ్రమలు మూతబడ్డాయి. పేద విద్యార్థులు పై చదువులకు దూరమయ్యారు. ఇతను ప్రోత్సహించిన ప్రయివేటు విద్యాసంస్థలు ఇతనికి ముడుపులు చెల్లిస్తూ భారీ ఫీజులు పెంచి విద్యార్థులను పీడించాయి. చివరకు కోలా కృష్ణమోహన్ వంటి 'యూరో లాటరీ' మోసగాడి నుండి కూడా ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 10 లక్షల విరాళం తీసుకున్నాడంటే ఎంత దిగజారుడు మనస్తత్వమో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటివరకు రాసిందంతా 2004 ఎన్నికల ముందు వరకు ఈ దేశంలో సంపాదించిన అక్రమాస్తులను గురించి. ఇంకా సింగపూర్, మలేషియా, మారిషస్, దుబాయ్, స్విట్జర్లాండ్, అమెరికాలో ఉన్న ఆస్తుల వివరాలన్నీ వేరే.

ఇన్నాళ్ళకైనా అతని పాపాలు, అవినీతి చిట్టాలు బయటకు రావటానికి కారణమైన కేంద్ర సంస్థలు ఐటీ, ఈడీలకూ, రాష్ట్ర సీబీడీ వారికీ, ధైర్యంతో ఎన్నికలను కూడా లెక్క చేయకుండా ఈ కేసుల్ని బయటకు తీసుకురావటంలో సహకరించిన ముఖ్యమంత్రి, గౌరవనీయులు జగన్ మోహన్ రెడ్డి గారికీ ఈ రాష్ట్ర ప్రజలు కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది.

2014 నుండి 2019 వరకు అతడు చేసిన అవినీతి పనులు, సంపాదించిన దాదాపు 6 లక్షల కోట్ల ధనం మీద ఇప్పుడు విచారణ మొదలైంది గనుక ప్రజలందరికీ అవి అందుబాటులో ఉన్నాయని రాయటం లేదు. ప్రజలందరూ అర్థం చేసుకోగలరు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

ఇన్ బాక్స్

భవితను నిర్ణయించే హక్కు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. కాని ఈనాడు ఓటును అమ్మే, కొనే సరుకుగా మార్చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి తీరని నష్టం. ప్రజలు తమకు సేవచేయడం కోసం ఐదేళ్ళ కాలపరిమితికి సేవకుల్ని ఎన్నుకోగలిగిన అవకాశాన్ని ఇచ్చేది ఓటు. ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటు హక్కును వినియోగించుకోవాలి. నిరక్షరాస్యులే కాదు, ఉన్నత విద్యావంతులు సైతం ఓటు హక్కును బాధ్యతగా వినియోగించు కోవడం లేదు. మన భవితను నిర్ణయించే ఓటు హక్కు పట్ల నిర్లిప్తత ఎంతమాత్రం మంచిది కాదు. ముఖ్యంగా యువత నిర్లిప్తత వీడి బాధ్యతను గుర్తించాలి. యువతరంతోనే మార్పు సాధ్యమవుతుంది.

అవినీతికి, అక్రమాలకు పాల్పడని వారూ, ప్రజాస్వామ్యం, సెక్యులర్ విలువల పట్ల అపార నమ్మకం కలిగిన వారినే ఎన్నుకోవాలి. 'అందరూ అందరే' అన్నట్లుగా అభ్యర్థులున్నప్పుడు, ఉన్నంతలో మెరుగైన వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. మతోన్మాద ఫాసిస్టు భావాలు కలిగిన వారిని చట్టసభల్లోకి రాకుండా చూడాలి. ప్రజల మనోభావాలతో ఆడుకొనేవారినీ, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లోను చేసి ఓట్లు కొల్లగొట్టాలనచూసే వారినీ చిత్తుచిత్తుగా ఓడించాలి.

ఏవిధంగా చూసినా, ఈ ఎన్నికలు చాలా కీలకమైనవి. మతోన్మాద శక్తులు మన సంస్కృతినీ, సామరస్య వాతావరణాన్నీ కలుషితం చెయ్యాలని చూస్తున్నాయి. అలాకాకుండా గంగా జమునా తహజీబ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరిదీ. మతోన్మాద శక్తులకు ఏమాత్రం అవకాశం ఇచ్చినా లౌకిక విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యమై ఉన్మాద భావజాలం రాజ్యమేలుతుంది. అభ్యర్థి నచ్చని పక్షంలో ఓటువేయకుండా ఉండడం సరికాదు. చివరి అస్త్రంగా మాత్రమే 'నోటా'కు ఓటువేసి, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా బరిలో ఉన్న అభ్యర్థులెవరూ అర్హులు కాదన్న సంకేతాన్ని ఇవ్వవచ్చు.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

దేశ విభజనను వ్యతిరేకించిన దేశ భక్తుడు

సందర్భం




డొక్కా మాణిక్య వరప్రసాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు, విద్యావేత్త, రచయిత. భారత స్వాతంత్ర్యం కోసం సామాజిక సాంస్కృతిక అంశాలపై విశ్లేషణలతో కూడిన వ్యాసాలు రాశారు. పద్నాలుగు ఏళ్ళకే 'ది వాయిస్ ఆఫ్ ట్రూత్' అనే జర్నల్‌ను నడిపారు. ఆయన భారతీయత నిండిన మేధావి. స్వాతంత్ర్యానంతరం మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి. జాతీయ విద్యావిధాన రూపశిల్పి. ఆయన పుట్టినరోజును భారతీయ అక్షరాస్యతా దినోత్సవంగా మనం జరుపుకొంటున్నాం.

భారత స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించిన ముస్లిం దేశభక్తుల్లో ఆజాద్ అగ్రగణ్యులు. ఆయన సనాతన పండిత వంశంలో జన్మించారు. బాల్యం కలకత్తాలో గడిచింది. ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాల్, అరబిక్, ఇంగ్లిష్ భాషలను నేర్చుకున్నారు. తత్వ శాస్త్రం, గణితాల్లో ప్రావీణ్యం సంపాదించారు. లార్డ్ కర్జన్ 1905లో బెంగాల్‌ను విభజించినపుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ''అల్‌హిల్'' అనే పత్రికను స్థాపించి జాతీయ భావాలను ప్రచారం చేశారు.

గుజరాత్‌లోని 'చౌరీ చౌరా' వద్ద జరిగిన హింసాత్మక సంఘటనలకు నిరసనగా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేశారు. దీనికి గాంధీ నాయకత్వంపై తిరుగుబాటు వచ్చింది. ఆజాద్ మిత్రుడు బెంగాల్ వాసి సి.ఆర్. దాస్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి 'స్వరాజ్య' పార్టీని స్థాపించారు. అయినా ఆజాద్ గాంధీతోనే ఉండి తన రాజకీయ దృక్పథాన్ని వెల్లడించారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా దేశమంతటా పర్యటించారు. పర్యటన అనంతరం ముస్లింలకు ప్రత్యేక ఎన్నికల విధానం కావాలని ముస్లింలీగ్ నేతలు చేపట్టిన ఉద్యమాన్ని వ్యతిరేకించారు. నెహ్రూతో ఉన్న సాన్నిహిత్యంతో భారతదేశం స్వాతంత్ర్యానంతరం సోషలిజం భావజాలంతో అసమానతలు, పేద



రికం లేని గొప్ప దేశంగా ఎదగాలని తపించారు. లక్నో కాంగ్రెస్ సభలో సోషలిజం సాధనకై కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని ఉద్ఘాటించారు.

1940లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గెలిచి దేశమంతటా పర్యటించి హిందూ ముస్లిం ఐక్యత కోసం పనిచేశారు. దేశ విభజన సమయంలో హిందూ ముస్లిం అల్లర్ల వల్ల ఆజాద్ తీవ్రంగా కలత చెందారు. బెంగాల్, బిహార్ ప్రాంతాల్లో పర్యటించి మత సామరస్యం కోసం కృషి చేశారు. దేశాన్ని ఇండియా, పాకిస్తాన్‌లుగా విభజించాలనే బ్రిటిష్ ప్రతిపాదనపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చర్చ జరిగినపుడు ఆజాద్ ఆ చర్చను బహిష్కరించారు. భారత ఉపఖండమంతా ఐక్యంగా ఉండాలని ప్రొవిన్షియల్ రాష్ట్రాలకు అత్యధిక అధికారాలు ఇస్తూ, కేంద్రం పరిమితమైన అధికారాలతో ఉండే ప్రతిపాదనలను ఆజాద్ చేశారు. తద్వారా హిందూ, ముస్లింల మధ్య ఐక్యత సాధించి భారత ఉపఖండమంతటినీ ఐక్యంగా ఉంచవచ్చునని కాంగ్రెస్ పెద్దల ముందుంచారు. నాడు ఆజాద్ ప్రతిపాదనను స్వీకరించినట్లయితే పాకిస్తాన్ ఏర్పడేది కాదు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశ మొదటి విద్యాశాఖా మంత్రిగా ప్రాథమిక విద్య ప్రతి బాలునికీ, బాలికకూ అందాలని ఆకాంక్షించారు. ఢిల్లీలో 'జామియా మిలియా ఇస్లామియా' విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక భారతీయ విద్యా సంస్థలు ఆజాద్ ఆలోచనల్లో రూపుదిద్దుకున్నవే.

'ఇండియా విన్స్ ఫ్రీడమ్' అనే రచన అనేక చారిత్రక సందర్భాలనూ, ఆయన జీవితంలోని ఎత్తుపల్లాలనూ తెలియజేసింది. ప్రతి రాజకీయ కార్యకర్త, చరిత్ర పరిశోధకులు చదవవలసిన పుస్తకం. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి దేశ భక్తుని, త్యాగధనుని గురించి స్మరించుకోవటం నేడు దేశానికి ఎంతో అవసరం.

వ్యాసకర్త మాజీమంత్రి

(నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి)

మూడు అవతారాలతో ముడిపడినది

దీపావళి రాత్రి అన్ని అమావాస్య రాత్రుల లాంటిది కాదు. కరుణశ్రీ చెప్పినట్టు, ఇంటా బయటా వెలిగే దీపాల కాంతులతో, తళుకులొలికే తన నక్షత్రాలన్నిటినీ తీసుకొచ్చి ఆకాశమే నేలమీద దిగినట్టు తోచే రాత్రి అది. 'రావణు పరిమార్చి రాముడర్ధాంగితో/అనుజన్ము భరతు కాంచినది నేడె'. ఇదీ కరుణశ్రీ మాటే. ఆశ్వయుజ అమావాస్య నాడు రాముడు అయోధ్యకు తిరిగివచ్చిన నాటినుంచి, ఆ సుదినం పర్వదినమైపోయింది. అంతకు పద్నాలుగేళ్లకు ముందు అరణ్యాలకు వెళ్ళిన లోకాభిరాముడు ఎన్నో ఘనకార్యాలు పూర్తిచేసి, విజయిగా తిరిగి వచ్చినప్పుడు, ఆనందోత్సాహాలతో అయోధ్యలో అంగనలు ఇంటింటా ఆయనకు ఎత్తిన నీరాజనాలే దీపావళులై, దీపావళి పండగ సంప్రదాయానికి ఆరంభంగా నిలిచాయని ఒక ఊహ. ఇది రామావతారం నాటి కథ.



అంతకు క్రితం, కృత యుగంలో, 'బలి చక్రవర్తిని బంధించి పాతాళ/మునకు వామనుడు పంపినది నేడె!' అది వామనావతార సందర్భం.

'క్రూరుడౌ నరకాసురుని సత్యభామ కృ/ష్ణుని వెంట చని వధించినది నేడె'. నరకాసురుడు తను వధించబడిన రోజున, (నరక చతుర్దశి నాడు) లోకంలో ప్రజలందరూ అభ్యంగన స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించేటట్టు వరమడిగి పొందాడని ఒక ఐతిహ్యం. నరకాసుర వధ కథను పోతన గారు నవరస భరితమైన ఉపాఖ్యానంగా చెప్పి, అష్ట పత్నీ వల్లభుడి ఇష్టసఖి సత్యభామకు సాహిత్య ప్రపంచంలో కూడా ఒక ప్రత్యేక విశిష్టతను సంతరించి పెట్టారు. నరకాసుర సంహారం కృష్ణావతారంలో జరిగిన ఘనకార్యం.

ఇలా నారాయణుడి దశావతారాలలో మూడు ముఖ్యమైన అవతారాలతో ముడిపడి ఉన్న దీపోత్సవ అమావాస్య ఈ దేశవాసుల జీవితాలలో ఈనాటికీ హర్షోల్లాసాలను నింపుతూనే ఉన్నది. ఏ శుభకార్యానికైనా అనువైన పెట్టని శుభముహూర్తాలుగా భావించబడే పర్వ దినాలలో ఒకటిగా నిలిచి ఉంది. ముఖ్యంగా లక్ష్మీదేవి పూజ జరిపి ఆమె అనుగ్రహం పొందడానికి ఇది లక్షణమైన సుముహూర్తం.

పదార్థాల తత్త్వాన్ని వివరంగా చూపగల జ్ఞాన దీపమైన వర్ధమాన మహావీరుల తర్వాత, పదార్థ తత్త్వం తెలియడానికి భౌతిక దీపాలను ఆశ్రయించాల్సి వస్తుందని సూచించేందుకు, ఆయన నిర్వాణ తిథి అయిన ఆశ్వయుజ అమావాస్య నాడు దీపావళులు వెలిగించే సంప్రదాయం జైన సోదరులు పాటిస్తారు.

ఇప్పుడు మన ముంగిట ఉన్న ఈ సంవత్సరపు దీపావళి పర్వదినం అందరి జీవితాలనూ అన్ని విధాలా ప్రకాశవంతం చేసి, సకల జనులకూ సన్మార్గ దర్శనం చేసి, తన పేరును సార్థకం చేసుకోవాలని ఆశంస!

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

బీఎస్సీ నర్సింగ్‌లో 6,522 సీట్ల భర్తీ

సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల్లో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 6,522 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు సీట్లను కేటాయిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 7,548 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించింది. https:/ugnursing. ysruhs. com/ ugnuallotment లో అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సీట్లు కేటాయించిన కళాశాలల్లో ఈ నెల 14న సాయంత్రం 6 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని విద్యార్థులకు సూచించింది.

23 నుంచి ఏఈఈ పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏఈఈ) పోస్టుల పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల తాత్కాలిక జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. ఈనెల 23 నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయంలో అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనుంది. మెమోలతో పాటు పూర్తి షెడ్యూల్ వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

ఐపీఎం డైరెక్టర్‌గా నివాస్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం)డైరెక్టర్‌గా నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) డైరెక్టర్ జె.నివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు ఇన్‌చార్జి ఐపీఎం డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా వ్యవహరించారు. ఆహార భద్రత చట్టం కార్యకలాపాలు మరింత సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తృతం

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను మరింత విస్తృతం చేయడానికి కృషి చేస్తానని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళగిరిలోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగుల పోస్ట్ ఆపరేటివ్ కేర్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రెఫరల్ కేసులన్నింటికీ పథకం కింద ఉచిత వైద్య సేవలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేశ్వర్‌కు ట్రస్ట్ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను ఇటీవల ప్రభుత్వం అప్పగించింది.

డీఎల్‌డీవోలకు 'సచివాలయాల' పర్యవేక్షణ బాధ్యత

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ (డీఎల్‌డీవో)కు అప్పజెబుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం జీవో జారీ చేశారు. గ్రామ వార్డు సచివాలయాల రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణతో పాటు ఉద్యోగులపై పాలనాపరంగా వచ్చే ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్లకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. తమ పరిధిలో ఉండే వలంటీర్ల ఖాళీలను ఎంపీడీవో లేదంటే మున్సిపల్ కమిషనర్ల ద్వారా ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా చర్యలు చేపట్టే బాధ్యతలను డీఎల్‌డీవోలకు అప్పగించారు.

'లైబ్రరీ సైన్స్'లో సర్టిఫికేషన్ కోర్సులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఐదు నెలల కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన మూడు సంస్థల ద్వారా డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు నిర్ణీత వ్యవధిలో సర్టిఫికేషన్ కోర్సులు అందించనుంది. విజయవాడలోని పీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, కడపలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్, గుంటూరులోని వావిలాల లైబ్రరీ సైన్స్ శిక్షణ సంస్థల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తోంది. ఒక్కో మాధ్యమంలో 40 చొప్పున మొత్తం 240 సీట్లను భర్తీ చేయనుంది.

15వరకు దరఖాస్తుల విక్రయం

కనీసం ఇంటర్మీడియట్/యూజీసీ గుర్తింపు కలిగిన ఏదైనా విద్యాసంస్థలో తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. అర్హత పరీక్షల్లో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరిస్తూ ఎంపికలు చేయనుంది. ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తుకు చేసుకునేందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. డిగ్రీ అర్హత ఉంటే 5 మార్కులు, పీజీ ఉంటే 10 మార్కులను అర్హత పరీక్షల్లో వచ్చే మార్కులకు అదనంగా కలపనుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ పేర రూ.2 పోస్టల్ ఆర్డర్‌ను సమర్పించి దరఖాస్తు పొందాలి. పోస్టు ద్వారా దరఖాస్తు పొందాలంటే రూ.2 పోస్టల్ ఆర్డర్‌ను రూ.5 పోస్టల్ స్టాంపు అంటించిన 10×24 సైజు కవర్‌ను సంబంధిత శిక్షణ సంస్థకు పంపి దరఖాస్తును పొందవచ్చు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తుల విక్రయం, 18వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించింది.

జగనన్న ఆరోగ్య సురక్ష

32 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	12,289
నమోదైన ఓపీలు	59,56,207
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,44,04,935
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసినవారి సంఖ్య	86,282




విజయవాడ పశ్చిమ నియోజక వర్గం 48వ డివిజన్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పరిశ్రమల భూకేటాయింపులు

మరింత సరళం



లీజు విధానం బదులు సేల్‌డీడ్ విధానంలో కేటాయింపు

- మొత్తం సొమ్ము చెల్లించగానే అమ్మకం ఒప్పందం
- డీపీఆర్ ప్రకారం నిబంధనలన్నీ పాటించిన తర్వాత తుది అమ్మకపు పత్రాలు
- ఉత్తర్వులు జారీచేసిన పరిశ్రమల శాఖ

సాక్షి, అమరావతి : సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు భూ కేటాయింపులను మరింత సరళతరం చేసింది. 2023–27 పారిశ్రామిక విధానం కింద.. పరిశ్రమలు లీజు విధానంలో కాకుండా నేరుగా భూములు కొనుగోలు చేసేలా పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు 33/99 ఏళ్లకు లీజు విధానంలో ఈ కేటాయింపులు చేస్తుండగా నిధుల సమీకరణకు లీజు ఒప్పందాలు అడ్డంకిగా మారుతున్నాయంటూ పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన విజ్ఞప్తిని మన్నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను కూడా పొందుపరిచారు. తాజా ఉత్తర్వుల ప్రకారం..

- ▲ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసే వారు భూమి విలువను మొత్తం ఒకేసారి చెల్లిస్తే తక్షణం వారితో ఏపీఐఐసీ లేదా పరిశ్రమల శాఖ భూమి కొనుగోలు ఒప్పందం చేసుకుంటుంది.
- ▲ ప్రాజెక్టు ఏర్పాటుచేసేటప్పుడు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలన్నీ నిర్దిష్ట కాలపరిమితిలోగా చేసుకుంటే వెంటనే ఆ భూమిపై పూర్తి హక్కులను కేటాయిస్తూ తుది సేల్ డీడ్‌ను అందజేస్తారు.
- ▲ అదే మధ్య, పెద్ద, భారీ పరిశ్రమల విషయానికొస్తే.. దశల వారీగా ప్రాజెక్టులు చేపట్టినా మొత్తం భూమి విలువ ఒకేసారి చెల్లిస్తే సేల్ అగ్రిమెంట్ చేస్తారు.
- ▲ అలాగే, డీపీఆర్ ప్రకారం దశల వారీగా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలుచేసిన తర్వాత తుది అమ్మకం డీడ్‌ను అందజేస్తారు.
- ▲ ఒకవేళ పరిశ్రమలు పెట్టేవారు దశల వారీగా సేల్‌డీడ్‌ను కోరుకుంటే ఆ ఫేజ్‌లో చేరుకోవాల్సిన లక్ష్యాలు చేరుకుంటే ఆ మేరకు ఆ భూమికి సేల్‌డీడ్ చేస్తారు.
- ▲ ఒకవేళ రెవెన్యూ శాఖ భూమి కొనుగోలు చేసి ఇవ్వాల్సి వస్తే అప్పుడు కూడా పరిశ్రమల శాఖ ఆమోదించిన డీపీఆర్ నిబంధనలు చేరుకున్న తర్వాతనే భూమిని కేటాయిస్తారు.
- ▲ ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1, 2020 నుంచి అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

బెంగళూరు, ముంబైలకు దీటుగా విశాఖ అభివృద్ధి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి–విశాఖ జిల్లా' అంశంపై మేధావుల చర్చ



సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు) : రాష్ట్రంలో అన్ని జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్–ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి–విశాఖ జిల్లా' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బెంగళూరు, ముంబై నగరాలకు దీటుగా ఆర్థిక రాజధానిగా విశాఖ అభివృద్ధి చెందుతోందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి సైతం సంక్షేమ ఫలాలు అందితేనే నిజమైన అభివృద్ధి అన్నారు. జిల్లాల వారీగా నిర్వహించే ఇలాంటి సదస్సుల్లో మేధావులు అందించే సూచనలను పరిగణనలోకి తీసుకుని.. వీటి ఆధారంగా తయారు చేసిన నివేదికను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల రూపకల్పనలో ఉపయోగించాలని సూచించారు.

14 దేశాల్లో బహుళ రాజధానులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ విశాఖ నగరం రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తోందన్నారు. నాణ్యమైన సేవలే అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తాయని తెలిపారు. నాడు–నేడు అనే ఒక సంక్షేమ పథకంతో నేడు రాష్ట్రంలో నాణ్యమైన విద్యను రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సైతం అందిస్తున్న విధానం దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 14 దేశాలు బహుళ రాజధానులను కలిగి ఉన్నాయని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ మూడు రాజధానులు కలిగి ఉంటుందని వెల్లడించారు. ఏయూ అర్థశాస్త్ర విశ్రాంత ఆచార్యుడు కె.శ్రీరామమూర్తి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆంజనేయులు, విశాఖ జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ నాయకులు గంట్ల శ్రీనుబాబు, కామర్స్ మేనేజ్‌మెంట్ ఆచార్యులు ఆచార్య పి.విశ్వనాథం, విద్యా విభాగం ఆచార్యులు టి.షారోన్ రాజు, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు షిరీన్ రెహమాన్ తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్



సాక్షి, అమరావతి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. విజయవాడ పటమటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో 67వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14 బాలబాలికల హ్యాండ్‌బాల్, అండర్–14, 17, 19 సెపక్‌తక్రా బాలికల క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు, రవాణా భత్యం, భోజన సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర శిక్ష ద్వారా రూ.7 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఎమ్మెల్సీ టి.కల్పలత, సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కేవీ శ్రీనివాసులు రెడ్డి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల డీఈవోలు రేణుక, తాహెరా సుల్తానా, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్యే, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వై.రవి పాల్గొన్నారు.

కౌశల్ పోస్టర్ ఆవిష్కరణ

ఈ క్రీడా పోటీల్లో భాగంగా 'కౌశల్–2023' సైన్స్ క్విజ్ పోటీల సందర్భంగా కమిషనర్ సురేష్‌కుమార్ ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరించారు. పోటీల పూర్తి వివరాలకు www.bvmap.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బెల్టు షాపులంటూ గిల్టు కథనాలా?

బాబు హయాంలో ప్రయివేటు షాపుల లాభాపేక్ష

- అందుకే ఊరూరా బెల్టు షాపులు పెట్టి అమ్మకాలు
- ఇపుడు మొత్తం విక్రయాలు ప్రభుత్వ దుకాణాల్లోనే
- షాపుల తగ్గింపు; విక్రయ వేళల కుదింపు, పర్మిట్ రూమ్‌ల రద్దు
- ప్రభుత్వంపై బురద జల్లటమే ధ్యేయంగా 'ఈనాడు' కథనాలు


వైకాపా సమర్పించు బెల్టుషాపులు

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: అసలు బెల్టు షాపులు ఎవరు పెడతారు? వీటిని నిర్వహించేది లాభాపేక్షతోనే కదా? మరి షాక్ కొట్టే ధరలతో ప్రభుత్వమే పరిమిత సంఖ్యలో, నియమిత వేళల్లో మాత్రమే మద్యాన్ని విక్రయిస్తోందంటే సర్కారుకు లాభాపేక్ష లేనట్లే కదా? అయినా అసలు ప్రభుత్వానికి దుకాణాల్లో చిల్లరగా మద్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం ఏముంటుంది? ఎక్కడైనా ఆ పరిస్థితి ఉందా? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం ఉండాలి కదా? మరి రామోజీ ఈ చిన్న లాజిక్ ఎలా మిస్సయ్యారు? గతంలో ఐదేళ్లు మత్తుగా పడుకుని ఇప్పుడే నిద్ర లేచారు కాబట్టేనా! టీడీపీ నేతలు ఎవరైనా వాళ్ల దుకాణాల్లో మద్యం అమ్ముతుంటే ఆయన ఫొటోలు తీశారా? అనే సందేహాలు వస్తున్నాయి. ఇప్పుడు 236 బెల్టు షాపులు లెక్క తేల్చానంటూ గుండెలు బాదుకుంటున్న ఆయన చంద్రబాబు హయాంలో 43వేల బెల్టు షాపులు ఏర్పాటైతే నోరెత్తకపోవడం గమ్మత్తుగా లేదా? సాధారణంగా ప్రైవేట్ దుకాణదారులు తాము అమ్ముకోవడంతోపాటు మరింత మద్యాన్ని తాగించేందుకు రకరకాల దుకాణాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేస్తారు. ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చి మద్యపానాన్ని నిరుత్సాహపరుస్తూ పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను సైతం ఏర్పాటు చేసింది.

బాబు హయాంలో ఏరులై పారిన మద్యం..

చంద్రబాబు హయాంలోటీడీపీ మద్యం సిండికేట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. గత సర్కారు వేలం ద్వారా 4,380 మద్యం దుకాణాలకు లైసెన్సులు కేటాయించగా వాటన్నింటిని టీడీపీ నేతలే దక్కించుకున్నారు. ఒక్కో మద్యం దుకాణానికి అనుబంధంగా మరో 4,380 పర్మిట్ రూమ్‌లకు చంద్రబాబు అనుమతులు ఇచ్చారు. వాటికి అదనంగా టీడీపీ నేతలు 43 వేల బెల్ట్ దుకాణాలను తెరచి దోపిడీకి తెగబడ్డారు. గుడి, బడి తేడా లేకుండా వీధికి ఒకట్రెండు చొప్పున బెల్ట్ షాపులను తెరిచి మద్యం ఏరులై పారించారు. ఎమ్మార్పీ ధరల కంటే 25 శాతం వరకు అధిక ధరలకు అమ్ముకున్నా అడిగే నాథుడే లేడు.

అక్రమ మద్యం (డ్యూటీ పెయిడ్)పై కేసులు..

ఏడాది	కేసులు	అరెస్టులు	జప్తు చేసిన మద్యం (లీటర్లలో)	జప్తు చేసిన బీరు (లీటర్లలో)	జప్తు చేసిన వాహనాలు
2019	14,933	15,223	82,045	26,013	977
2020	14,440	15,854	61,441	4,380	2,364
2021	14,576	15,336	52,498	5,037	1,727
2022	9,431	9,713	30,103	1,283	454
2023 (ఇప్పటివరకు)	6,856	7,217	21,739	2,312	263
మొత్తం	60,236	63,343	2,47,826	39,025	5,785

ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించిన మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్)పై కేసులు..

ఏడాది	కేసులు	అరెస్టులు	జప్తు చేసిన మద్యం (లీటర్లలో)	జప్తు చేసిన బీరు (లీటర్లలో)	జప్తు చేసిన వాహనాలు
2019	1,841	1,908	15,640	9,874	402
2020	23,669	35,727	3,83,674	10,361	13,641
2021	21,246	27,312	4,64,613	6,954	8,001
2022	8,074	9,658	1,37,986	5,795	2,128
2023 (ఇప్పటివరకు)	8,099	9,652	1,19,803	12,561	2,022
మొత్తం	62,929	84,257	11,21,716	45,545	26,194

ఉక్కుపాదం మోపిన సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మద్యం మాఫియాపై ఉక్కుపాదం మోపారు. 43 వేల బెల్టు షాపులను, 4,380 పర్మిట్ రూమ్‌లను ఒకేసారి రద్దు చేశారు. 2019 అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వ పరం చేసేశారు. టీడీపీ హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు అధికారంగా విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24 గంటలూ విక్రయిలు సాగించాయి. ఇప్పుడు సమయాన్ని కుదించి ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయిస్తున్నారు. 2019లో రాష్ట్రంలో 4,380 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండగా ప్రస్తుతం 2,934 ప్రభుత్వ మద్యం దుకాణాలే ఉన్నాయి. ఇక 2019లో ఖరారు చేసిన 840 బార్లే ఇప్పటికీ ఉన్నాయి.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ఉత్తర్వులు జారీ

- ప్రతి పాత్రికేయునికి మూడు సెంట్లు
- ఈ ఏడాది అక్రిడిటేషన్, ఐదేళ్ల అనుభవం అర్హత
- స్థలం విలువలో ప్రభుత్వం 60 శాతం, జర్నలిస్టు 40 శాతం భరించాలి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని జర్నలిస్టుల కలను సీఎం వైఎస్ జగన్ నిజం చేయనున్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వనున్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ఈ నెల 3వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వచ్చిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందుకనుగుణంగా శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కొన్ని షరతులకు లోబడి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సంవత్సరం అక్రిడిటేషన్‌తోపాటు కనీసం ఐదేళ్ల మీడియాలో పనిచేసిన అనుభవం అర్హతగా నిర్దేశించారు. ఇచ్చే స్థలం విలువలో ప్రభుత్వం 60 శాతం, జర్నలిస్టు 40 శాతం భరించాల్సి వుంటుంది. అలాగే, ఎవరైనా జర్నలిస్టు లేదా అతని భార్య ప్రభుత్వ పథకం కింద ఇంటి స్థలం పొంది ఉంటే సదరు జర్నలిస్టును అనర్హునిగా పరిగణిస్తారు. అంతేకాక.. కేటాయించిన స్థలంలో పదేళ్లలోపు ఇల్లు కట్టుకోవాల్సి వుంటుంది. ఒకవేళ అలా చేయకపోతే కేటాయించిన స్థలం రద్దవుతుంది. ఇల్లు కట్టుకుంటే పదేళ్ల తర్వాత హక్కు లభిస్తుంది. మరోవైపు.. దరఖాస్తులను కమిషనర్ పరిశీలించి అర్హత కలిగిన జర్నలిస్టుల జాబితాను జిల్లా కలెక్టర్లకు పంపుతారు. దాని ప్రకారం జిల్లా స్థాయి కమిటీలు ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని గుర్తిస్తారు. ఇక అర్హులైన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటుచేస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చైర్మన్‌గా, జిల్లా కలెక్టర్, డీఆర్ఓ, చైర్మన్ నామినేట్ చేసిన ముగ్గురు మీడియా ప్రతినిధులు, సబ్‌కలెక్టర్/ఆర్డీఓ సభ్యులుగా ఉంటారు. జిల్లా పౌరసంబంధాల అధికారి కన్వీనర్‌గా ఉంటారు.

తెలంగాణ

పొత్తు కుదిరినా హత్తుకోవడంలేదు!

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణలో అంతగా పట్టు, గుర్తింపు లేని జనసేనపార్టీకి ఎనిమిది సీట్లు కేటాయించినా దాని వల్ల తమ పార్టీకి రాజకీయంగా పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోందని బీజేపీ నేతలు పెదవి విరుస్తున్నారు. జనసేన రాష్ట్రంలో రిజిష్టర్డ్ రాజకీయ పార్టీ కాకపోవడంతో ఎన్నికల్లో పోటీకి 'కామన్‌సింబల్' దక్కలేదు. ఆ పార్టీకి గతంలో కేటాయించిన 'గాజుగ్లాస్' గుర్తును కూడా ఈసీ కేటాయించకపోవడంతో, ఆ పార్టీ అభ్యర్థులు ఎనిమిది స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగానే బరిలో నిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనసేనకు కేటాయించిన కూకట్‌పల్లి, తాండూరు, కోదాడ, నాగర్‌కర్నూల్, ఖమ్మం, కొత్తగూడెం, వైరా, అశ్వారావుపేట సీట్లలో పలువురు టికెట్ ఆశించిన బీజేపీ నాయకులు నిరాశలో కూరుకుపోయారు. కూకట్‌పల్లి, తాండూరు, కోదాడ, నాగర్‌కర్నూల్ సీట్లలో ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉన్నా జనసేనకు ఆ సీట్లు కేటాయించడంతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో జనసేన పొత్తుతో బీజేపీకి ప్రయోజనం లేని పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నాయకులు వాపోతున్నారు.

కళ్లకు గంతలు కట్టుకున్నారా!?

నాలుగేళ్లలో ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా 12.59 లక్షల మందికి శిక్షణ కనిపించలేదా?

- 175 నియోజకవర్గాల్లో 192 స్కిల్ హబ్స్‌లో శిక్షణ నిర్వహించాం..
- 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో 26 స్కిల్ కాలేజీలు ప్రారంభించాం..
- తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీకి భూమి కేటాయించాం..
- ప్రతీనెలా 52 జాబ్‌మేళాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తున్నాం
- ఇవేవీ చూడకుండా 'నైపుణ్యం ఏదీ.. ఎక్కడ' అంటూ కబోది రాతలు ఎందుకు?
- లక్షా 60 వేల మందికి మైక్రోసాఫ్ట్ సంస్థ శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు ప్రదానం చేసిన విషయం కూడా తెలీదా?
- ఈనాడు విషప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య శిక్షణ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి ఫైర్

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : దేశంలో ఎక్కడాలేని విధంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు నైపుణ్య శిక్షణలో కొత్తగా క్యాస్కేడింగ్ స్కిల్ ఎకో సిస్టమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తే ఈనాడు రామోజీరావు కళ్లకు గంతలు కట్టుకుని నిరుద్యోగ యువతను ఆందోళనకు గురిచేసేలా తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య శిక్షణ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో గత నాలుగున్నర ఏళ్లల్లో అకడమిక్, నాన్ అకడమిక్ విభాగాల్లో 12,59,451 మందికి శిక్షణనిస్తే రాష్ట్రంలో 'నైపుణ్యం ఏది.. ఎక్కడా?'.. అంటూ ప్రభుత్వంపై విషం చిమ్ముతూ ఈనాడు తప్పుడు కథనాలను ప్రచురించడంపై ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. 'సాక్షి'తో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టం తీసుకురావడమే కాక దానికి అనుగుణంగా స్కిల్ ఎకో సిస్టమ్‌ను అమలుచేస్తుంటే యువతను భయాందోళనకు గురిచేసే లక్ష్యంతో ఈనాడు విషాన్ని కక్కుతోందంటూ విమర్శించారు. పైగా.. మైక్రోసాఫ్ట్ సంస్థ లక్షా 60వేల మందికి శిక్షణనివ్వడమే కాక వారందరికీ సర్టిఫికెట్లు సైతం ప్రదానం చేసిన విషయం తెలీదా అని ఆయన ప్రశ్నించారు.


నైపుణ్యం ఏదీ.. ఎక్కడ?

192 స్కిల్ హబ్స్ ఉన్న విషయం తెలీదా?

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కనీసం ఒక నైపుణ్య శిక్షణ కేంద్రం ఉండే విధంగా 192 స్కిల్ హబ్స్‌ను ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీల్లో ఏర్పాటుచేసిన సంగతి వాస్తవం కాదా అంటూ ఆయన ప్రశ్నించారు. అలాగే, ప్రతీ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒకటి చొప్పున మొత్తం 26 స్కిల్ కాలేజీలు ఏర్పాటుచేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తుంటే ఈనాడు రామోజీరావు పుంఖానుపుంఖాలుగా తప్పుడు కథనాలను ప్రజలపైకి వదులుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీలు ద్వారా 22 రంగాలకు చెందిన 100కి పైగా జాబ్‌రోల్స్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే, రాష్ట్రస్థాయిలో మొత్తం నైపుణ్య శిక్షణ వ్యవస్థ పనితీరును పర్యవేక్షించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తున్నామని ఇందుకోసం తిరుపతిలో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించడమే కాక పనులు కూడా కొనసాగుతున్నాయని మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. వీటికి అదనంగా పులివెందులలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, పరిశ్రమల ప్రాంగణంలో స్కిల్ స్పోక్‌ను ఏర్పాటుచేశామన్నారు.

జాబ్‌మేళాలూ కనిపించడంలేదా?

ఇవికాక.. విద్యార్థులకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీనెలా 52 జాబ్ మేళాలు నిర్వహిస్తున్న విషయం కనిపించడం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పలు సంస్థల్లో ఉపాధి కల్పించేందుకు వీలుగా 50కుపైగా బహుళజాతి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ విధంగా రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తుంటే తమ నాయకుడు స్కిల్ స్కాంలో ఇరుక్కోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో ఈనాడు వికృత రాతలు రాస్తోందన్నారు.

క్లుప్తంగా...

అమెరికా ఎంక్యూ-9 డ్రోన్ పేల్చివేత

సనా: ఇప్పటికే ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లు అమెరికా సైన్యంపై దాడులు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అమెరికాకు చెందిన ఎంక్యూ-9 డ్రోన్‌ను హౌతీ మిలిటెంట్లు పేల్చివేశారు. యెమెన్ ప్రాదేశిక జలాల్లో బుధవారం ఈ సంఘటన జరిగిందని అమెరికా సైన్యం వెల్లడించింది. హౌతీ దుశ్చర్య నేపథ్యంలో పశ్చిమాసియాలో అమెరికా సేనలు అప్రమత్తమయ్యాయి. హౌతీకి ఇరాన్ ప్రభుత్వం అండగా ఉండడం గమనార్హం.

తమిళనాడు పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ తాత్సారం చేస్తున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు స్పందన కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జే/బీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ మేరకు నోటీసు జారీ చేసింది. రాజ్యాంగ బద్ధమైన ఒక అధికారం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ విధులను అడ్డుకుంటోందని తమిళనాడు ప్రభుత్వం పిటిషన్‌లో ఆరోపించింది. జోక్యం చేసుకోవాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులు గవర్నర్ ఆర్ఎన్ రవి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని విచారణ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ ఈ నెల 20న చేపడతామని తెలిపింది.

లష్కరే మాజీ కమాండర్ అక్రమ్ ఖాన్ హతం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బజౌర్‌లో లష్కరే తోయిబా మాజీ కమాండర్ అక్రమ్ ఖాన్ అలియాస్ అక్రమ్ గాజీ హతమయ్యాడు. గుర్తు తెలియని దుండగులు గురువారం అతడిని కాల్చిచంపారు. 2018–20 సంవత్సరాల మధ్య లష్కరే తోయిబా రిక్రూట్‌మెంట్ విభాగాన్ని నడిపేవాడు. పలు ఉగ్రవాద చర్యల వెనుక ఇతడి ప్రమేయం ఉంది.

కేజ్రీవాల్‌కు ఏదో జరగబోతోంది

ఆప్ నేత సంజయ్ సింగ్ ఆందోళన

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఇరుకున పెట్టేందుకు పెద్ద కుట్ర జరగబోతోందని ఆప్ నేత సంజయ్ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. మనీ ల్యాండరింగ్ కేసులో శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరైన అనంతరం కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడారు. 'కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు కుట్ర జరుగుతోంది. ఆయన్ను అరెస్ట్ చేయడం మాత్రమే కాదు. అంతకంటే మించి ఏదో చేయడమే ఆ కుట్ర' అని అన్నారు. మద్యం విధానం కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై విచారణకు రావాలంటూ ఈడీ పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించని విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించింది.

కర్ణాటక బీజేపీ చీఫ్‌గా విజయేంద్ర యడియూరప్ప

న్యూఢిల్లీ: బీజేపీ కర్ణాటక అధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప కుమారుడు విజయేంద్ర యడియూరప్ప(47) నియమితులయ్యారు. బీజేపీ అధిష్టానం అనూహ్యంగా తీసుకున్న నిర్ణయం సీనియర్ నేత యడియూరప్ప పలుకుబడిని అంగీకరించినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఏడాది మేలో కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో విజయేంద్ర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న నళిన్ కుమార్ కటీల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు.

నితీశ్ కుర్చీపై కన్నేసి, విషాహారం పెడుతున్నారు

పట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ తీసుకునే ఆహారంలో విష పదార్థాలను కలుపుతున్నారని హెచ్ఏఎం చీఫ్, మాజీ సీఎం జితేన్ రామ్ మాంఝీ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడారు. 'సీఎం నితీశ్ ఇటీవల అసెంబ్లీలో అసభ్య పదజాలం వాడి ఉభయసభలకు క్షమాపణ చెప్పుకున్నారు. నిన్న మరోసారి నియంత్రణ కోల్పోయి నన్ను అవమానిస్తూ మాట్లాడారు. వయస్సులోనూ అనుభవరీత్యా నేను సీనియర్ అన్న విషయం మర్చిపోయారు. ఆయన మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందనడానికి ఇదే గుర్తు'అని మాంఝీ చెప్పారు. 'నితీశ్ కుమార్ తీసుకునే ఆహారంలో విష పదార్థాలు కలుపుతున్నారని నా అనుమానం. అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. ఆయన ఆహారంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి. సీఎం కుర్చీపై కన్నేసిన చాలా మంది ఆయన చుట్టూ ఉన్నారు'అని మాంఝీ వ్యాఖ్యానించారు.

మహువాపై స్పీకర్‌కు నివేదిక

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగిన ఆరోపణలపై విచారణ పూర్తి చేసిన ఎథిక్స్ కమిటీ నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. నివేదికను ఎథిక్స్ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ సోంకార్ శుక్రవారం స్పీకర్ కార్యాలయంలో అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి చట్టవిరుద్ధంగా ప్రతిఫలం స్వీకరించినందుకు మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలంటూ కమిటీ సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

బలమైన రక్షణ బంధం

భారత్, అమెరికా నిర్ణయం

ఫలప్రదంగా విదేశాంగ, రక్షణ మంత్రుల చర్చలు



శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్

- ముంబై, పఠాన్‌కోట్ ముష్కరులకు శిక్ష పడాల్సిందే
- ఉమ్మడి ప్రకటనలో ఇరు దేశాల స్పష్టీకరణ
- చైనా దూకుడును సంయుక్తంగా అడ్డుకుంటాం: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాల రక్షణ, విదేశాంగ మంత్రులు శుక్రవారం ఢిల్లీలో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వీటిలో పాలుపంచుకున్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీ, అరుదైన ఖనిజాల అన్వేషణ, అత్యున్నత సాంకేతికత వంటి రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, పశ్చిమాసియాలో పరిణామాలు, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా సైనిక దూకుడుకు అడ్డుకట్ట వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై మంత్రులు చర్చించుకున్నారు. అనంతరం చర్చల వివరాలను వెల్లడిస్తూ మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ముంబైలో 26/11 ఉగ్ర దాడులకు, పఠాన్‌కోట్ దాడులకు పాల్పడ్డ ముష్కరులకు శిక్ష పడి తీరాల్సిందేనని ప్రకటన స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్‌కు మంత్రుల భేటీ స్పష్టమైన హెచ్చరికలు చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడంతో పాటు ఐసిస్ సహా ఉగ్ర సంస్థలన్నింటినీ నిర్మూలించేందుకు అన్ని దేశాలూ కలసికట్టుగా ప్రయత్నించాలని పిలుపునిచ్చినట్టు వివరించింది.

ఫలప్రదం: జై శంకర్

అమెరికా మంత్రులతో చర్చ లు ఫలప్రదంగా సాగాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ సంబంధాలను మెరుగుపర్చుకోవడం, అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికత రంగాల్లో పరస్పరం సహకరించుకోవడంతోపాటు రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలపై చర్చించుకున్నామని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతకముందు చర్చల ప్రారంభ కార్యక్రమంలో ఎస్.జైశంకర్ మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి ఈ చర్చలు ఒక అద్భుత అవకాశమని అభివర్ణించారు. భారత్–అమెరికా మరింత సన్నిహితం కావడంతోపాటు ఉమ్మడి నిర్మాణాత్మక గ్లోబల్ అజెండాను రూపొందించుకోవాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ లక్ష్యమని గుర్తుచేశారు. ఇరు దేశాల సంబంధాలు ఇతోధికంగా వృద్ధి చెందుతున్నాయన్నారు. ఇండో–పసిఫిక్‌ను స్వేచ్ఛాయుత, వృద్ధిశీల, భద్రతాయుతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యమిస్తున్నట్టు బ్లింకెన్ తెలిపారు. అంతేగాక అంతర్జాతీయ శాంతి, భద్రత తదితరాల సాధనకు కూడా ఇరు దేశాలూ కలసికట్టుగా కృషి చేస్తున్నాయన్నారు. భారత్–అమెరికా సంబంధాలకు రక్షణ ఒప్పందాలు మూలస్తంభంగా నిలుస్తున్నాయని రాజ్‌నాథ్ అభిప్రాయపడ్డారు. చైనా దూకుడుకు సంయుక్తంగా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

సంయుక్తంగా సాయుధ సైనిక వాహనాల తయారీ: ఆస్టిన్

ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న కీలకమైన సాయుధ సైనిక వాహనాల సంయుక్త తయారీ విషయంలో తక్షణం ముందుకు వెళ్లాలని భారత్–అమెరికా నిర్ణయించినట్టు లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. ఇరు దేశాల సైనిక దళాల మధ్య సమాచార వ్యవస్థను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అలాగే ద్వైపాక్షిక రక్షణ పారిశ్రామిక వ్యవస్థల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత పెంచేందుకు ఉద్దేశించిన సెక్యూరిటీ ఆఫ్ సప్లై అరేంజ్‌మెంట్ (ఎస్ఓఎస్ఏ) ఒప్పందం ఖరారు తుది దశకు చేరిందని మంత్రి చెప్పారు. జీఈ ఎఫ్–414 జెట్ ఇంజన్లను భారత్‌లో తయారు చేసేలా జనరల్ ఎలక్ట్రిక్ ఏరో స్పేస్, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఊపందుకున్నాయన్నారు. అలాగే భారత్‌కు వీలైనంత త్వరగా అత్యాధునిక ఎంక్యూ–9బి డ్రోన్లను సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు. ఇది 300 కోట్ల డాలర్ల ఒప్పందం.

ఆగడాలకు అడ్డుకట్ట పడాల్సిందే: భారత్

కెనడాలో ఖలిస్తానీ శక్తుల ఆగడాలు పెరిగిపోతుండటం ఆందోళనకరమని అమెరికాకు భారత్ స్పష్టం చేసింది. మంత్రుల చర్చల సందర్భంగా ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వత్రా మీడియాకు వెల్లడించారు. వాటికి అడ్డుకట్ట పడాల్సిందేనని బ్లింకెన్, లాయిడ్‌లకు రాజ్‌నాథ్ స్పష్టం చేశారన్నారు. ఈ విషయంలో భారత ఆందోళనను అర్థం చేసుకోగలమని వారు చెప్పారన్నారు.

ప్రధానితో మంత్రుల భేటీ

భారత్–అమెరికా ద్వైపాక్షిక బంధం ప్రపంచ శాంతికి, ప్రగతికి అతి పెద్ద చోదక శక్తిగా మారుతోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. మంత్రుల స్థాయి భేటీ అనంతరం అమెరికా విదేశాంగ, రక్షణ మంత్రులు బ్లింకెన్, ఆస్టిన్ ఇరువురు శుక్రవారం రాత్రి ఆయనతో సమావేశమయ్యారు. విదేశంగ మంత్రి జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా భేటీలో పాల్గొన్నారు. సదస్సు జరిగిన తీరును, తీసుకున్న నిర్ణయాలను వారు మోదీకి వివరించారు. ''ప్రజాస్వామ్యం, బహుళత్వ విలువలపై భారత్, అమెరికాలకున్న ఉమ్మడి విశ్వాసం తిరుగులేనివి. ఇరు దేశాల మధ్య జరిగిన మంత్రుల స్థాయి చర్చలు ఆశించిన ఫలితాలు సాధించినందుకు ఆనందంగా ఉంది'' అంటూ భేటీ అనంతరం మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా శుక్రవారం మోదీకి ఫోన్ చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తత తదితరాలపై నేతలు ఆందోళన వెలిబుచ్చారు. అక్కడ యుద్ధ మేఘాలు తీవ్ర రూపు దాలుస్తుండటం, ఉగ్రవాదం, మతి లేని హింస భారీ జన నష్టానికి దారి తీస్తుండటం దారుణమన్నారు. బ్రెజిల్ జీ20 సారథ్యం సఫలం కావాలని ఈ సందర్భంగా మోదీ ఆకాంక్షించారు.

ప్రపంచంలోనే తొలిసారిగా కంటిమార్పిడి

న్యూయార్క్: ప్రపంచంలోనే తొలిసారిగా కంటి మార్పిడి శస్త్రచికిత్స అమెరికాలో జరిగింది. న్యూయార్క్‌లోని ఎన్‌వైయూ లాంగాన్ వైద్య సంస్థకు చెందిన వైద్యులు ఈ ఘనత సాధించారు. కరెంట్ షాక్ ప్రమాదంలో ముఖంలో ఎడమ భాగం పూర్తిగా దెబ్బ తిన్న ఆరోన్ జేమ్స్ అనే మాజీ సైనికుడు కంటి మార్పిడి చేయించుకున్న తొలి వ్యక్తిగా రికార్డులకెక్కాడు. ఇందుకోసం వైద్యులు ఏకంగా 21 గంటల పాటు శస్త్రచికిత్స చేశారు. ఇప్పటిదాకా కార్నియాను మార్చిన ఉదంతాలున్నాయి గానీ ఇలా పూర్తిగా కంటినే కొత్తగా అమర్చడం మాత్రం ఇదే తొలిసారి. ''మే 21న ఈ ఆపరేషన్ నిర్వహించాం. రోగికి మొత్తం ముఖం ఎడమ భాగమంతటితో పాటు ఎడమ కంటిని కూడా పూర్తిగా కొత్తగా అమర్చాం. మొత్తం ప్రక్రియలో ఏకంగా 140 మంది వైద్య నిపుణుల సేవలు తీసుకున్నాం. అతనికి ఎడమ కంటిలో చూపు రాలేదు. కాకపోతే ఆర్నెల్ల తర్వాత కూడా ఆ కన్ను పూర్తి ఆరోగ్యంతో ఉండటమే ఓ అద్భుతం. రెటీనాకు రక్తప్రసారం బాగా జరుగుతోంది. కంటికి రక్తం తీసుకొచ్చే నాళాల పనితీరు సజావుగా ఉంది. ఇది నిజంగా గొప్ప విషయం. చూపు కూడా ఎంతో కొంత వస్తే ఇంకా అద్భుతంగా ఉండేది'' అని వైద్య బృందం వివరించింది. అయితే, ''ఇది కేవలం కంటిని పూర్తిగా మార్చడం సాధ్యమేనని నిరూపించేందుకు చేసిన సాంకేతిక ఆపరేషన్ మాత్రమే. అయితే దాత తాలూకు మూల కణాలను, బోన్ మారోను దృష్టి నరంలో చొప్పించాం. కనుక చూపు వచ్చే ఆస్కారాన్నీ కొట్టిపారేయలేం'' అని చెప్పింది!

చికున్ గున్యాకు తొలి వ్యాక్సిన్

న్యూఢిల్లీ: చికున్ గున్యాకు తొలిసారిగా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. ఇక్స్‌చిక్ పేరిట రూపొందిన ఈ వ్యాక్సిన్‌కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) అనుమతించింది. 18 ఏళ్లు, ఆ పైబడిన వారికి దీన్ని ఇచ్చేందుకు అనుమతిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. ''చికున్ గున్యా తీవ్ర వ్యాధికి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా వృద్ధులకు, అప్పటికే ఆరోగ్య సమస్యలున్న వారికి ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన తక్షణావసరాన్ని ఈ వ్యాక్సిన్ తీరుస్తుందని నమ్ముతున్నాం'' అని వివరించింది. ''ఇక్స్‌చిక్ వ్యాక్సిన్‌ను ఇప్పటికే 266 మంది రోగులపై ప్రయోగాత్మకంగా పరీక్షించగా మంచి ఫలితాలొచ్చాయి. ఉత్తర అమెరికాలో 3,500 మందికి వ్యాక్సిన్ ఇవ్వగా చక్కని గుణం కనిపించింది. 1.6 శాతం మందిలో మాత్రం తీవ్రమైన తలనొప్పి తదితర గున్యా తాలూకు లక్షణాలు కనిపించాయి. ఇద్దరిని ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చింది'' అని ఎఫ్‌డీఏ సెంటర్ ఫర్ బయోలాజిక్స్ ఎవాల్యుయేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ పీటర్ మార్క్స్ చెప్పారు. బయోటెక్ కంపెనీ 'వాల్నెవా ఆస్ట్రియా' ఈ వ్యాక్సిన్‌ను తయారు చేసింది.

నిప్పుతో చెలగాటం

పంజాబ్ గవర్నర్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

న్యూఢిల్లీ: పంజాబ్ గవర్నర్‌ను సుప్రీంకోర్టు తీవ్రస్వరంతో మందలించింది. రాష్ట్రానికి నామమాత్రపు అధిపతి అయినందున గవర్నర్ అసెంబ్లీ సమావేశాల చెల్లుబాటుపై సందేహం వ్యక్తం చేయలేడని, సభ ఆమోదించిన బిల్లులను నిరవధికంగా నిలిపివేయలేడని కుండబద్దలు కొట్టింది. మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారని హెచ్చరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు పంపిన బిల్లును ఆయన ఆమోదించడం లేదా నిలిపివేయడం, రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం పంపడమో చేయాలని తెలిపింది. ఇంతకుమించి మరో అవకాశం గవర్నర్‌కు లేదని తెలిపింది. అంతేతప్ప, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తనవద్దే నిరవధికంగా ఉంచుకోజాలడని స్పష్టం చేసింది. 'మన దేశం కొన్ని సంప్రదాయాలు, ఆచారాల ఆధారంగా నడుస్తోంది. వాటిని మనం అనుసరించాలి'అని విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాల, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెడుతున్నారంటూ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్‌పై పంజాబ్ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. 'సంప్రదాయాల ప్రకారం 2023 జూన్ 19–20వ తేదీలలో జరిగిన అసెంబ్లీ సెషన్ చెల్లుబాటుపై సందేహాలకు రాజ్యాంగ ప్రాతిపదిక లేదని భావిస్తున్నాం. శాసనసభ సమావేశాలపై సందేహాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం' అని ధర్మాసనం పేర్కొంది. సభ అధికారాల సంరక్షకునిగానూ, శాసనసభకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగబద్ధంగా గుర్తింపు పొందిన అధికారిగానూ గుర్తింపు పొందిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, సభను వాయిదా వేయడంలో తన అధికార పరిధిలో చక్కగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. అంతేకాకుండా, బడ్జెట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయకుండా పదే పదే వాయిదా వేయడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే, సభా వ్యవహారాల నిర్వహణ, సమావేశాలను వాయిదా వేయడంలో స్పీకర్ నిర్ణయమే అంతిమమంటూ తేల్చి చెప్పింది.



రఫాలో శిథిలాల మధ్య దిగాలుగా కూర్చున్న చిన్నారులు

దిగ్బంధంలో ఆస్పత్రులు

గాజాసిటీలో నాలుగు హాస్పిటళ్ల సమీపంలో భీకర దాడులు | హమాస్ కమాండర్లు సహా 19 మంది మిలిటెంట్లు హతం!

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: దక్షిణ గాజాకు బారులు కట్టిన జనం.. హమాస్ మిలిటెంట్ల స్థావరాలే లక్ష్యంగా ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. వీధుల్లో భూతల పోరాటాలు.. ఆసుపత్రులను చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైనికులు.. గాజా స్ట్రిప్‌లో ప్రస్తుత దృశ్యమిదీ. గాజా సిటీలోని నాలుగు పెద్ద ఆసుపత్రులపై ఇజ్రాయెల్ సైన్యం గురిపెట్టింది. హమాస్ కమాండ్ సెంటర్లు అక్కడే ఉన్నాయని, వాటిని ధ్వంసం చేయక తప్పదని తేల్చిచెప్పింది. శుక్రవారం తెల్లవారుజామునే నాలుగు ఆసుపత్రుల సమీపంలో క్షిపణి దాడులు చేసింది. గాజాలో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రి ప్రాంగణంలో 24 గంటల వ్యవధిలో ఐదుసార్లు క్షిపణులు ప్రయోగించింది. కొన్ని వార్డులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇంట్లో కంటే ఆసుపత్రిలోనే భద్రత ఉంటుందని ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వేలాది మంది జనం తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని క్షణమొక యుగంలా కాలం గడిపారు. అల్–షిఫా హాస్పిటల్ వద్ద జరిగిన దాడుల్లో ఒకరు మరణించారని, మరికొందరు గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. కానీ, తమ సైన్యం దాడుల్లో 19 మంది మిలిటెంట్లు హతమయ్యారని, వీరిలో హమాస్ కీలక కమాండర్, ప్లాటూన్ కమాండర్ సైతం ఉన్నారని ఇజ్రాయెల్ వెల్లడించింది. 20 రాకెట్ లాంచర్లు నిల్వ చేసిన హమాస్ షిప్పింగ్ కంటైనర్‌ను ధ్వంసం చేశామని తెలియజేసింది. గాజాసిటీలోని నాలుగు ఆసుపత్రుల చుట్టూ ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు మోహరించాయి. ఇజ్రాయెల్ సేనలు గాజా నగరంలోకి ముమ్మందుకు చొచ్చుకొస్తున్నాయి. గాజాసిటీలోని ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయగా, 20 పాలస్తీనియన్లు మరణించారని స్థానిక అధికారులు చెప్పారు.

మృతులు 11,078.. క్షతగాత్రులు 27,000

ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 11,078 మంది మరణించారని, వీరిలో 4,506 మంది చిన్నారులు ఉన్నారని గాజా ఆరోగ్య శాఖ శుక్రవారం ప్రకటించింది. 27,000 మంది గాయపడ్డారని తెలిపింది. మరో 2,650 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారంతా ఇప్పటికే మృతిచెంది ఉండొచ్చని తెలుస్తోంది.

వలస వెళ్తున్నవారిపై వైమానిక దాడులు!

ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు చేరుకోవడానికి వీలుగా ఇజ్రాయెల్ సైన్యం ప్రతిరోజూ దాదాపు 4 గంటలపాటు దాడులకు విరామం ఇస్తోంది. ఇకపై నిత్యం విరామం అమల్లో ఉంటుందని ఇజ్రాయెల్ వెల్లడించింది. గత ఐదు రోజుల్లో 1,20,000 మంది దక్షిణ గాజాకు వెళ్లిపోయారు. వారిపైనా వైమానిక దాడులు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈజిప్టు నుంచి గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందుతోంది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలతో ప్రతిరోజు దాదాపు 100 వాహనాలు గాజాకు చేరుకుంటున్నాయి. మరోవైపు, హమాస్ మిలిటెంట్లపై దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పునరుద్ఘాటించారు. గాజాలో హమాస్ స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసేవరకూ అవి కొనసాగుతాయన్నారు.

ఉత్తర గాజా.. భూమిపై నరకం

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతోంది. మిలిటెంట్ల స్థావరాలతో పాటు సాధారణ జనవాసాలపై బాంబుల వర్షం కురిపిస్తోంది. అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభం కాగా, గాజాలో ఇప్పటికే దాదాపు 50 శాతం ఇళ్లు నేలమట్టం అయ్యాయి. శిథిలాలుగా మారిపోయాయి. ప్రధానంగా ఉత్తర గాజాలో పరిస్థితి భీతావహంగా మారింది. ఈ ప్రాంతం మరుభూమిని తలపిస్తోంది. ఐక్యరాజ్యసమితి హ్యూమానిటేరియన్ ఆఫీసు ఉత్తర గాజాను 'భూమిపై నరకం'గా అభివర్ణించిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

హిందువులు సహనశీలురు

జావెద్ అక్తర్ వ్యాఖ్యలు

ముంబై: ప్రముఖ కవి, గీత రచయిత జావెద్ అక్తర్(78) హిందూ సంస్కృతిపై ప్రశంసలు కురిపించారు. హిందువులు ఎంతో సహనశీలురని, వారి వల్లే మన దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తోందని చెప్పారు. అదే సమయంలో, నేడు దేశంలో వాక్ స్వాతంత్ర్యం తగ్గిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముంబైలో రాజ్ ఠాక్రే సారథ్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) నిర్వహించిన దీపోత్సవ్‌లో ఆయన పాల్గొన్నారు. 'హిందువులు దయామయులు. విశాల హృదయులు. అసహనం కలిగిన కొందరున్నారు. హిందువులు వారిలా ఉండరు. హిందువులకు మాత్రమే దయ, విశాల హృదయం అనే గొప్ప లక్షణాలుంటాయి. వాటిని కోల్పోవద్దు. లేకుంటే మిగతా వారికీ మీకూ బేధం ఉండదు. హిందువుల జీవన విధానం నుంచి మేం నేర్చుకున్నాం. వాటిని మీరు వదులుకుంటారా?'అని ఆయన ప్రశ్నించారు. ఇంకా ఆయన.. 'శ్రీరాముడు, సీతాదేవిల గడ్డపై పుట్టినందుకు గర్విస్తున్నాను. నేను నాస్తికుడినే అయితే రాముడిని, సీతను ఈ దేశ సంపదగా భావిస్తాను. రామాయణం మన సాంస్కృతిక వారసత్వం'అంటూ జై సియా రాం అని నినదించారు. 'ఇది హిందూ సంస్కృతి, నాగరికత. మనకు ప్రజాస్వామ్య దృక్పథాలను నేర్పింది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. అందుకే మనమే ఒప్పు, అందరిదీ తప్పు అని భావించడం హిందువుల సిద్ధాంతం కాదు. ఇది మీకు ఎవరు నేర్పించినా తప్పే'అని అన్నారు. అయితే, దేశంలో నేడు వాక్ స్వాతంత్ర్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ భారం మాపైకి నెట్టేయకండి

ఢిల్లీలో సరి–బేసి ట్రాఫిక్ విధానంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కాలుష్యాన్ని నియంత్రించే విషయంలో కోర్టుపైకి భారం నెట్టేసే ప్రయత్నాలు మానుకోవాలని ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఢిల్లీలో మళ్లీ సరి–బేసి ట్రాఫిక్ విధానం తేవడంపై నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదేనని, తామెలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని స్పష్టం చేసింది. సరి–బేసి విధానంతో తమకు ఎటువంటి సంబంధం లేదని, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి ఢిల్లీలోకి ప్రవేశించే ట్యాక్సీలకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని తామెన్నడూ తెలపలేదని పేర్కొంది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సరి–బేసి విధానం కాలుష్యాన్ని తగ్గించడంలో అంతగా పనిచేయదని అమికస్ క్యూరీకి చెప్పామని గుర్తు చేసింది. ''మీరేం చేయాలో చెప్పడానికి మేమిక్కడ లేం. ఆ విధానం కొనసాగించొద్దు అని మేం చెప్తే, సుప్రీంకోర్టు ఆదేశించినందువల్లే కాలుష్యం ఎక్కువైందని మీరంటారు'' అని పేర్కొంది. ఢిల్లీలో వాయు నాణ్యత మెరుగు పడినందున సరి–బేసి విధానం అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

పూరీ, హసన్ ఆలయాల్లో తోపులాట

పూరీ/హసన్: ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథుని ఆలయం, కర్ణాటకలో హసన్‌లో ఉన్న హసనాంబ ఆలయాల్లో శుక్రవారం వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. రద్దీ కారణంగా చోటుచేసుకున్న తోపులాటల్లో 27 మంది వరకు గాయపడ్డారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు వివరించారు. శుక్రవారం వేకువజాము నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైందని శ్రీ జగన్నాథ్ ఆలయ అధికారులు తెలిపారు. మంగళ హారతి సమయంలో గేట్లు తెరవడంతో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుని 10 మంది భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. వీరిలో ఎక్కువ మంది వృద్ధ మహిళలున్నారని అన్నారు. బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు చెప్పారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారని తెలిపారు. ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువైందే తప్ప తోపులాట జరగలేదని పూరీ ఎస్పీ కేవీ సింగ్ స్పష్టం చేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలోని హసనాంబ ఆలయంలో క్యూలైన్లలోని వారు విద్యుత్ షాక్‌కు గురై 17 మంది వరకు గాయపడ్డారు. ఇది తోపులాటకు దారితీసింది. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు చెప్పారు. బాధితులు చెబుతున్న కరెంట్ షాక్ విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 11 : నవంబర్ : 2023


రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆరోపిస్తూ శుక్రవారం బెళగావిలో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

రౌడీ ఏనుగు పట్టివేత


శిక్షణ ఏనుగుల సహాయంతో మదగజాన్ని పట్టుకొని తరలిస్తున్న దృశ్యం

మైసూరు: మైసూరు జిల్లా హెచ్‌డి.కోటె తాలూకా నాగరహొళె అభయారణ్యంలో అణ్ణూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గురువాయనకెరె కేంద్రం సమీపంలో అటవీ సిబ్బందిపై తిరగబడుతున్న ఏనుగును అటవీశాఖ అధికారులు బంధించారు. 10 రోజుల క్రితం మాస్తిగుడి పునర్వసతి కేంద్రంలోని ఏనుగుల తొక్కిసలాటలో ఆదివాసి వ్యక్తి మృతి చెందడంతో ఏనుగులను పట్టుకోవాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. రంగంలోకి దిగిన అటవీశాఖ సిబ్బందిపై సదరు ఏనుగు తిరగబడింది. దీంతో మైసూరు దసరా వేడుకల్లో పాల్గొన్న ఏనుగులు అశ్వత్థామ, మహారాష్ట్ర భీమ, కర్ణాటక భీమ, హర్ష, అభిమన్యు, మహేంద్ర సహకారంతో డీఎఫ్ఓ హర్ష కుమార్ చిక్కనరసగుంద మార్గదర్శనంలో అటవీశాఖ సిబ్బంది ఆరు రోజుల పాటు గాలింపు చేపట్టి శుక్రవారం దానిని బంధించారు. 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఏనుగును మత్తిగోడు ఏనుగుల శిబిరానికి తరలించారు.

ఆర్‌డీ పాటిల్ అరెస్ట్

బనశంకరి: కేఈఏ పరీక్ష అక్రమాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఆర్‌డీ పాటిల్‌ను శుక్రవారం అఫ్జల్‌పుర పోలీసులు మహారాష్ట్ర సరిహద్దులో అరెస్ట్‌చేశారు. కేఈఏ పరీక్షల్లో అభ్యర్థులకు బ్లూటూత్ వినియోగించి సమాధానాలు పంపినట్లు ఆరోపణలతో ఆర్‌డీ.పాటిల్ 12 రోజుల క్రితం తాను అద్దెకు ఉంటున్న ఇంటినుంచి గోడ దూకి పరారీ అయ్యారు.

హెచ్‌డీకేను కలిసిన ఇజ్రాయిల్ కాన్సులేట్ జనరల్


కుమారస్వామితో చర్చిస్తున్న టామిబెన్

దొడ్డబళ్లాపురం: మాజీ సీఎం, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామిని దక్షిణ భారత ఇజ్రాయిల్ కాన్సులేట్ జనరల్ టామిబెన్ కలిశారు. రామనగర తాలూకా బిడదిలోని ఫామ్‌హౌస్‌లో కుమారస్వామిని కలిసిన ఆమె సమాన అభివృద్ధి దృష్టికోణంతో అభివృద్ధి చెందుతున్న ఇజ్రాయిల్, కర్ణాటక మధ్య హితాసక్తికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఈ బంధం ఇలాగే కొనసాగాలని టామిబెన్ కోరారు. ఇదే సందర్భంగా హమాస్‌తో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం గురించి కూడా ఇద్దరూ చర్చించుకున్నారు. యుద్ధం ముగిశాక కర్ణాటకతో కలిసి వ్యవసాయం, విజ్ఞానం, తంత్రజ్ఞానం, ప్రయోగాలు, సాంస్కృతిక సంబంధాలు బలపడేలా పనిచేద్దామన్నారు. కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇజ్రాయిల్‌లో పర్యటించిన సందర్భాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఇదే సందర్భంగా మాట్లాడిన కుమారస్వామి ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన వారు క్షేమంగా తమ దేశాలకు తిరిగిరావాలని ఆకాంక్షించారు.

ఆయుర్వేదంతో వ్యాధులకు చెక్

చిక్కబళ్లాపురం: ఆయుర్వేద ఔషధాలతో అనేక వ్యాధులను అరికట్టవచ్చని జెడ్పీ సీఈఓ ప్రకాశ్‌నిట్టాలి అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా పాలకమండలి ఏర్పాటు చేసిన 8వ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి చుట్టుపక్కల పెరిగే అనేక మొక్కలు సరైన రీతిలో వినియోగిస్తే బీపీ, షుగర్ లాంటి వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు.

ఎస్‌ఐ పోస్టులకు మళ్లీ రిక్రూట్‌మెంట్

- హైకోర్టు ఆదేశం
- స్వతంత్ర ఏజెన్సీ ద్వారా పరీక్ష
- గత బీజేపీ హయాంలో భారీ కుంభకోణం



శివాజీనగర: రాష్ట్రంలో గత బీజేపీ హయాంలో సంచలనం సృష్టించిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నియామక పరీక్షల్లో చోటు చేసుకున్న కుంభకోణంపై నాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ మళ్లీ పరీక్ష నిర్వహించాలని శుక్రవారం హైకోర్టు ఆదేశించింది. నాటి బీజేపీ ప్రభుత్వం 545 పీఎస్ఐ పోస్టులకు సంబంధించి నిర్వహించిన పరీక్షల్లో భారీ కుంభకోణం చోటుచేసుకున్న విషయం తెల్సిందే. దీంతో స్వతంత్ర ఏజెన్సీ ద్వారా ఎస్ఐ పోస్టులకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలని న్యాయమూర్తి దినేశ్‌కుమార్ నేతృత్వపు డివిజనల్ బెంచ్ తీర్పు నిచ్చింది. కోర్టు నిర్ణయం గతంలో పరీక్ష రాసి పాసైన అభ్యర్థుల్లో తీవ్ర నిరాశకు గురిచేసింది.

క్యాట్‌లో పిటిషన్ :
నియామక అక్రమాల నేపథ్యంలో పీఎస్ఐ పరీక్ష కొత్తగా జరిపేందుకు ప్రభుత్వం 2022 ఏప్రిల్ 29న ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు రద్దు కోరుతూ ఎంపికైన కొందరు అభ్యర్థులు క్యాట్‌లో పిటిషన్ వేశారు. దానిని జూన్ 19న క్యాట్ డిస్మిస్ చేసింది. దీనిని ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. శుక్రవారం తీర్పును న్యాయస్థానం ప్రకటించి పునః పరీక్షకు ఆదేశించింది.

కేసు వివరాలు ఏమిటి?
గత బీజేపీ ప్రభుత్వ కాలావధిలో 545 పీఎస్ఐ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలు బయటపడ్డాయి. ఈ మేరకు అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ అమృత్‌పాల్‌తో పాటుగా 60 మందికిపైగా అరెస్టయ్యారు. పరీక్షల్లో అక్రమాల వెనుక ఆర్‌డీ పాటిల్, దివ్యా హాగరగితో పాటు పలువురిని అరెస్ట్ చేశారు.

కమిషన్ నియామకం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పీఎస్ఐ నియామక అక్రమాలకు సంబంధించి విచారణ జరిపేందుకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి వీరప్ప నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ విచారణలో ప్రగతి సాధించింది. ఇప్పటికే 22 మంది సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. కేసులో 120 మంది నిందితులతో పాటుగా తనిఖీ అధికారులకు నోటీసులు జారీ చేసి కమిషన్ విచారణ చేపట్టింది.

విజయేంద్రకు బీజేపీ రాష్ట్ర పగ్గాలు

- పంతం నెగ్గించుకున్న మాజీ సీఎం యడియూరప్ప


బీవై విజయేంద్ర

సాక్షి బెంగళూరు: ఎంతో మంది ఆశావహులు ఉన్నప్పటికీ, ఎన్నో లాబీయింగ్‌లు జరిగినప్పటికీ, సీనియర్ల తాకిడి మధ్యలో కూడా మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప కుమారుడు విజయేంద్రకే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కింది. వచ్చే లోక్‌సభఎన్నికలను విజయేంద్ర నాయకత్వంలో బీజేపీ ఎదుర్కోనుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా విజయేంద్ర ఎంపికను ఖరారు చేస్తూ శుక్రవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ కన్నడ ఎంపీగా ఉన్న నళిన్ కుమార్ కటీల్ ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు.

సమర్థంగా పనిచేస్తా
అత్యున్నతమైన బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్రమోదీ, జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కు కృతజ్ఞతలు అని విజయేంద్ర ట్వీట్ చేశారు. సీనియర్లు, సంఘ పెద్దల మార్గదర్శనంలో ప్రజల ఆకాంక్షల మేరకు సమర్థవంతంగా పని చేసి రాష్ట్ర పార్టీకి కొత్త చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని విజయేంద్ర హామీనిచ్చారు.

అంచెలంచెలుగా ఎదిగి...
2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించిన బీవై విజయేంద్రకు అధిష్టానం బ్రేకులు వేసింది. తొలుత బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని విజయేంద్రకు ఢిల్లీ పెద్దలు కట్టబెట్టారు.ఆ తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించారు. ఉపాధ్యక్షుడు అయిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో శిరా, కేఆర్ పేట నియోజకవర్గాల బాధ్యతలు విజయేంద్రను వరించాయి. ఈ బాధ్యతను సమర్థవంతంగా వినియోగించుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెండు స్థానాల్లో బీజేపీ కాషాయ జెండా ఎగురడంలో ప్రధాన పాత్ర పోషించారు. అయితే 2023 విధానసభ ఎన్నికలకు ముందు ప్రత్యక్ష రాజకీయాల నుంచి తన తండ్రి బీఎస్ యడియూరప్ప తప్పుకున్నారు. దీంతో తన తండ్రి సొంత నియోజకవర్గం శికారిపుర నుంచి పోటీ చేసేందుకు విజయేంద్రకు అవకాశం దక్కింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో శికారిపుర నుంచి పోటీ చేసిన తొలిసారి అఖండ మెజారిటీ గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీజేపీకి కొత్త సారథిని వెతికే పనిలో అధిష్టానం పడింది. ఈ క్రమంలో పలుమార్లు ఢిల్లీకి యడియూరప్ప వెళ్లడమే కాకుండా తన కుమారుడిని వెంటబెట్టుకుని తీసుకెళ్లి చర్చలు జరిపారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి పార్టీ నుంచి ఘనాపాటీలు పోటీ పడడంతో అధిష్టానానికి ఎంపిక కష్టసాధ్యమైంది. పలుమార్లు వివిధ రకాల పేర్లు వినిపించినప్పటికీ యడియూరప్ప తన ప్రాభవాన్ని నిలబెట్టుకుంటూ కుమారుడిని రాష్ట్ర అధ్యక్షుడిని చేయగలిగారు. మూడేళ్ల సేవల అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి సీనియర్ నేత సీటీ రవిని తప్పించడంతో ఆయనకు అధ్యక్ష పదవి ఖరారు అయిందని అంతా భావించారు. సీటీ రవితో పాటు సీనియర్లు వి.సోమణ్ణ, శోభ కరంద్లాజే, డీవీ సదానంద గౌడ, అశ్వత్థ నారాయణ పేర్లు కీలకంగా వినిపించాయి. అయితే వీరెవరికీ కాకుండా విజయేంద్ర సారథ్యాన్ని దక్కించుకుని అందరిని ఆశ్చర్యపరిచారు.

లింగాయత్‌లను ఆకట్టుకునేందుకే

రాష్ట్రంలో లింగాయత్ సామాజికవర్గం ఎంతో కీలకంగా ఉంది. ఆ సముదాయానికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తే లోకసభ ఎన్నికల్లో పార్టీకి అనుకూలంగా ఉంటుందని బీజేపీ అధిష్టానం భావించింది. విధానసభ ఎన్నికల్లో పార్టీకి కొద్దిగా దూరంగా జరిగిన లింగాయతులను తిరిగి అక్కున చే ర్చుకునేందుకు ఈ ఎంపిక పనికొస్తుందని భావించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బీఎస్ యడియూరప్ప లింగాయతుల అగ్రనాయకుడుగా ఉండడంతో పాటు మాస్ లీడర్‌గా పేరు గడించారు. ఈ క్రమంలో యడియూరప్ప కుమారుడికి అవకాశం కల్పిస్తే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని ప్రణాళికలు రచించినట్లు సమాచారం. ఇదే క్రమంలో యడియూరప్ప వర్గానికి దూరంగా ఉండే వి.సోమణ్ణ, బసనగౌడ పాటిల్ యత్నాల్, సీటీ రవి, కేఎస్ ఈశ్వరప్ప వంటి నేతలు ఈ ఎంపికను వ్యతిరేకించే అవకాశం ఉంది.

హాసనాంబె ఆలయం వద్ద తొక్కిసలాట

- 20 మందికి గాయాలు
- బారికేడ్‌కు షార్ట్‌సర్క్యూట్‌తో పరుగులు


ఆలయం వద్ద మహిళా భక్తులు

యశవంతపుర: హాసనాంబె ఆలయ సమీపంలోని క్యూలైన్ బారికేడ్‌కు కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో భక్తులు పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగి 20 మంది మహిళలతో పాటు ఓ చిన్నారి గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం ఉచిత దర్శన క్యూలైన్‌లోకి భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ సమయంలో బారికేడ్‌కు విద్యుత్ షాక్ రావడంతో భక్తులు ప్రాణాలు కాపాడుకోవడానికి ఒకరినొకరు తోసుకుంటూ పరుగులు తీశారు. దీంతో 20 మంది గాయపడ్డారు. ఒక బాలికకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మురుఘాశ్రీ బెయిల్ పిటిషన్ వాయిదా

యశవంతపుర: పోక్సో కేసు కింద అరెస్టయిన మురఘాశ్రీ బెయిల్ పిటిషన్ ఈనెల 15కు చిత్రదుర్గ జిల్లా కోర్టు వాయిదా వేసింది. ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను మురుఘాస్వామి తరపు న్యాయవాది సందీప్ పాటీల్ శుక్రవారం మధ్యాహ్నం కోర్టుకు అందించారు. ష్యూరిటీ వివరాలను పరిశీలించటానికి కేసును ఈ నెల 15కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. స్వామి బెయిల్ కోసం ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర సోదరుడు కేసీ నాగరాజు, మధుసూధన్‌లచే లక్ష రూపాయల బాండ్‌ను అందించారు.

బిడది వరకూ మెట్రో సేవలు

- బిడది టౌన్ ప్లానింగ్ అథారిటీని రద్దు చేసి గ్రేటర్ బెంగళూరు ప్లానింగ్ అథారిటీగా మార్పు
- ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్




దొడ్డబళ్లాపురం: రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణ జిల్లాగా పేరు మారుస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఏరోజైతే ప్రకటించారో ఆరోజు నుంచే ఆయన ఆ దిశలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ఆయన తన పని చేసుకుంటూ వెళ్తున్నారు. తాజాగా బిడది టౌన్ ప్లానింగ్ అథారిటీని రద్దు చేసి గ్రేటర్ బెంగళూరు ప్లానింగ్ అథారిటీగా మార్చాలని ఆదేశించినట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. అంతేకాదు మెట్రో సేవలు బిడది వరకూ విస్తరింపజేస్తామని కూడా హామీ ఇచ్చారు. శుక్రవారం బిడదిలోని టొయోటా కిర్లోస్కర్ సంస్థ ఆవరణలో నూతనంగా నిర్మించిన ట్రైనింగ్ సెంటర్ కట్టడాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ బిడది పారిశ్రామికవాడలో లక్షమందికి పైగా పనిచేస్తున్నారని, వీరందరి రాకపోకలకు అనుకూలంగా ఉండాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ మనవి మేరకు ప్లాన్ సిద్ధం చేయాలని బీఎంఆర్‌సీఎల్‌కు సూచించానన్నారు. బిడది పరిధిలో సుమారు 10వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని ఎందుకూ ఉపయోగించకుండా వదిలేశారన్నారు. బెంగళూరులో లభించే సౌకర్యాలు ఇక్కడా లభించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అందుకే పైరెండు పథకాలను ఈరోజు ప్రకటించానన్నారు. ఈ పథకాలు అమలయితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా ఆస్తుల విలువ కూడా పెరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఆస్పత్రులు, విద్యాసంస్థలు, కార్మికులు వారి పిల్లలు ఇలా అందరికీ మేలు జరగాలనే ఈ పథకాలు అమలు చేయాలనుకుంటున్నానన్నారు. టొయోటా సంస్థ ఆడపిల్లల కోసం ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మహిళలకు శక్తి ఇవ్వాలనేది తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాబోవు ఎన్నికల వేళకు మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించి ఈ ప్రాంతంలో మహిళా జనప్రతినిధులను ఎన్నుకుంటామన్నారు.

కేఐఏలో రూ. 3.9 కోట్ల బంగారం స్వాధీనం



దొడ్డబళ్లాపురం: విదేశాల నుంచి కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఏడుగురు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు రూ.3.9 కోట్ల విలువైన బంగారాన్ని సీజ్ చేసారు. కువైట్, షార్జా, దుబాయ్, అబుదాబి, బ్యాంకాక్ దేశాల నుండి కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన వీరు లోదుస్తుల్లో, పర్సు, హ్యాండ్ బ్యాగ్‌లలో బంగారాన్ని, పేస్టు, క్యాప్సూల్ రూపంలో అక్రమంగా తీసుకువచ్చారు. చెకింగ్ సమయంలో వీరంతా పట్టుబడ్డారు. రెండు రోజుల్లో రూ.3.9 కోట్ల విలువైన బంగారాన్ని సీజ్ చేసినట్టు కస్టమ్స్ అధికారులు తెలిపారు.



62 మైదానాల్లో బాణాసంచా విక్రయాలు

బనశంకరి: దీపావళిని పురస్కరించుకొని బెంగళూరులోని 62 మైదానాల్లో తాత్కాలిక బాణాసంచా విక్రయాల స్టాల్స్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాయుకాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో గ్రీన్ టపాసులు మినహా వేరే టపాసుల వినియోగాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిందన్నారు. దీంతో పోలీస్‌శాఖ, బీబీఎంపీ ప్రత్యేక టపాసులు విక్రయానికి నిర్దిష్ట స్థలాలు గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని దయానంద తెలిపారు. దుకాణాల ఏర్పాటుకు సేవాసింధు పోర్టల్ ద్వారా ధరకాస్తు చేసుకొని రూ.5వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 320 దుకాణాలు తెరవడానికి అవకాశం ఉండగా ప్రస్తుతం 263 దరఖాస్తుదారులకు అనుమతి ఇచ్చామన్నారు.

బాలికకు మత్తుమందు ఇచ్చి అత్యాచారం

- ముగ్గురిపై పోక్సో కేసు, అరెస్ట్

మండ్య: ఓ దళిత విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 4న మండ్య జిల్లా మద్దూరు పట్టణంలో ఈ అమానుషం చోటుచేసుకుంది. ఈ కేసులో మద్దూరు తాలూకాకు చెందిన పునీత్, మంజునాథ్, సిద్దరాజులను అరెస్ట్ చేశారు. ఈనెల 4న ఉదయం 11 గంటల సమయంలో బాలికకు మాయమాటలు చెప్పి కేఎం దొడ్డి నుంచి మద్దూరుకు బస్సులో తీసుకువచ్చిన నిందితులు ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి ఆమెకు జ్యూస్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి ముగ్గురు అత్యాచారం చేశారు. ఆమెను తీవ్రంగా గాయపరిచారు. ఈ క్రమంలో వీడియోలను కూడా తీసుకున్నారు. ఫోన్ చేసి పిలిచిన ప్రతిసారి రావాలని, లేదంటే వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించారు. దీంతో బాధితురాలు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

10 వేల మంది బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు

- బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో మకాం
- ఎన్ఐఏ దర్యాప్తులో వెలుగులోకి

బనశంకరి: బెంగళూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో దాదాపు 10 వేల మంది బంగ్లాదేశ్ వలసదారులు మకాంవేసినట్లు ఎన్ఐఏ అధికారుల దర్యాప్తులో వెలుగుచూసింది. బెంగళూరు నగరంలోని కృష్ణరాజపురం, సోలదేవనహళ్లి, బెళ్లందూరు, బయప్పనహళ్లి, గ్రామాంతరలోని దొడ్డబళ్లాపుర, హొసకోటే, అనేకల్‌తో రామనగర పాటు 15 ప్రాంతాల్లో రెండు రోజులక్రితం ఎన్ఐఏ దాడులు చేసి అక్కడ మకాం వేసిన బంగ్లాదేశీయులపై దాడిచేసి అక్రమ వలసలను ప్రోత్సహిస్తున్న 11 మందిని అరెస్ట్ చేశారు. మాస్టర్‌మైండ్ జాకీర్‌హుసేన్ సూచనమేరకు బెంగళూరు నగరానికి బంగ్లాదేశీయులను రప్పిస్తున్నట్లు విచారణలో తేలింది. 10 వేలమందికి పైగా అక్రమంగా వచ్చి బెంగళూరు తో పాటు వివిధ ప్రాంతాల్లో మకాం వేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. కాగా ఎన్ఐఏ దాడిసమయంలో చాలామంది బంగ్లాదేశ్ వలదారుల వద్ద ఆధార్ కార్డు, ఓటర్లు గుర్తింపుకార్డులు లభించాయి. ఆ కార్డులు ఎవరు అందిస్తున్నారన్న విషయంపై ఎన్ఐఏ కూపీ లాగుతోంది. అక్రమ వలసదారుల్లో కొంతమంది దోపిడీలకు పథకం రచించారని, మరికొందరు వేశ్యావాటికలో దందా నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది.



మార్కెట్లలో దీపావళి సందడి

దీపావళి సందడి అప్పుడే మొదలైంది. బెంగళూరు మార్కెట్లలో వైవిధ్యమైన ప్రమిదలు, ఇతర అలంకరణ వస్తువులు మార్కెట్లలో దర్శనం ఇస్తున్నాయి. ప్రజలు శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చి కొనుగోలు చేస్తున్న దృశ్యం





ఆస్తుల విలువల్లో జయనగర టాప్

- రాష్ట్రంలోనే ఖరీదైన ప్రాంతంగా గుర్తింపు
- మైసూరు రాజులతో పునాది పడిన కాలనీ
- విశాలమైన రహదారులు
- 30+40 సైటు ధర అంచనా రూ.8 కోట్లు

బనశంకరి: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల నిర్దేశంచిన ఆస్తుల విలువలో బెంగళూరులోని జయనగర రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా తేలింది. వాణిజ్య అవసరాలకు కేటాయించిన స్థలాలకు సంబంధించి జయనగర మూడో బ్లాక్ కాస్మోపాలిటన్ క్లబ్ సర్కిల్ నుంచి 11వ మెయిన్ రోడ్డు వరకు ప్రతి చదరపు మీటరుకు రూ.5.36 లక్షలు, జయనగర 4వ బ్లాక్ 30వ క్రాస్ 4వ మెయిన్‌రోడ్డు నుంచి దయానంద కాలేజీ వరకు చదరపు మీటరుకు రూ.5.03 లక్షలు, 27వ రోడ్డులో చదరపు మీటరుకు రూ.5,03,500, జయనగర 5వ బ్లాక్ 40వ రోడ్డులో చదరపు మీటరుకు రూ.4.39 లక్షలుగా నిర్ణయించారు. ఇది మార్కెట్ విలువ మాత్రమే. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ 30శాతానికిపైగా ఉంటుంది. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం 30+40 సైటు ధర రూ.6 కోట్లు కాగా బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగా ఉంటుందని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు.

అత్యాధునిక సదుపాయాలు
రాష్ట్రంలోనే జయనగరలో ధరలు అధికంగా పలకడానికి అనేక కారణాలు ఉన్నాయి. విశాలమైన రోడ్లు, పార్కులు, ఆసుపత్రులు, గ్రంథాలయాలతో పాటు పచ్చదనంతో కూడుకుని ఉంది. ఇక్కడ శ్రీమంతులు ఎక్కువగా స్థిరపడ్డారు. వాణిజ్య అవసరాలకోసం ఏర్పాటుచేసిన సైట్లలో పెద్దపెద్ద బ్రాండెడ్ కంపెనీల మాల్స్ వెలిశాయి. దీంతో ఇక్కడ ఆస్తి విలువ ఏటా పెరుగుతోంది.

మైసూరు సంస్థాన జ్ఞాపకార్థం
1940లో మైసూరు మహారాజుగా ఉన్న జయచామరాజేంద్ర ఒడియార్ రాజుగా పట్టాభిషిక్తుడైన 8 ఏళ్ల తర్వాత పరిపాలన విజయవంతంగా పూర్తిచేసినందుకు జ్ఞాపకంగా 1948లో జయనగర లేఔట్ కు పునాది వేశారు.సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టుబోర్డు(సీఐటీబీ) ప్రాధికార ఏర్పాటుచేసి అధ్యక్షుడిగా సీ.నరసింగరావ్, చీఫ్ ఇంజినీర్‌గా ఆర్.మాధవన్‌ను నియమించారు.

అధిక ఆస్తివిలువ కలిగిన ప్రదేశాలు (చదరపు మీటరు ధర లక్షల్లో)

- కోరమంగల రింగ్‌రోడ్డు రూ.1,06,600
- మారేనహళ్లి 100 ఫీట్‌రోడ్డు వాణిజ్యసైట్ రూ.3,65,900
- మల్లేశ్వరం 5 నుంచి 12వ మెయిన్‌రోడ్డు వరకు రూ.1,95,000
- అవెన్యూమెయిన్‌రోడ్డు రూ.2,69,125
- కెంపేగౌడరోడ్డు రూ.3,36,375
- గాంధీనగరలో రూ.2 లక్షలు
- కన్నింగ్‌హ్యాంరోడ్డు రూ.3,62,180
- చర్చ్‌స్ట్రీట్ రూ.2,30,00
- కమర్షియల్‌స్ట్రీట్ రూ.3,19,000
- కన్నింగ్‌హ్యామ్‌రోడ్డు ఎస్ఆర్‌టీ రూ.3,22,000
- ఎంజీరోడ్డునుంచి హలసూరు వరకు,డికెన్సన్ రోడ్డు రూ.1.81,500

క్లుప్తంగా

ఆర్టీసీ డీసీకి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న దేవేంద్రమ్మ

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ రాయచూరు ఆర్టీసీ విభాగంలో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేంద్రమ్మకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆమె గత నెల 30న గోవా రాజధాని పణజిలోని బ్రగంజ భవనంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ విశ్వనాథ్ చినకోడ్ చేతుల మీదుగా హ్యూమన్ డెవలప్‌మెంట్ విశ్వవిద్యాలయం నుంచి పట్టాను అందుకున్నారు.

కళ్యాణి అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: నగరంలోని సంతమైదానం వద్ద ఉన్న కళ్యాణి అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే నంజేగౌడ ప్రారంభించారు. శనివారం సీఎం చేతుల మీదుగా యరగోళ డ్యాం ప్రారంభిస్తే ఇక తాలూకాలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. డ్యాంను ప్రారంభంతో మూడు తాలూకాల్లో నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ప్రతి గ్రామం నుంచి స్వచ్ఛందంగా 25 మంది తరలి రావాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సి.లక్ష్మీనారాయణ, జెడీ్స సభ్యుడు హనుమంతప్ప, పురసభ సభ్యుడు ఎ.రాజప్ప, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జానపద ప్రదర్శనలు



కళాకారుల విన్యాసం

మైసూరు: మైసూరు నగరంలోని జేపీ నగర జేఎస్ఎస్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళల ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్, దీపా పాల్గొని కన్నడ మాత భువనేశ్వరి మాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల జానపద నృత్యాలు అలరించాయి. కన్నడ గీతాలు ఆలపించారు. డొళ్లు కుణిత, వీరగాసె, పూజకుణిత కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నిందితుడి అరెస్ట్

యశవంతపుర: ప్రేమించి పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి విద్యార్థినిని గర్భవతిని చేసిన జీవన్(21) అనే నిందితుడిని హాసన పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు 10 తరగతి విద్యార్థినితో తొలుత మంచిగా వ్యవహరించాడు. ప్రేమిస్తున్నట్లు నాటకం ఆడి శారీరకంగా లోబర్చుకున్నాడు. శరీరంలో వచ్చిన మార్పులను గమనించి తల్లిదండ్రులు పరీక్షలు చేయించగా ఐదు నెలల గర్భిణి అని తేలింది. దీంతో హాసన గ్రామాంతర పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నిందితుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

యువకుడి హత్య

బనశంకరి: జాతరలో పాటల విషయంలో స్నేహితుల మధ్య చోటుచేసుకున్న గొడవలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బాణసవాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాణసవాడి వద్ద గురువారం రాత్రి నిర్వహించిన జాతరలో స్నేహితుల మధ్య పాటల విషయంలో గొడవ జరిగింది. ఈ సమయంలో ప్రవీణ్ (25) అనే యువకుడిపై హెల్మెట్‌తో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సుందర్, ఆర్ముగం, ప్రభులను పోలీసులు అరెస్ట్ చేశారు. మృతుడు ప్రవీణ్ నగరంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నారు.

మొక్కజొన్న కొనుగోలు చేస్తాం

బనశంకరి: కర్ణాటక పాల మహామండలి ఆధ్వర్యంలో పశు ఆహార కేంద్రాల ద్వారా పశు ఆహారం తయారీకి లక్ష మెట్రిక్‌టన్నుల మొక్కజొన్నలను రైతులనుంచి క్వింటా రూ.2250తో కొనుగోలు చేయాలనే ఉద్దేశం ఉందని పశుసంవర్ధక శాఖ మంత్రి కే.వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం వికాససౌధలో దళారుల ప్రమేయం లేకుండా రైతులనుంచి నేరుగా కొనుగోలు చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఈనెల 13 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అంతేగాక ప్రస్తుతానికి పాలధర పెంచే ఆలోచనలేదన్నారు.

లేఖన సామగ్రి పంపిణీ

కంప్లి: 2001-02వ సంవత్సరపు పూర్వ విద్యార్థులు శతమానోత్సవం పూర్తి చేరుకున్న హరపనహళ్లి పాఠశాలలో గురువందన కార్యక్రమంతో పాటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్బు, పెన్నులు అందించారు. పూర్వవిద్యార్థి మాట్లాడుతూ ప్రతి ఏటా తమ బ్యాచ్ పరంగా పిల్లలకు సహాయపడే సామగ్రి 5, 6, 7, 8వ తరగతి విద్యార్థులకు నోట్బు, పెన్నులు అందిస్తామన్నారు.

యరగోళు ప్రాజెక్టు నేడే జాతికి అంకితం



నిండుకుండలా యరగోళు జలాశయం



ప్రారంభానికి సిద్ధమైన యరగోళు ప్రాజెక్టు

- సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- నేడు జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- మూడు తాలూకాల ప్రజలకు తీరనున్న నీటి సమస్య
- నెరవేరనున్న జిల్లా ప్రజల చిరకాల వాంఛ

కోలారు: జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన యరగోళు ప్రాజెక్టు శనివారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా ప్రారంభం కానుంది.ఈ ప్రాజెక్టు ప్రారంభంతో జిల్లాలోని కోలారు, బంగారుపేట, మాలూరు తాలూకాలతో పాటు ప్రాజెక్టు కాలువ పైప్‌లైన్ ద్వారా 45 గ్రామాలకు తాగునీరు అందనుంది. ప్రాజెక్టు ప్రారంభంతో మూడు తాలూకాల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. యరగోళు ప్రాజెక్టును 17 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. భూస్వాధీన ప్రక్రియ ఆలస్యంతో పాటు పలు కారణాలతో ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అవుతోంది. పనులు కూడా నత్తనడకన సాగాయి. తరుచుగా ప్రభుత్వాలు మారుతుండడం కూడా ప్రాజెక్టు ఆలస్యానికి కారణమైంది. యరగోళు ప్రాజెక్టుకు 2007వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ధర్మసింగ్ శంకుస్థాపన నెరవేర్చారు. అనేక అవాంతరాల మధ్య ప్రాజెక్టు సుదీర్ఘ కాలం నిర్మాణం పూర్తి చేసుకుని నేడు సిద్ధమైంది.

2007లో డ్యాంకు శంకుస్థాపన

ధరంసింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కురిసిన కుంభవృష్టితో జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు నిండి మరువ పారాయి. ఆ సమయంలో బేతమంగల వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు జీప్‌తో సహా వరదలో కొట్టుకు పోయారు. ఈ భారీ వానకు యరగోళు కనుమలో 15 నుంచి 20 అడుగుల వరకు నీరు నిలబడింది. దీనిని పాపేగౌడ అనే ఇంజినీర్ గుర్తించారు. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే జిల్లా ప్రజల తాగునీటి సమస్య తీరుతుందని భావించి కాంట్రాక్టర్ రవి, నాటి నగరసభ సభ్యుడు కెఎస్ త్యాగరాజ్ తో కలిసి కోలారు పాత్రికేయులతో దీని గురించి చర్చించారు. పత్రికల్లో వచ్చిన వార్తలు, ప్రజల డిమాండ్, ఒత్తిడి, పోరాటాల అనంతరం 2007 ఏప్రిల్ 12న ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. నాటి కోలారు ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ దీనిపై ఆసక్తి కనపరిచి అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. క్రిభ్కో చైర్మన్ కూడా అయిన శ్రీనివాసగౌడ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.88 కోట్లను విడుదల చేయించారు.

తడిసి మోపెడైన నిర్మాణ వ్యయం

ప్రాజెక్టు కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ తీసుకుంది. కరోనా తదితర నానా కారణాలతో పనులు ఆలస్యం కావడంతో కాంట్రాక్టు తీసుకున్న సంస్థ నిర్ణీత అవధిలో పనులు పూర్తి చేయలేదని ప్రభుత్వం రూ.2.5 కోట్ల జరిమానా కూడా విధించింది. యరగోళు ప్రాజెక్టుకు రూ.308 కోట్లను వ్యయం చేశారు. 40 మీటర్ల ఎత్తు, 414 మీటర్ల పొడవుతో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. 500 ఎంసీఎఫ్‌టీల నీటి నిల్వ సామర్థ్యం కలిగింది. 120 అడుగుల లోతుకు పైగా నీరు నిల్వ అవుతుంది. డ్యాం నిర్మాణం కోసం 375 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. జలాశయం నిండితే 3 తాలూకాలు, 45 గ్రామాలకు రెండేళ్ల పాటు తాగునీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రారంభ సమయంలో రూ.130 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం కలిగినా అనంతరం దీనిని రూ.240 కోట్లకు పెంచారు. అయితే ప్రస్తుతం దీనిని సవరించి రూ.308 కోట్లను ఖర్చు చేశారు. యరగోళు ప్రాజెక్టు ప్రారంభం అవుతుండడంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేతివృత్తులవారు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న మార్కెట్ మోహన్

గౌరిబిదనూరు: ఆర్థికంగా వెనుకబడిన చేతి వృత్తుల పనివారు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బీజేపీ నగర అధ్యక్షుడు, నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్ సూచించారు. పట్టణంలోని బజారు రోడ్డులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ పథకం కింద చేతి వృత్తులు, కుల వృత్తులు చేసుకొనేవారికి పనిముట్లు కొనుగోలు చేయడానికి రూ. లక్షనుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం మంజూరవుతుందన్నారు.

ఆకట్టుకున్న జానపద ఉత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బొమ్మనహళ్లి : నగరంలోని బసవనగుడి ది నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవం, దసరా, దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను జాతీయ అవార్డు గ్రహీత, తోలు బొమ్మలాట కళాకారుడు డాక్టర్. దత్తాత్రేయ ఆరళికట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బొమ్మలను సాధారణంగా సిద్ధం చేయడం సాధ్యంకాదని, అవి మనుషులకు చెందిన విలువలు, ఆత్మసాక్షాత్కారాలకు ప్రతీకగా సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జానపద కళాబృందాలు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

పెట్టుబడి కూడా చేతికందదు



సిరుగుప్ప తాలూకాలో రైతుల పొలాలను పరిశీలిస్తున్న మంత్రి నాగేంద్ర



ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ తదితరులు

- మంత్రి నాగేంద్రకు రైతుల గోడు
- తమను ఆదుకోవాలని వేడుకోలు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయిన నేపథ్యంలో మంత్రి నాగేంద్ర శుక్రవారం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా సిరుగుప్ప తాలూకాలోని రారావి, అగసనూరు, మిట్టిసూగూరు, బొమ్మలాపుర, కొత్తలచింత, కుడదరాళు తదితర గ్రామాల్లో ఆయన రైతులు సాగు చేసి దెబ్బ తిన్న పంట పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు కన్నీరు పెడుతూ తమ వ్యథను వివరించారు. కరువు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు వ్యవసాయాధికారి మల్లికార్జున, ఉద్యాన, రెవిన్యూ శాఖాధికారులు పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాలో కరువు పీడిత ప్రాంతాలను పూర్తిగా అధ్యయనం చేసి ఖచ్చితంగా ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం శివకుమార్‌ల దృష్టికి తీసుకెళ్లి తగిన సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కరువులోను బీజేపీ రాజకీయం

రాష్ట్రంలో, జిల్లాలో ఈఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను ఆదుకోవాల్సిన సమయంలో బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం పర్యటనలు చేస్తున్నారని మంత్రి నాగేంద్ర ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి కరువు సాయం తీసుకోరావాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. మాజీ సీఎం యడియూరప్ప తదితర నాయకులు కరువు ప్రాంతాల పర్యటన పేరుతో రాజకీయం చేస్తున్నారని జనం గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన 25 మంది ఎంపీలున్నా కేంద్రం నుంచి ఎలాంటి నిధులు తీసుకు రావడం లేదని మండిపడ్డారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోవట్లేదు

రాయచూరు రూరల్: పంటలు ఎండుతున్నా పట్టించుకొనేవారు కరువయ్యారని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. జిల్లాలో గురువారం సింధనూరు, మస్కి తాలూకాల్లో, శుక్రవారం మాన్వి, సిరవార, రాయచూరు తాలూకాల్లో హుబ్లీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ నేతృత్వంలో బీజేపీ నేతలు పర్యటించారు. 12 గంటల ఉచిత విద్యుత్ 4 గంటలుగా మారిందని రాష్ట్ర సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, ప్రతాప్‌గౌడ పాటిల్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమానంద యాదవ్ తదితరులున్నారు.

ఆగని అన్నదాతల ఆందోళనలు



నగరంలోని రోడ్డులో బైఠాయించిన రైతులు



ర్యాలీగా వస్తున్న రైతు సంఘం నేతలు

- పలు రోడ్లలో రాస్తారోకోలు, బైఠాయింపులు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీకి నవంబర్ 30వ తేదీ వరకు నీటిని సరఫరా చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన, తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. బళ్లారి బంద్‌కు పిలుపునివ్వడంతో ఆయా రహదారులను దిగ్బంధించారు. ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు, ద్విచక్ర వాహనాలు, కాలి నడకన వివిధ ప్రాంతాల నుంచి రైతులు బళ్లారికి చేరుకొని రాయల్ సర్కిల్, మోతీ సర్కిల్, బెంగళూరు రోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వేలాది మంది చేరుకొని బైఠాయించి ఆందోళనకు దిగారు. పంటలు పూర్తిగా చేతికి అందేవరకు నీటిని అందించకపోతే ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. జిందాల్ తదితర ప్రముఖ ఫ్యాక్టరీలకు అక్రమంగా నీటిని అందించడం నిలిపివేసి రైతుల పంటలను కాపాడాలన్నారు.

నీరందించకుంటే మూల్యం తప్పదు

హెచ్ఎల్‌సీ పరిధిలో సాగు చేసిన పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు నీటిని అందించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హసిరుసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి కరూరు హెచ్చరించారు. రైతుల పంటలు దక్కకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రైతుల మేలు కోసం పంటలకు నీటిని సరఫరా చేయాలన్నారు. ఈవిషయంపై జిల్లా మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. హెచ్ఎల్‌సీ పరిధిలో ఒక లక్ష ఎకరాల్లో వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, మిర్చి ఈ పంటలు సాగు చేయడానికి ఒక్కో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారని గుర్తు చేశారు. తుంగభద్ర డ్యాంలో తగినంత నీరు కూడా ఉందని, ఫ్యాక్టరీలకు నీటిని వదలడం నిలిపివేసి రైతుల పంటలను కాపాడాలని ఒత్తిడి చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నేత, సీనియర్ న్యాయవాది మల్లికార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో విద్యార్థులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కంప్లి: హరపనహళ్లి ఎస్ఆర్ఎంపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగిన తేనెటీగల దాడిలో గాయపడిన ఆరుగురు పారా మెడికల్ విద్యార్థులు అనివార్య పరిస్థితిలో కర్ణాటక నర్సింగ్ మండలి పరీక్షకు గైర్హాజరయ్యారు. నర్సింగ్ కాలేజీ కొట్రేష్, వికాస్, మంజునాథ్, వరమహాలక్ష్మి, ప్రతిభ, అర్పియాలను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.


విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

బనశంకరి: రాష్ట్రంలో వివిధ సమాచార సాంకేతిక సంస్థలతో వంద ఇంజినీరింగ్ కాలేజీల్లోని విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తామని ఐటీ బీటీ శాఖమంత్రి ప్రియాంక్‌ఖర్గే తెలిపారు. శుక్రవారం వైద్యవిద్య, వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్‌తో నిర్వహించిన సమాచార సాంకేతిక వృత్తి నైపుణ్య సలహా సమితి సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. యానిమేషన్, గేమింగ్, రోబోట్స్, ఆటోమేషన్, డ్రోన్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉండగా అలాంటి వాటిలో యువతీ యువకులకు వృత్తి నైపుణ్యశిక్షణ అందించే కార్యక్రమం చేపడతామని తెలిపారు.

కుమార్తె ప్రేమ వివాహం..

- తల్లిదండ్రుల అదృశ్యం

మైసూరు: కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర ఆవేదనకు లోనైన తల్లిదండ్రులు కనిపించకుండా పోయిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా కూగలూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిన్నప్పాజీ (48), భార్య భవాని (40) ఇద్దరు అదృశ్యమయ్యారు. వీరి కుమార్తె అదే గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించింది. కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. తల్లిదండ్రుల మాటలను కుమార్తె లెక్క చేయకుండా ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తల్లి భవాని మొదట అదృశ్యమయ్యారు. భార్య కనిపించకపోవడంతో చిన్నప్పాజీ కూడా ఈనెల 4 నుంచి కనిపించకుండా పోయారు. దీంతో వీరి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





శుక్రవారం చిక్కమగళూరు జిల్లా శృంగేరి శంకర హిల్స్‌లో జగద్గురు ఆది శంకరాచార్యుల బృహత్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు చేస్తున్న భారతి తీర్థస్వామి, విదుశేఖర భారతీ స్వామి.

రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి



నక్కలపల్లి గ్రామంలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న జేడీఎస్ నాయకులు

గౌరిబిదనూరు: కరువు మండలాల్లోని రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని శాసనసభ మాజీ ఉపాధ్యక్షుడు, చింతామణి మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ నేత జేకే కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన జేడీఎస్ కరవు పరిశీలన బృందంతో కలిసి తాలూకాలోని నక్కలపల్లి, గొట్లగుంటలో పర్యటించారు. తేమ లేక నిట్ట నిలువునా ఎండిన రాగి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, కందిపంటలను పరిశీలించారు. జేకే కృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.4500 కోట్ల పరిహారం అందించాలని గతంలో కేంద్రం నుంచి వచ్చిన కరువు అధ్యయన బృందం నివేదికలు ఇచ్చిందని, అయితే కేంద్రం కేవలం రూ. 300 కోట్లు విడుదల చేసిందన్నారు. నివేదికలను ప్రధానమంత్రికి పంపి నష్టపరిహారం విడుదలకు జేడీఎస్ ప్రయత్నం చేస్తుందన్నారు. జెడీ్స మాజీ అధ్యక్షుడు నరసింహమూర్తి, తాలూకా అధ్యక్షుడు మంజునాథరెడ్డి, నారాయణగౌడ, మునేగౌడ, భాస్కర్, నటరాజు, రైల్వే బేగ్, సోమశేఖరగౌడ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రోడ్డు మరమ్మతులకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: బేతమంగల రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ నమ్మ కోలారు రైతు సంఘం కార్యకర్తలు శుక్రవారం నగరంలోని పీడబ్ల్యూడీ ఇంజినీర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ బేతమంగల టమక పారిశ్రామిక ప్రాంగణం నుంచి నడుపల్లి గేట్ వరకు పడిన పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. వర్షం వస్తే గుంతల్లో నీళ్లు నిలిచి ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు ప్రమాదాల బారిన పడి గాయపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. రాత్రి వేళల్లో వాహనాల్లో ప్రయాణించడం కష్టకరంగా పరిణమించిందన్నారు. రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దుమ్ము, ధూళి చేరి పంటలు దెబ్బ తింటున్నాయన్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. లేని పక్షంలో తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణేగౌడ, సంచాలకుడు అబ్బణి మునేగౌడ, కెంబోడి రవి, కార్యాధ్యక్షుడు కామధేనహళ్లి వెంకటాచలపతి పాల్గొన్నారు.

అగస్త్య ఫౌండేషన్ సేవలు భేష్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం సులభంగా అర్థమయ్యేలా అగస్త్య ఫౌండేషన్ సంస్థ చేస్తున్న ప్రయత్నాలు భేష్ అని బీఈఓ కన్నయ్య తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అగస్త్య అంతర్జాతీయ ప్రతిష్టాన ద్వారా పాఠశాలల్లో విజ్ఞానాన్ని ప్రాయోగాత్మకంగా నేర్పించే ప్రయత్నం చేస్తుండడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ప్రశ్నించే, వాదించే తత్వాన్ని సంస్థ ఇస్తోందన్నారు. ప్రతిష్టాన జనరల్ మేనేజర్ ఎఆర్ నాగేష్, హరీష్ తదితరులతో పాటు క్విజ్ పోటీల్లో 50 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టపరిజ్ఞానం అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: చట్టాల గురించి సామాన్య పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని జడ్జి సునీల్ హొసమని తెలిపారు. శుక్రవారం అరాభికొత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ న్యాయ సేవల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా చట్టాలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయ సేవలను అందించడమే న్యాయ సేవల ప్రాధికార ఉద్దేశమన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం మౌలిక హక్కులు, కర్తవ్యాలను ఇచ్చిందన్నారు. జాతీయ న్యాయ సేవల ప్రాధికార చట్టం 1987 నవంబర్‌లో అమలులోకి వచ్చిందన్నారు. మనిషి పుట్టుక నుంచి మొదలుకుని మరణం వరకు చట్టాలు వర్తిస్తాయన్నారు. చట్టాలను గౌరవించే వారికి చట్టాలు రక్షణ కల్పిస్తాయన్నారు. సమాజంలో ఎక్కడైనా బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే 1098కి సమాచారం అందించాలన్నారు. మాదకవస్తువుల వినియోగం వంటి దురలవాట్లకు బానిస కావద్దని విద్యార్థులకు హితవు పలికారు. సీనియర్ జడ్జి కెఆర్ ధన్‌రాజ్, ఉపాధ్యాయులు ఎంఆర్ గోపాలకృష్ణ, శ్వేత, సుగుణ, కె లీల, శ్రీనివాసులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

17 మంది జూదరుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు



పోలీసులు సీజ్ చేసిన కార్లు

- భారీగా నగదు, సెల్‌ఫోన్లు, కార్లు స్వాధీనం

కోలారు: తాలూకాలోని శెట్టికుంటె గ్రామంలో విజయకుమార్ అనే వ్యక్తి పొలంలో జూదం ఆడుతున్న 17 మందిని అరెస్టు చేసిన రూరల్ పోలీసులు వారి వద్ద నుంచి రూ.20.58 లక్షల నగదు, 23 మొబైల్ ఫోన్లు, 11 కార్లను స్వాధీనం చేసుకున్నారు. అందర్ బాహర్ జూదం ఆడుతున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు దాడి చేయగా, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని అడ్డగించి పట్టుకున్నారు. ఈ ఘటనపై రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

నందిని పాల ఉత్పత్తులనే వాడాలి



పార్లర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: రైతుల జీవనాడి అయిన నందిని పాల ఉత్పత్తులను వినియోగించడం ద్వారా రైతులను ప్రోత్సహించాలని కోచిముల్ డైరెక్టర్ జయసింహ కృష్ణప్ప తెలిపారు. శుక్రవారం తాలూకాలోని అండర్సన్‌పేటలో 11వ నందిని ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. నందిని సంస్థ నాణ్యమైన పాల ఉత్పత్తులను అందిస్తోందన్నారు. నందిని ఉత్పత్తులను ఉపయోగించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. నగరంలోని 35 వార్డుల్లోను ప్రతి నిత్యం 5 వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నారన్నారు. నందిని ఆరోగ్యకరమైన పాలను అందిస్తుండడంతో వినియోగదారులు ఎంతో విశ్వాసంతో కొంటున్నారన్నారు. దేశంలో అమూల్ తర్వాత రెండో అతి పెద్ద పాల మార్కెట్‌ను నందిని కలిగి ఉందన్నారు. నగరసభ సభ్యుడు జర్మన్, శాంతివల్లల్ మునిస్వామి, అన్బు, మార్కెట్ మేనేజర్ చేతన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైకిల్‌పై ధర్మస్థలకు ఎమ్మెల్యే



ధర్మస్థలలో సైకిల్‌పై సురేశ్‌కుమార్

యశవంతపుర: మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ బెంగళూరు నుంచి సైకిల్‌పై ధర్మస్థల చేరుకున్నారు. రాజాజీనగరకు చెందిన పెడల్ పవర్ బృందంతో కలిసి ఆయన బెంగళూరు నుంచి ధర్మస్థలకు సైకిల్ యాత్ర చేశారు. 2014లోను సురేశ్‌కుమార్ తన స్నేహితులతో కలిసి 8 రోజుల పాటు ధర్మస్థలకు పాదయాత్ర చేశారు. ఇందుకు సంబంధించి సురేశ్‌కుమార్ శుక్రవారం ఫొటోలను సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేశారు. బుధవారం సైకిల్‌పై బెంగళూరులో బయలుదేరి శుక్రవారం ధర్మస్థలకు చేరుకున్నట్లు సందేశం పెట్టారు. శిరాడిఘాట్ మార్గంలో మా ప్రయాణం మరిచిపోలేమన్నారు.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు



బాధితురాలు నరసమ్మ, కూలిన పైకప్పు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల భారీ వృక్షాలు నేలకూలి, పలు ప్రాంతాల్లో ఇళ్లు కుప్పకూలాయి. పంటలు నీటమునిగాయి. పట్టణ పరిధిలోని మూడవ వార్డు ముత్సంద్ర అంబేడ్కర్ నగర్‌లో నివసిస్తున్న నరసమ్మ అనే వృద్ధురాలికి చెందిన ఇల్లు పైకప్పు కుప్పకూలింది. అయితే ఇంట్లో ఉన్నప్పటికీ నరసమ్మ తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకుంది. ఒంటరి జీవనం సాగిస్తున్న నరసమ్మ ఇల్లు కోల్పోయి వీధిలో నివసిస్తోంది. వృద్ధురాలిని నగరసభ ఆదుకోవాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

రిటైర్‌మెంట్ సొంత నిర్ణయం, ఎవరి ఒత్తిడి లేదు

- సదానందగౌడ

శివాజీనగర: తన రాజకీయ రిటైర్‌మెంట్ సొంత నిర్ణయమని, ఎవరి ఒత్తిళ్లు లేవని ఎంపీ, కేంద్రమాజీ మంత్రి డీవీ సదానందగౌడ స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని సంజయ్ నగరలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడిన ఆయన ...తాను ఆంజనేయస్వామి తరహాలో రొమ్ము చీల్చి చూపించేందుకు సాధ్యం కాదని, అలాగే ఎవ్వరి వద్ద చర్చించలేదన్నారు. తాను రిటైర్ అవుతానని 2019లోనే వెల్లడించినట్లు చెప్పారు. తన రిటైర్‌మెంట్‌కు పార్టీ అధిష్టానానికి సంబంధం లేదన్నారు. మాజీ సీఎం యడియూరప్ప తారతమ్యంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు.

నాటకాలతో సామాజిక చైతన్యం

గౌరిబిదనూరు: నాటకాలతో సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌హెచ్ శివశంకరరెడ్డి అన్నారు. పరివర్తనా ప్రతిష్ఠానం, కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ హెచ్‌ఎస్ కళాభవనంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన నాటకోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో సామాన్యులకు వినోదాన్ని పంచిన నాటక రంగం అవసాన దశలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నాటకాలపై ఆసక్తి పెంచుకొని ఆ రంగానికి జీవం పోసి భావితరాలుక అందజేయాలన్నారు. అనంతరం నాగలాంబిక, శ్రీ కృష్ణ సంధాన, సోరుతిహాదు సంబంధ నాటకాలను ప్రదర్శించారు. డాక్టర్ కేవీ ప్రకాశ్, సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు వీరయ్య, హెచ్‌ఎల్ వెంకటేశ్, కేవీ నాయక్, విశ్వనాథ బండారి పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాజీ మంత్రి సమావేశం



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం దొడ్డనెకుంది వార్డులో ఉన్న సరోవర్ పోర్టికోలో శుక్రవారం దొడ్డనెకుంది వార్డు బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు అరవింద లింబావళి పాల్గొని సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పాదచారి దుర్మరణం

బనశంకరి: ఐచర్ వాహనం ఢీకొని పాదచారి మృతి చెందిన ఘటన బెంగళూరు–హోసూరు జాతీయ రహదారిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఒడిస్సాకు చెందిన నిరంజన్ మృతి చెందాడు. బెంగళూరు శివారులోని అనేకల్ తాలూకాలో పాత చందాపుర వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. నిరంజన్ చందాపురలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం నిరంజన్ నడుచుకుంటూ వస్తుండగా ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొడగు కొండల్లో నీలకురింజి అందాలు

- పుష్కరానికి ఒక్కసారి పూచే పుష్పాలు
- దక్షిణ కాశ్మీరంలో అరుదైన ప్రకృతి సోయగం







పశ్చిమ కనుమల్లోని షోలా అడవుల్లో వికసించిన నీల్‌కురింజి పుష్పాలు, ఈ అందాలు చూడాలంటే మరో పుష్కరం వేచి చూడాల్సిందే

బనశంకరి: ప్రకృతి అందాలను ఎన్నిసార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. ప్రశాంతంగా ఉండే ప్రకృతిని ఎవరిమనస్సైనా పులకిస్తుంది. చుట్టూకొండలు, పచ్చనిగడ్డి, పరవశించే పైరగాలి, ఆదమరపించే చెట్లు. అందమైన పుష్పాలు చేతితో తాకేలా అనిపించే మేఘాలు ఇలా ఊహించుకుంటేనే మనసు గాలిలో తేలిపోతుంది. మండల పట్టి కోటేబెట్టెకొండలు 12 ఏళ్లకు ఒకసారి మాత్రమే పూసే నీలకురింజి మొక్క ఊదా రంగుతో పర్యాటకులు కర్ణాటకలోని కొడగు జిల్లాకు ఈ అరుదైన ప్రకృతిసోయగాన్ని వీక్షించడానికి వెళతారు. పశ్చిమ కనుమలపై గల మండల్‌పట్టి కొండలు, దాని సుందరమైన అందాలకు ప్రసిద్దిచెందాయి. ఇప్పుడు నీలకురింజి లేదా స్ట్రోబిలాంథెస్ కుంతియానాను చూడటానికి కర్ణాటక నలుమూలలనుంచి పర్యాటకులతో సందడిగా మారింది. కొడగు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పూలు సాధారణంగా ఉండేవి. గత కొన్ని దశాబ్దాలుగా చాలా అరుదుగా కనిపించేది. నీలకురింజి పువ్వులు కర్ణాటక, కేరళ, తమిళనాడులోని పశ్చిమ కనుమల్లో షోలా అడవుల్లో కనిపించే పొదకు చెందినవి దక్షిణ భారతదేశంలోని ప్రధాన పర్యాటక ఆకర్షణల్లో ఒకటిగా నిలిచింది. నీలకురింజి పుష్పాలు 1,300, నుంచి 2,400 మీటర్ల ఎత్తులో పెరుగుతాయి. పొదలు 30–60 సెంటీమీటర్ల ఎత్తువరకు పెరుగుతుండగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా 180 సెంటీమీటర్ల వరకు ఉంటాయి. నీలకురింజి పుష్పాలు పరాగసంపర్కానికి ఇంత సుదీర్ఘకాలం అవసరం కాబట్టి పూలు వికసించడానికి 12 ఏళ్లు పడుతుంది. వృక్షశాస్త్రంలో దీనిని మొక్కల సర్వైకల్ మెకానిజంగా సూచిస్తారు. ప్రతి 12 ఏళ్లకు ఆగస్టు–అక్టోబరు నెలలో నీలకురింజి పుష్పాలు వికసిస్తాయి. పుష్పించే కాలం సుమారు మూడునెలల వరకు ఉంటుంది. గత ఏడాది 2022 ఆగస్టు–సెప్టెంబరు నెలలో నీలకురింజి పుష్పాలు పశ్చిమ కనుమల్లోని షోలా అడవుల్లో వికసించి ప్రకృతి ప్రేమికులను పరవశింపచేశాయి. 12 ఏళ్లకు ఒకసారి వికసించే నీలకురింజి పుష్పాలు వీక్షించడానికి పర్యాటకులు భారీ ఎత్తున తరలివచ్చి వీక్షిస్తారు. తదుపరి నీలకురింజి పుష్పించేది 2030 ఆగస్టు లేదా అక్టోబరు నెలలో మాత్రమే. అప్పటి వరకు ప్రకృతి ప్రేమికులు వేచి చూడాల్సిందే.

కరువు పరిశీలన సమయంలో ఫైటింగ్



కొట్టుకుంటున్న బీజేపీ నాయకులు

దొడ్డబళ్లాపురం: రామనగరలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన కరువు పరిశీలన సమయంలో స్థానిక బీజేపీ నాయకులు పరస్పరం కొట్టుకున్న సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కోటా శ్రీనివాసపూజారి ఆధ్వర్యంలో గురువారం రామనగర జిల్లాలో కరువు పరిశీలన చేపట్టారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ దేవేగౌడ, చెన్నపట్టణ బీజేపీ తాలూకా అధ్యక్షుడు జయరాం మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకుంది. కరువు పరిశీలన, రైతులతో భేటీ ముగిసాక సాయంత్రం బీజేపీ నాయకులు స్థానిక బీజేపీ నేత ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో త్వరలో రానున్న పట్టభద్రుల ఎన్నిలకు సంబంధించి దేవేగౌడ, జయరాం మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇద్దరూ కొట్టుకున్నారు. ఇద్దరినీ పార్టీ నాయకులు అతికష్టం మీద శాంతింపజేసారు. ఈ సందర్భంగా మాట్లాడిన చెన్నపట్టణ తాలూకా బీజేపీ అధ్యక్షుడు జయరాం, దేవేగౌడ ఎమ్మెల్సీగా ఎన్నికవడానికి తన కృషి ఎంతో ఉందన్నారు. 30 ఏళ్లుగా పార్టీ కోసం పాటుబడుతున్నానన్నారు. అలాంటిది తనమీద చేయిచేసుకున్నాడని ఇందుకు సంబంధించి పార్టీ హైకమండ్‌కు ఫిర్యాదు చేస్తానని మీడియాకు తెలిపారు.

మండ్యలో జనతా దర్శన్

మండ్య: మండ్య తాలూకా హోళలు గ్రామంలో జనతా దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. మేలుకెటి ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు పంటలకు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో చర్చించి అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మెగాస్టార్‌ను కలిసిన ఎమ్మెల్యే



ప్రదీప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిరంజీవి

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ గురువారం హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవిని ఆయన స్వగృహంలో కలిశారు. తెలంగాణాలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ వెళ్లిన ప్రదీప్ ఈశ్వర్ మర్యాదపూర్వకంగా చిరంజీవిని కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవి ప్రదీప్ ఈశ్వర్‌ను సన్మానించారు. అనంతరం ఇద్దరు కలిసి భోజనం చేశారు.

రాఘవేంద్రమఠంలో సంస్థాన పూజ

బనశంకరి: మంత్రాలయ సుబుదేంద్రతీర్థ స్వామీజీ అమృతహస్తాలతో జయనగర ఐదోబ్లాక్‌లోని శ్రీ గురురాఘవేంద్రస్వామి సన్నిధిలో శుక్రవారం శ్రీమాన్ మూల రామ చంద్ర దేవుడి సంస్థాన పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ గురురాఘవేంద్రస్వామి బృందావనానికి మహామంగళ హారతి, సువర్ణ పాదానికి పాదపూజ చేశారని నందకిశోర్ ఆచార్య తెలిపారు. మఠం వ్యవస్థాపకులు ఆర్‌కే.వాదీంద్రాచార్య, భక్తులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం అభిషేకం, అర్చనలు చేపట్టిన ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ నేతృత్వంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు అలంకరణ, విశేషపూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

ఎస్‌జీఎఫ్‌ఐకి ఎంపిక



ప్రేరణాయాదవ్

దొడ్డబళ్లాపురం: హ్యాండ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన దొడ్డ పట్టణ నివాసి ప్రేరణా యాదవ్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఎంపికయ్యారు. దొడ్డబళ్లాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బీఎస్ చంద్రశేఖర్ కుమార్తె ప్రేరణా యాదవ్ యలహంక సీఆర్‌పీఎఫ్ సెంట్రల్ స్కూల్లో చదువుతోంది. ఢిల్లీలో 2023–24లో 17 ఏళ్లలోపు బాలికల విభాగంలో 52వ కేవీ నేషనల్ మరియు రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ప్రేరణా యాదవ్ హ్యాండ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో ఎస్‌జీఎఫ్‌ఐకి ఎంపిక చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన 17 ఏళ్ల లోపు బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు.

సీబీఐకి అప్పగించాలి

యశవంతపుర: నకిలీ ఆధార్ కార్డులను తయారు చేస్తున్న ముఠాను అరెస్ట్ చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైనట్లు బీజేపీ ఆరోపించింది. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీ బీజేపీ ఆధార్ ప్రాధికార ముఖ్యస్థుడికి ఫిర్యాదు చేశారు. రేస్‌కోర్స్ రోడ్డులోని ఖనిజ భవనంలోని ప్రాధికార కార్యాలయంలో ఎమ్మెల్సీ కెఎస్ నవీన్‌కుమార్ నేతృత్వంలో బీజేపీ బృందం ఆధార్‌కార్డ్ అక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని ఫిర్యాదులో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధార్ అక్రమాలను నియంత్రించటంలో విఫలమైనట్లు బీజేపీ నాయకులు ఆరోపించారు. విదేశీ వ్యక్తుల చేతివాటం ఉన్న కారణంగా కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఆధార్ కార్డు అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చాలా చిన్నదిగా తీసుకున్నట్లు బీజేపీ నాయకుడు భాస్కర్‌రావ్ ఆరోపించారు.

హిట్ అండ్ రన్..ఒకరు మృతి



మృతి చెందిన ఖదీర్

దొడ్డబళ్లాపురం: హిట్ అండ్ రన్‌కు ఒకరు బలైన సంఘటన దొడ్డ తాలూకా ముత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. ముత్తూరు నివాసి ఖదీర్ బాషా (26) మృతి చెందిన వ్యక్తి. ఖదీర్ బాషా రైల్వేస్టేషన్‌లో మూటలు మోస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ముత్తూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఖదీర్ బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. దొడ్డ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శవాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా

గురువారం రాత్రి హిట్ అండ్ రన్‌కు ముత్తూరుకు చెందిన ఖాదిర్ బాషా అనే వ్యక్తి మృతిచెందిన సంఘటనపై ఆగ్రహించిన మృతుడి బంధువులు శవాన్ని రోడ్డుపై ఉంచి ధర్నా చేపట్టారు. టోల్ కంపెనీ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగి అమాయకుడు బలయ్యాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు, గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం శవాన్ని రహదారిపై ఉంచి ధర్నా చేసారు. మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని డిమాండు చేసారు. ధర్నా కారణంగా రహదారిపై కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం పోలీసులు కలుగజేసుకుని ధర్నా విరమింపజేసారు.

ఫిట్‌నెస్ సెంటర్ కోచ్ అరెస్ట్

కృష్ణరాజపురం: మహిళలు స్నానాలు చేస్తుండగా వీడియోలు తీసిన ఫిట్‌నెస్ సెంటర్ కోచ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణరాజపురంలోని రామూర్తి నగర్‌లో కల్ట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో మహిళా టెక్కీలు జిమ్ చేసేందుకు వస్తుంటారు. ఈక్రమంలో ఆదివారం జిమ్‌కు వచ్చిన ఒక మహిళా టెక్కీ స్విమ్మింగ్ చేసిన అనంతరం స్నానం చేస్తుండగా జిమ్ కోచ్‌గా ఉన్న సిబిచాన్ అనే వ్యక్తి ఆ దృశ్యాలను మొబైల్‌లో చిత్రీకరించాడు. ఆమె అనుమానంతో జిమ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసింది. సీసీకెమెరా ఫుటేజీను పరిశీలించగా స్నానపు గదుల వద్ద జిమ్ కోచ్ తచ్చాడినట్లు తేలింది. దీంతో బాధితురాలు బాణసవాడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని సిబిచాన్‌ను అరెస్ట్ చేశారు.

విశ్వేశ్వరయ్య విగ్రహం ఆవిష్కరణ



బొమ్మనహళ్లి : బీటీఎం లేఔట్ వార్డు 176లో ఉన్న కువెంపు ఉద్యానవనంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మంత్రి రామలింగారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలో అనేక వంతెనలు, జలాశయాలు ఆయన ఆధ్వర్యంలో నిర్మించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జీఎస్ ఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో 30 వాహనాలు ధ్వంసం

- అల్లరిమూకల దుశ్చర్య

బనశంకరి: మద్యం మత్తులో అల్లరిమూకలు మరణాయుధాలతో వాహనాలను ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున లగ్గెరెలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ముఖానికి మాస్కులు ధరించి సుమారు 30కి పైగా వాహనాలను ధ్వంసం చేశారు. 12 కార్లు, ఆటో, నాలుగు టెంపోలు ఇలా మూడు రోడ్లలో 30కి పైగా వాహనాలపై దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనపై ఆర్‌ఆర్.నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు శంకర్‌నాగ్ అవార్డు



అవార్డులు అందుకున్న ఆటో డ్రైవర్లు

బొమ్మనహళ్లి : నగరంలోని జయనగర శాలిని క్రీడా మైదానంలో పీస్ ఆటో, టీవీఎస్ సంస్థ ఆధ్వర్యంలో దివంగత నటుడు శంకర్‌నాగ్ జయంతి వేడుకల సందర్భంగా ఆటో రిక్షా దినోత్సవాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు సతీశ్, కన్నడ ప్రముఖ నిర్మాత, కాంగ్రెస్ నాయకుడు ఉమాపతి శ్రీనివాసగౌడ, పీఎస్‌ఆటో సంస్థ అధ్యక్షుడు అనిల్‌శెట్టి పాల్గొని ఆటో డ్రైవర్లకు శంకర్‌నాగ్ అవార్డును ప్రదానం చేసి సన్మానం చేశారు. మహిళా డ్రైవర్లను కూడా సన్మానించారు.

డైరెక్టర్‌పై వంచన కేసు

శివాజీనగర: కర్ణాటక రత్న, దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ సవారీ, పృథ్వీ, సవారీ–2, చంబల్ సినిమాలకు దర్శకత్వం వహించిన శ్యాండిల్‌వుడ్ డైరెక్టర్ జాకోబ్ వర్గీస్‌పై డాక్యుమెంటరీ కాపీరైట్ ఇవ్వకుండా బెంగళూరు స్కూల్ స్పోర్ట్ ఫౌండేషన్‌కు మోసం చేశారని కేసు నమోదైంది. బెంగళూరు స్కూల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ నుండి హెచ్‌ఐవీ పీడిత పిల్లల జీవన చర్యలపై డైరెక్టర్ జాకోబ్ వద్ద డాక్యుమెంటరీ ఫిలిమ్ చేయించారు. ఈ చిత్రీకరణ కోసం దశలవారిగా ఫౌండేషన్ నుండి సొమ్ము కూడా ఇచ్చారు. అయితే కాపీరైట్స్ సంస్థకు ఇవ్వకుండా తానే డాక్యుమెంటరీని ప్రసారం చేశారని ఆరోపణ ఉంది. అంతేకాకుండగా ఆస్కర్ అకాడమి అవార్డు విభాగంలో తానే కాపీరైట్స్ యజమాని అని సమాచారం కూడా డైరెక్టర్ జాకోబ్ వర్గీస్ ఇచ్చారు. ఆయుష్మాన్ సినిమా అవార్డు కూడా సినిమాను ఎంపిక చేయించి, కాపీరైట్స్ ఉల్లంఘించారు. దీంతో బెంగళూరు స్కూల్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కు ఆర్థికంగా నష్టం చేశారని ఆరోపిస్తూ, అశోకనగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తరగతి గదుల ప్రారంభం



బొమ్మనహళ్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదువుకుని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీగా రాణించాలని ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బొమ్మనహళ్ళి పరిధి అగర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా నిర్మించిన నూతన తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, స్థానిక నాయకులు ఎ.ఎం.నరసింహమూర్తి, తిమ్మారెడ్డి, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

వేశ్యావాటికపై పోలీసుల దాడి

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతంలో మసాజ్ సెంటర్ ముసుగులో వేశ్యావాటిక నిర్వహిస్తుండగా పోలీసులు గురువారం రాత్రి దాడులు జరిపారు. ఇద్దరు మహిళలతోపాటు భూదిపట్టి గ్రామానికి చెందిన పొణ్ణుస్వామి(46) అనే నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. రెండు మసాజ్ సెంటర్లను సీజ్ చేశారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కెలమంగలం: రాయకోట నుంచి కర్ణాటక రాష్ట్రం అత్తిపల్లి వరకు ఏర్పాటవుతున్న నాలుగురోడ్ల నిర్మాణ పనులను రహదార్ల శాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితిలో నాగమంగలం వద్ద నిర్వహిస్తున్న టాటా ఎల్రక్టానిక్ పరిశ్రమ నుంచి తమిళనాడు సరిహద్దు వరకు నాలుగు రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇరుదాళం నుంచి కుందుమారనపల్లి వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను, అడ్డంగా ఏర్పాటు చేస్తున్న వంతెనల నాణ్యత, నిర్మాణ పనుల నాణ్యతపై రహదార్ల శాఖాధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీర్ పన్నీర్‌సెల్వం, అధికారులు శరవణన్, తిరుమాళ్‌సెల్వన్, మణ్ణార్‌మణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

హోసూరు: ప్రేమ విఫలమై కార్మికుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు సమీపంలోని బెళ్తూరు గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి (23) కూలీ కార్మికుడిగా ఉన్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిపై మనసు పారేసుకున్నాడు. అతని ప్రేమను ఆమె అంగీకరించలేదు. దీంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. బాగలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పై వంతెన పనులు చకచకా



పై వంతెన పనులు జరుగుతున్న దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జూజువాడి పారిశ్రామిక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన పై వంతెన పనులు జోరుగా సాగుతున్నాయి. తమిళనాడు కర్ణాటక సరిహద్దు జూజువాడి ప్రాంతంలో ఏర్పాటైన మొదటి పారిశ్రామిక వాడ ప్రాంతంలో చిన్న సన్నకారు పరిశ్రమలతో పాటు పెద్ద తరహా పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమలకు రోజూ వేలాది మంది కార్మికులు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. పారిశ్రామికవాడకు వెళ్లేందుకు జాతీయ రహదారిని క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంటుంది. హోసూరు నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలకు, బెంగళూరు నుంచి హోసూరు వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండేది. ఈ ప్రాంతంలో పై వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేయడంతో జాతీయ రహదార్ల శాఖ పైవంతెన నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

నదిలో మహిళ మృతదేహం

మైసూరు : కపిలా నదిలో మహిళ మృతదేహం వెలుగు చూసింది. వివరాలు... మైసూరు నగరంలోని సుభాష్ నగరకు చెందిన మంజునాథ్ భార్య మంజుల(50) ఈ నెల 7వ తేదిన నంజనగూడులోని నంజుండేశ్వర స్వామి ఆలయానికి వెళ్తానని చెప్పి ఇంటినుంచి బయల్దేరింది. అక్కడకు వెళ్లిన తర్వాత ఏం జరిగిందో ఏమో కాని శుక్రవారం కపిలా నదిలో శవమై తేలింది. పోలీసులు మృతురాలి ఆచూకీ గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సదరు మహిళ కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు అంటున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

మైసూరు : వేగంగా వెళుతున్న బైకు అదుపు తప్పి పల్టీకొట్టి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మైసూరు నగరంలో యాదవగిరి సమీపంలో జరిగింది. మృతులను మైసూరు నగరంలోని గోకులం ప్రాంతానికి చెందిన సిద్ధరాజు(20), నిరంజన్(20)గా గుర్తించారు. ఘటనలో మరో వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. వివిపురం ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటోపై కుప్పకూలిన చెట్టు

దొడ్డబళ్లాపురం: వెళ్తున్న ఆటోపై చెట్టు ఒకటి విరిగిపడ్డ సంఘటన దొడ్డ పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ శివారులోని పిండకూరు తిమ్మనహళ్లికి చెందిన అఖిలేశ్ (27) పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుండి డీక్రాస్ వైపు వెళ్తుండగా మార్గం మధ్యలో బెస్కాంకు చెందిన కాంపౌండ్ లోపల ఉన్న భారీ చెట్టు ఒకటి ఆటోపై విరిగిపడింది. దీంతో ఆటో ముందు భాగం అద్దాలు పగిలిపోయి ధ్వంసమైంది. ప్రమాదాన్ని గ్రహించిన ఆటో డ్రైవర్ అఖిలేష్ బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి చెట్టును క్రేన్‌ల సాయంతో తొలగించేశారు.

విషప్రయోగం.. మూడు ఆవుల మృతి

దొడ్డబళ్లాపురం: ఆవులపై విష ప్రయోగం చేయడంతో మూడు ఆవులు మృతి చెందిన సంఘటన రామనగర తాలూకా మేగలదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామం నివాసి గౌరమ్మకు చెందిన మూడు పాడి ఆవులు గురువారం రాత్రి హఠాత్తుగా ఉన్నచోటే కుప్పకూలి ప్రాణాలు వదిలాయి. రోజంతా ఆరోగ్యంగా తిరిగిన ఆవులు హఠాత్తుగా మరణించడం, గతంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకపోవడంతో విష ప్రయోగం జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పశుశాఖ అధికారులు మృతి చెందిన ఆవులను పరీక్షించారు. అధికారులు కూడా ఇదే అనుమానం వ్యక్తం చేసారు.

టపాసులు పేల్చడంపై చిన్నారులకు చైతన్యం

హోసూరు: దీపావళి పండుగను పురస్కరించుకొని పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పాటించవలసిన మెలకువలపై కాడులక్కసంద్రం ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ చైతన్యం కల్పించారు. పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రధానంగా గడ్డివాములు, ప్లాస్టిక్ గోడన్‌లు తదితర చోట్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకొనే ప్రాంతాల్లో టపాకాయలు పేల్చరాదని, అదే విధంగా పర్యావరణానికి హాని కల్పించే టపాసులను పేల్చరాదని, దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

హోసూరు: తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణగిరి ఆహార భద్రతాశాఖ అధికారి చిన్నస్వామి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు దురైమురుగన్, సూర్య తదితరులు సూళగిరి సమీపంలోని నెరిగం వద్ద గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలో వచ్చిన లారీని అడ్డగించి తనిఖీ చేయగా బియ్యం అక్రమ రవాణా వెలుగుచూసింది. దీంతో బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకొని సలీమ్ అనే డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. రాయకోట ప్రాంతంలో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలిసింది.

బస్సులకు పూజలు



కెలమంగలం: డెంకణీకోట తాలూకా శాలివారం గ్రామంలో ఆర్టీసీ బస్సులకు గ్రామప్రజలు పూజలు నిర్వహించారు. శ్యాలివారం చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు పట్టణాలకు వచ్చి వెళ్లుతుంటారు. వీరిని సురక్షితంగా తరలించే ఆర్టీసీ బస్సులకు తమిళనాడు ఆర్టీసీ బస్సులు, ఓ కర్ణాటక ఆర్టీసీ బస్సు రోజూ ప్రయాణికులను సురక్షితంగా తరలిస్తుంది. ఈ బస్సులకు గ్రామస్తులు ఆయుధ పూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా...

15న బంగాళాఖాతంలో అల్పపీడనం



- 14 నుంచి రాష్ట్రంలో వర్షాలకు ఆస్కారం

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 15న అల్పపీడనం ఏర్పడనుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా అది వాయుగుండంగా బలపడే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. మరోవైపు 14వ తేదీ నుంచి ఈశాన్య, తూర్పు గాలులు బలోపేతం కానున్నాయి. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి వర్షాలు, రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇంతలో 15న అల్పపీడనం ఏర్పడడం, ఈశాన్య, తూర్పు గాలులు తోడవడం వంటి కారణంతో వర్షాలకు ఆస్కారం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణమే నెలకొంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది.

త్వరలో ప్రతి ఇంటికీ ఉచిత ఇంటర్‌నెట్

- ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: త్వరలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఉచితంగా ఇంటర్‌నెట్ అందిస్తామని ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామం చివరి ఇంటి వరకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షకు అనుగుణంగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రూ.190లకే ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చి ఉచితంగా సెట్‌టాప్ బాక్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌నెట్, కేబుల్ ప్రసారాలే కాకుండా సినిమా విడుదలైన రోజే తక్కువ వ్యయంతో ఇంట్లోనే సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని, దీన్లోభాగంగా ఐదో సినిమాగా 'ఓటు' రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. రామ్‌గోపాల్ వర్మ సినిమాలు కూడా విడుదల చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, అనివార్య కారణాలతో సినిమా విడుదల ఆగిందని, సమస్య పరిష్కారం కాగానే ఆ సినిమా కూడా విడుదల చేస్తామని గౌతమ్‌రెడ్డి చెప్పారు.

షిరీన్ బేగానికి డిప్యూటీ సీఎం అభినందనలు



సాక్షి, అమరావతి: మిలీనియం ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిషనర్ షిరీన్ బేగంను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అభినందించారు. షిరీన్‌బేగం ఉపముఖ్యమంత్రిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూపు-1లో ఉద్యోగం పొందిన తొలి ముస్లిం మహిళగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు మొదటి ప్రత్యేక మహిళా అధికారిగా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్‌గా అందించిన సేవలను గుర్తిస్తూ సుమన్ ఆర్ట్స్ వారి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నందు మిలీనియం ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. ఆమె ఈ నెల 5న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

వైఎస్సార్ హెల్త్ వర్సిటీలో ముగిసిన వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: రీసెర్చ్ మెథడాలజీ, బయోస్టాటిస్టిక్స్ అంశంపై డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీలో ఏర్పాటు చేసిన 2 రోజుల వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లోని వైద్య విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులను పరిశోధనల వైపు ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఐసీఎంఆర్, ఎయిమ్స్ తదితర సంస్థలసీనియర్ పరిశోధకులు, వైద్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి, రీసెర్చ్, డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సుమితా శంకర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ వైఖరి స్పష్టం చేయాలి

- సీపీఎం నేత శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ వైఖరి స్పష్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఏపీలో టీడీపీ మిత్రపక్షమని చెప్పుకుంటున్న జనసేన తెలంగాణాలో బీజేపీతో కలిసి పోటీ చేస్తుందన్నారు. తెలంగాణాలో బీజేపీతోనూ, ఏపీలో టీడీపీతోనూ పొత్తు పెట్టుకోవడం ఏమి టని జనసేనను ప్రశ్నించారు. తెలంగాణాలో టీడీపీ పోటీ చేయడం లేదని చెబుతుంటే దాని తో ఏపీలో కలిసి జనసేన పని చేస్తున్నదని, ఇటువంటి పరిస్థితిలో తెలంగాణాలో టీడీపీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన పల్లెకు సంక్షేమ పలకరింపు!

అర్హులైన వారికి పథకాలు అందించడమే లక్ష్యం

- 15వ తేదీ నుంచి 26 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- అల్లూరి, మన్యం జిల్లాల్లోని 430 గ్రామాల్లో ప్రత్యేక వాహనాలతో ప్రచారం
- 15న విశాఖ బీచ్ రోడ్డులో జన జాతీయ గౌరవ దివస్ ర్యాలీ
- గ్రామ, ఐటీడీఏ, జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఫలాలతో పులకరిస్తున్న గిరిజన పల్లెలను మరోసారి ప్రభుత్వ యంత్రాంగం ఆత్మీయంగా పలకరించనుంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారంతో పాటు, పథకాలు అందని అర్హులు ఎవరైనా మిగిలుంటే వారికి పథకాలు అందేలా చూస్తారు. ఇందుకోసం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా రాష్ట్రంలోని గిరిజన పల్లెల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'జన జాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని 15న విశాఖ బీచ్ రోడ్డులో ర్యాలీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రారంభిస్తారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొంటారని ఏపీ గిరిజన సంక్షేమ శాఖ అడిషినల్ డైరెక్టర్ రవీంద్రబాబు తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆ రెండు జిల్లాల్లోని 430 గిరిజన గ్రామాల్లో నాలుగు ప్రత్యేక వాహనాల(ప్రభుత్వ పథకాల ప్రచార వ్యాన్)తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ), జిల్లాల స్థాయిలో స్థానిక ప్రజలు, స్వయం సహాయక సంఘాలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఏ రోజు ఏ కార్యక్రమం నిర్వహించాలనేది ప్రత్యేకంగా షెడ్యూల్‌ను ఖరారు చేశారు.

వీటిపై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించనున్నారు. గిరిజనుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇంకా అర్హత ఉన్న వాళ్లకు ఎవరికైనా రాకుంటే.. వారికి సంక్షేమ ఫలాలు అందించేలా తక్షణ చర్యలు చేపడతారు. గిరిజన జిల్లాల్లో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్, ఏకలవ్య మోడల్ స్కూల్లో విద్యార్థులను చేర్పించడం, స్కాలర్‌షిప్‌ల మంజూరు, అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాల అమలు, అర్హులకు వాటిని దరి చేర్చడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

'జన జాతీయ గౌరవ్ దివస్'ను ఘనంగా జరుపుదాం

సీఎం జగన్‌కు కేంద్ర మంత్రి లేఖ

జన జాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా జరిపేందుకు రాష్ట్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని, మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా లేఖ రాశారు. 15న జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా పార్లమెంట్ కాంప్లెక్స్‌లో భగవాన్ బిర్సా ముండా విగ్రహానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ నివాళి అర్పిస్తారని తెలిపారు. అలాగే బిర్సా ముండా జన్మస్థలం జార్ఖండ్ రాష్ట్రం ఉలిహాటు వద్ద నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొని.. దేశంలోని 75 ఆదివాసీల ప్రాబల్యం ఉన్న జిల్లాల్లో 'హమారా సంకల్ప్ వికసిత్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. మీ రాష్ట్రంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

కులవాద పార్టీలను తరిమికొడతాం

- 1,139వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని నిలువునా దోచుకుని..బహుజనులకు తీరని అన్యాయం చేసిన అవినీతి అనకొండ చంద్రబాబు అండ్‌కోకు అండగా నిలుస్తున్న కులవాద పార్టీలను తరిమికొడతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,139వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. పేదల సమస్యలను పక్కన బెట్టి అవినీతిపరుడైన బాబు కోసం నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తున్న వీరి పిచ్చి పరాకాష్టకు చేరిందనడంలో సందేహం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ సహకారంతో కులమతాలు, పార్టీలకతీతంగా బహుజనులు ఇళ్లు నిర్మించుకుంటుంటే తప్పుడు కేసులు వేయించడం మంచి పద్ధతేనా అని ప్రశ్నించారు. పేదలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు వద్దని తప్పుడు కేసులు వేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులవాదం ముసుగులో అధికారం కోసం తాపత్రయపడుతున్న వీరి అవకాశవాద రాజకీయాలకు కాలం చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏపీలో సామాజిక సాధికారత దిశగా పేదలకు అన్ని విధాలా ప్రభుత్వం న్యాయం చేస్తుందనేందుకు రాజకీయంగా, సామాజికంగా వారికి సముచిత స్థానం కల్పించడమే నిదర్శనమన్నారు. రాజధాని పేరుతో జరిగిన అరాచకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయి దృష్టి సారించి సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

చిన్నశేషునిపై బద్రీనారాయణుడు

- వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం రాత్రి చిన్నశేష వాహనంపై తిరువీధుల్లో వెన్నముద్ద చేతబట్టిన కృష్ణుడి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామునే మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో నేత్రపర్వంగా అమ్మవారికి స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం ఆస్థాన మండపంలో వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి చిన్నశేష వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబర వజ్రవైడూర్య ఆభరణాలతో అమ్మవారిని బద్రీనారాయణుడిగా అలంకరించారు. రాత్రి ఏడు గంటలకు మంగళ వాయిద్యం, భజన బృందాలు, భక్తుల కోలాటాలు, జియ్యర్ స్వాముల దివ్యప్రబంధ పారాయణం, వేదపండితుల వేదపారాయణం నడుమ అమ్మవారు చిన్నశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కాగా, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ



రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రంలో సస్యశ్యామలంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు.

శ్రీవారి సేవలో మహారాష్ట్ర సీఎం షిండే



తిరుమల ఆలయం వెలుపల మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే

తిరుమల/శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): తిరుమల శ్రీవారిని, శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి తిరుమల, శ్రీకాళహస్తి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారు, స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం తిరుమల ఆలయ రంగనాయకుల మండపం, శ్రీకాళహస్తి గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈవో సాగర్‌బాబు, అధికారులు లడ్డూప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, అధికారులు లడ్డూప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.



ఆలయం వెలుపల జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

12న బ్రేక్ దర్శనాలు రద్దు: శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం సందర్భంగా ఈ నెల 12వ తేదీన ప్రోటోకాల్ దర్శనం మినహా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ముందు రోజు 11వ తేదీన బ్రేక్ దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించడంలేదని పేర్కొంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాణసంచా దుకాణాల నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. అనుమతి లేకుండా టపాసులు నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టపాసులను ఇళ్లు, షాపులు, జన సముదాయాల మధ్య గోడౌన్‌లలో అనుమతి లేకుండా నిల్వలు చేయకూడదని స్పష్టం చేశారు. లైసెన్సు లేకుండా అనధికార విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు 44 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 60 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

హరిత దీపావళిని ప్రోత్సహిద్దాం

- సంప్రదాయానికి స్వాగతం పలుకుదాం
- పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం
- టపాసులను నియంత్రించుకుందాం
- ప్రమిదలతోనే ఇంటికి అందం

కర్నూలు కల్చరల్: అమావాస్య చీకటిని జయించి సంతోషాలను పూయించే పండగ దీపావళి. ఈనెల 13న నరక చతుర్దశి (దీపావళి) సందర్భంగా ఆనందోత్సాహాల మధ్య కాంతుల పండుగను జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. ఈక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ టపాసులను వినియోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పని సరి. ఎలాంటి అపశ్రుతి చోటుచేసుకోకుండా ప్రకృతికి మేలు చేసేలా సంతోషంగా దీపావళిని జరుపుకోవాలని కోరుతున్నారు.

ఎకో ఫ్రెండ్లీతో..

రంగులు విరజిమ్ముతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అందరినీ ఆకట్టుకునే టపాసులు లేకుండా దీపావళి పండుగ పూర్తి కాదనుకుంటారు. అలాంటి వారి కోసమే ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. కాన్ ఫెట్టీ, ఫ్లవర్ పవర్, ఫేక్ నోట్, బర్డ్స్, స్నేక్‌మిక్స్, ఫ్లవర్ పార్ట్స్, పెన్సిల్ లాంటి పేర్లతో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి మామూలు బాణ సంచాలా వాతావరణానికి పెద్దగా హాని కలిగించవు. వీటి ధ్వని పరిమిత దూరం వరకే ఉంటుంది. కాలుష్యం కలిగించని రంగురంగుల మెరుపులను వెదజల్లుతాయి. కేవలం గన్‌పౌడర్, ఫాస్పేట్‌ను మాత్రమే ఉపయోగించి ఆధునిక టెక్నాలజీతో ఈ వెరైటీ బాణ సంచాను తయారు చేస్తున్నారు.

ప్రమిదలే ముద్దు..

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి విద్యుత్తు కాంతులు వెదజల్లేలా అలంకరణ చేసుకోవడంతో పాటు వివిధ ఆకృతుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించాలి. ఒక వేళ పిల్లలు బాణా సంచా కావాలని మారాం చేస్తే వాటిని కాల్చడం వల్ల కలిగే నష్టాల్ని వివరించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలి.

టపాసుల్లో ఏముంటాయి

బాణ సంచా తయారు చేయాలంటే రసాయనాల్ని వాడాల్సిందే. కాపర్, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, సీసం, జింక్, సోడియం, అల్యూమినియం, అమ్మోనియం, పొటాషియం, సల్ఫర్, బొగ్గు వాడతారు. ఒక్కో రకం టపాసును తయారు చేసేందుకు ఒక్కో రసాయనాన్ని వినియోగిస్తారు.

'సుప్రీం' సూచనలు

పూర్తిగా బాణ సంచాను కాల్చడం నిషేధించాలంటూ గతంలో ముగ్గురు చిన్నారుల తరపున వారి తల్లిదండ్రులు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. బాణ సంచాను పూర్తిగా నిషేధించడం అసాధ్యమని ఉన్నత న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంటే కొన్ని పరిమితుల్ని విధించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్యలో టపాసుల్ని కాల్చరాదని, భారీ శబ్దాలు చేసే వాటిని కాల్చ కూడదని సూచించింది. ప్రత్యేకించి పండుగ రోజుల్లో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణా సంచా కాల్చాలని తీర్పులో ఆదేశించింది. దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రోజులో ఏవైనా రెండు గంటల పాటు కాల్చుకోవచ్చని సడలింపు ఇచ్చింది. బాణ సంచాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై సమాజంలో చైతన్యం తీసుకురావల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది.

పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం

దీపావళి పండుగను ప్రమాదాల బారిన పడకుండా జరుపుకోవాలి. పండుగ ఆనందాన్ని పూర్తిగా ఆహ్వాదించేందుకు పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలి. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలిగించడం మంచిది. నెయ్యిదీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుంది. పండుగ సంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చుకుంటాం. కానీ ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాలిస్తే పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఈ టపాసులు సైతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

– బి.జయచంద్రారెడ్డి, విశ్రాంత అటవీ శాఖ అధికారి, పర్యావరణ ప్రేమికులు

బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రులు చెల్లుబోయిన వేణు, విశ్వరూప్, జోగి రమేష్
- ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పేరి కామేశ్వరరావు ప్రమాణస్వీకారం



పేరి కామేశ్వరరావును అభినందిస్తున్న విశ్వరూప్, చెల్లుబోయిన వేణు, జోగి రమేష్, విష్ణు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పి.విశ్వరూప్, జోగి రమేష్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పేరి కామేశ్వరరావు (పీకే రావు) ప్రమాణ స్వీకారం చేశారు. చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజంలో బ్రాహ్మణుల సమస్యలు తెలిసిన పేరి కామేశ్వరరావు వంటి సీనియర్ నాయకుడిని కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎం జగన్ నియమించడం అభినందనీయమన్నారు. విశ్వరూప్ మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం కలిగిన పేరి కామేశ్వరరావు బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జోగి రమేష్ మాట్లాడుతూ రానున్నకాలంలో బ్రాహ్మణులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కోన రఘుపతి మాట్లాడుతూ వంశపారంపర్య అర్చకత్వం, అర్చకులకు వేతనాల పెంపు సీఎం జగన్ పాలనలోనే జరిగాయని చెప్పారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ అర్హులైన బ్రాహ్మణులకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ.600 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. పేరి కామేశ్వరరావును దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుందరరామ శర్మ, ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రేయ బాబు, అనంతబాబు, కార్పొరేషన్ జీఎం జి.నాగసాయి, పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు అభినందించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ సుసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన్యం గజగజ..!

- గణనీయంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- దట్టంగా పొగమంచు



పాడేరులో చలిమంట వద్ద స్థానికులు

సాక్షి, పాడేరు(అల్లూరి సీతా రామరాజుజిల్లా): చలికాలం ప్రారంభంలోనే మన్యం ప్రాంతంలో చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. శుక్రవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.5డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 13.9డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 14డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ కారణంగా సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో చలి మరింత వణికిస్తోంది. గిరిజన గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో చలిమంటలు కనబడుతున్నాయి. స్వెట్టర్ల వినియోగం క్రమేణా పెరుగుతోంది. అమ్మకాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఇక అర్ధరాత్రి అయితే దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. ఘాట్ ప్రాంతంలో దీని తీవ్రత ఉధృతంగా ఉంటోంది. ఉదయం 9 గంటల వరకు ఏజెన్సీ ప్రాంతంలో మంచు తెరలు వీడడం లేదు. ప్రజలు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. వ్యవసాయ పనులు, వారపు సంతలకు వెళ్లే గిరిజనులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చలితో ఇబ్బందులు పడుతున్నారు.

కేబినెట్ కళ్లుగప్పి ఖజానాకు కన్నం

▶ మొదటి పేజీ తరువాయి

దోపిడీ పర్వం సాగించారు. వీటిని అడ్డుకున్నందుకు ఎమ్మార్వో వనజాక్షిపై నాటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచక్షణా రహితంగా దాడులకు బరితెగించారు. స్వయంగా నాటి సీఎం చంద్రబాబు కరకట్ట నివాసం పక్కనే ఇష్టారాజ్యంగా ఇసుక లూటీ జరుగుతున్నా కళ్లు మూసుకుని కూర్చోవడాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తీవ్రంగా తప్పుబడుతూ భారీ జరిమానా సైతం విధించింది. రాష్ట్ర సంపదను దోచేస్తున్నారని ఆక్షేపించినా చంద్రబాబు చలించలేదు. ఈ ఇసుక దోపిడీ కేసులో సీఐడీ తీగ లాగుతుంటే పచ్చ ముఠాల డొంక కదులుతోంది.

ఆది నుంచి కన్ను

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ఇసుక రీచ్‌లను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ద్వారా జిల్లా, మండల మహిళా సమాఖ్యలకు అప్పగించినట్లు చంద్రబాబు కథ నడిపారు. మహిళా సమాఖ్యల ముసుగులో రెండేళ్ల పాటు భారీగా ఇసుక కొల్లగొట్టినా ఆయన సంతృప్తి చెందలేదు. కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సుల మేరకు 2016లో ఏపీఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లను వేలం వేసి ఇసుక విధానాన్ని రూపొందించారు. ఈమేరకు కేబినెట్ తీర్మానం చేసి 2016 జనవరి 1న జీవో 19 ఇవ్వగా అదే ఏడాది జనవరి 15న జీవో 20 వెలువడింది. ఈ విధానం ద్వారా కూడా మిగిలిన మూడేళ్లలో తాను ఆశించిన మేరకు ఇసుక దోపిడీ సాధ్యం కాదని భావించిన చంద్రబాబు రెండు నెలల్లోనే టెండర్ల ద్వారా ఇసుక రీచ్ కేటాయింపు విధానాన్ని పక్కన పెట్టేశారు.

పచ్చ ముఠాలకే ఉచితం

రాష్ట్రంలో ఇసుకను ప్రజలందరికీ ఉచితంగా ఇస్తున్నట్లు చంద్రబాబు నమ్మబలికారు. అందుకోసం కేబినెట్ ఆమోదం లేకుండా జారీ చేసిన మెమో 3066, జీవో 43 మధ్యలో మరో జీవో కూడా తెచ్చారు. 2016 మార్చి 14న జారీ చేసిన ఆ జీవో ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు భారీ జరిమానాలను నిర్దేశించారు. ఇసుక ఉచితం అన్నప్పుడు ఇక అక్రమ తవ్వకాలు అనే మాటే ఉత్పన్నం కాకూడదు కదా? అంటే ఉచిత ఇసుక విధానం పేరుతో చంద్రబాబు కనికట్టు చేశారన్నది స్పష్టమైంది. ఆ పేరుతో కేవలం చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇసుక రీచ్‌లను గుప్పిట్లో పెట్టుకున్నారు. మూడేళ్లపాటు దోపిడీకి పాల్పడ్డారు. ఇతరులు ఇసుక రీచ్‌ల జోలికి రాకుండా కట్టడి చేసేందుకే జీవో 35 తెచ్చారు. కొసమెరుపు ఏమిటంటే జీవో 35కు కూడా కేబినెట్ ఆమోదం లేదు. ఉచిత ఇసుక విధానం పేరుతో తెచ్చిన మెమో 3066, అనంతరం జారీ చేసిన జీవోలు 35, 43లకు కేబినెట్ ఆమోదం లేదన్నది నిర్ధారణ అయింది. వాటికి సంబంధించిన నోట్ ఫైళ్లు అటు ఏపీఎండీసీలోగానీ ఇటు గనుల శాఖ, జలవనరుల శాఖ కార్యాలయాల్లో గానీ లేవని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు పక్కాగా సాగించిన పన్నాగంపై పూర్తి ఆధారాలతో సీఐడీ దర్యాప్తు ముమ్మరం చేసింది.

కేబినెట్‌ను చీకట్లో ఉంచి.. ఉచిత ఇసుక విధానంతో దోపిడీ

ఎంత ఇసుక అందుబాటులో ఉంది? ఎంత తవ్వుతున్నాం? ఎంతకు అమ్ముతున్నాం? అనే ప్రాథమిక లెక్కలతో కూడా నిమిత్తం లేకుండా యథేచ్ఛగా కాజేసేందుకు ఈ విధానాన్ని తెచ్చారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను తుంగలోకి తొక్కారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం లేకుండానే కథ నడిపారు. అందుకోసం 2016 మార్చి 4న మెమో 3066 జారీ చేశారు. అది కూడా అప్పటికి రెండు రోజుల ముందు నుంచి అంటే 2016 మార్చి 2 నుంచే ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినట్లు అందులో పేర్కొనడం గమనార్హం. అప్పటివరకు కేబినెట్ ఆమోదంతో అమలులో ఉన్న ఇసుక విధానాన్ని తొలగిస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మెమో జారీ చేశారు. ఈ మెమోకు కేబినెట్ ఆమోదం లేదు. అంటే కేబినెట్ ఆమోదంతో రూపొందించిన విధానాన్ని పక్కనపెట్టి అడ్డదారిలో మెమో ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. అక్రమంగా ఇసుక తవ్వకాలపై భారీ జరిమానాలు విధించేందుకు విధివిధానాలను నిర్దేశిస్తూ 2016లో గత సర్కారు జీవో 35 జారీ చేసింది. రెండు నెలల తరువాత అంటే 2016 ఏప్రిల్ 6న జీవో 43 వెలువరించి అప్పటివరకు మెమో ద్వారా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానానికి రాజముద్ర వేసింది. విడ్డూరం ఏమిటంటే ఆ జీవో 43కు కూడా కేబినెట్ ఆమోదం లేదు. కేబినెట్ ఆమోదం లేకుండానే ఉచిత ఇసుక విధానాన్ని దొడ్డిదారిలో తెచ్చి ఇసుక దోపిడీకి చంద్రబాబు తెరతీశారు.

పండగ వేళ

బంతి ప్రకృతి బహుమతి

వేడుక వచ్చిందంటే చాలు బంతిపూల తోరణాలతో ఇళ్లూ వాకిళ్లు కళకళలాడుతూ ఉంటాయి. బంతిపూలకు మాత్రమే ఈ ప్రత్యేకత ఉంది. అందానికి, ఆరోగ్యానికి మేలు చేసే బంతిని మనకు ప్రకృతి ఇచ్చిన బహుమతిగా చెప్పచ్చు.

తెల్లవారుజామున సూర్యుడు ఉదయించగానే భూమిలోని చీకట్లు తొలగి వెలుగు రేకలు అంతటా వ్యాపిస్తాయి. అదేవిధంగా, బంతిపువ్వును చూడగానే, మన మనస్సు తన బాధలను మరచిపోయి సంతోషిస్తుంది. ఈ సారూప్యత వల్ల బంతిపువ్వును సూర్యభగవానుడికి చిహ్నంగా చెప్పుకోవచ్చు. గణేష్ చతుర్థి, నవరాత్రుల నుండి దీపావళి వరకు ఈ పూలకు చాలా డిమాండ్ ఉంది. మ్యారిగోల్డ్ శాస్త్రీయ నామం టాగెట్స్. భారతదేశానికి 350 సంవత్సరాల క్రితం పోర్చుగీసు వారి రాకతో మెక్సికో నుండి చేరుకుంది బంతి. చాలా అందంగా కనిపించే పసుపు, కుంకుమ రంగులో ఉండే ఈ పువ్వులను అందరూ ఇష్టపడతారు.

విస్తారంగా సాగు..

మన దేశంలో బంతిపూల సాగు పెద్ద ఎత్తున చేస్తుంటారు రైతులు, ఇది మతపరమైన ఆచారాలతో పాటు, అనేక ఉత్పత్తుల తయారీలలో కూడా ఉపయోగపడుతుంది. సీజన్‌ను బట్టి బంతి పువ్వులను సాగు చేస్తారు. ఇది ఏప్రిల్, మే నెలల్లో సాగును ప్రారంభిస్తే ఆగస్టు–సెప్టెంబర్‌లలో చలికాలం ప్రారంభమవడానికి ముందు పంట చేతికొస్తుంది.

ఈ రాష్ట్రాల్లో ఎక్కువ

ప్రపంచవ్యాప్తంగా 50 రకాల బంతి పువ్వులు ఉన్నాయి, వాటిలో మూడు జాతులు వాణిజ్య, వ్యవసాయం కోసం పెరుగుతాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల పొలాలు బంతి పువ్వులతో వెలిగిపోతుంటాయి.

త్యాగానికి పేరు

బంతి పువ్వు బృహస్పతికి ఇష్టమైనదిగా జ్యోతిష్యులు చెబుతుంటారు. దేవతల గురువు బృహస్పతిని బంతి పువ్వులతో పూజిస్తే జ్ఞానం పెంపొందుతుందని నమ్మకం. పసుపు–కుంకుమపువ్వును కలిపినట్టుగా ఉండే ఈ రంగు త్యాగానికి ప్రసిద్ధి చెందింది, మరో వైపు ఇది అగ్ని వంటి ఉగ్రమైన వ్యక్తిత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.

ప్రజల మొదటి ఎంపిక

ప్రజలు తమ ఇళ్లను బంతి పువ్వులతో అలంకరిస్తారు. కోల్‌కతా నుంచి వచ్చే బంతిపూలలో ఒకటి ఎరుపు, మరొకటి పసుపు. ఈ రంగు పువ్వులను బసంతి మేరి గోల్డ్ అంటారు. ఇదే అన్ని చోట్ల జనం మొదటి ఎంపికగా ఎంచుకుంటున్నారు.

మేలుబంతి

బొబ్బలు, కాలిన గాయాలు, దురదలు, చర్మవ్యాధుల నివారణలో బంతి పువ్వులను ఉపయోగిస్తారని ఆయుర్వేదంలో ఉంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు రక్తకణాలను ఉత్పత్తి చేసి చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యంగా మార్చగలవు. బంతి పువ్వులు వాపునే కాదు అలసటను తగ్గించడానికి కషాయంలా కూడా ఉపయోగిస్తారు. బంతి పువ్వు పొడి ముడతలు పడిన చర్మాన్ని మృదువుగా చేయడంలో కూడా సహాయపడుతుంది. బంతి పువ్వులు సహజ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కాలుష్యం నుండి చర్మాన్ని కాపాడతాయి.

అందమైన ప్రయోజనాలు

బంతిపూలు యాంటీ బయొటిక్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. మేరిగోల్డ్ ఫేస్‌ప్యాక్ ముఖ చర్మాన్ని బిగుతుగా చేయడంతో పాటు చర్మకాంతిని పెంచడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. మొటిమలు, ముఖంపై మచ్చలు ఉన్నవారు బంతి పువ్వు ఫేస్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు. అందుకే, సౌందర్య ఉత్పత్తులు, మసాజ్ నూనెలు, లోషన్లు, సబ్బులు.. మొదలైన ఉత్పత్తులలో బంతిపువ్వులను ఉపయోగిస్తారు. దీని ఉపయోగం శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. దీన్ని నొప్పి, వాపును తగ్గించడానికి, పేగు, కడుపు రుగ్మతల నుండి ఉపశమనానికి, అల్సర్లను నయం చేయడానికి కూడా ఉపయోగిస్తారు.

ఫస్ట్ టైమ్





అనూష షా...

విల్ పవర్ ఉన్న సివిల్ ఇంజనీర్

'నా వృత్తిలో నేను రాణిస్తే చాలు. అదే పదివేలు' అని సంతృప్తి పడి. సర్దుకుపోయేవాళ్లే ఎక్కువ మంది కనిపిస్తారు.

'నా వృత్తి వల్ల పర్యావరణానికి ఏ మేరకు హాని జరుగుతోంది?' అని ఆలోచించేవాళ్లు అరుదుగా కనిపిస్తారు.

అలాంటి అరుదైన వ్యక్తి... అనూష షా.

పచ్చటి ప్రకృతి ప్రపంచంలో పుట్టి పెరిగిన అనూషకు పర్యావరణ విలువ తెలుసు.

సివిల్ ఇంజనీర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న అనూష వృత్తి విజయాలను చూసి పొంగిపోవడం కంటే వృత్తికి సామాజిక బాధ్యతను జోడించడానికే అధిక ప్రాధాన్యత ఇచ్చింది. తన వంతుగా వివిధ వేదికలపై పర్యావరణ హిత ప్రచారాన్ని విస్తృతం చేసింది.

తాజాగా...

బ్రిటన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఐసీయి)కి అధ్యక్షురాలిగా ఎంపికైంది అనూష షా. రెండు శతాబ్దాల చరిత్ర ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 'ఐసీయి' అధ్యక్షత బాధ్యతలు స్వీకరించిన తొలి భారతీయురాలిగా అనూష షా చరిత్ర సృష్టించింది...

'వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్'లో అనూష షాకు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. డిజైనింగ్, మేనేజింగ్‌లో, ప్రాజెక్ట్స్– ప్రోగ్రామ్‌లను లీడ్ చేయడంలో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది.

'నిర్మాణం వల్ల నిర్మాణం మాత్రమే జరగడం లేదు. ప్రకృతికి ఎంతో కొంత నష్టం జరుగుతుంది' అనేది ఒక సామాజిక సత్యం. దీన్ని దృష్టిలో పెట్టుకొని వృత్తికి సామాజిక బాధ్యత కూడా జోడించి ముందుకు వెళుతోంది అనూష.

'నా వృతి వల్ల నాకు ఆర్థికంగా మేలు జరగడం మాట ఎలా ఉన్నా, చేటు మాత్రం జరగవద్దు' అంటోంది అనూష. అందుకే తన వృత్తిలో పర్యావరణ హిత విధానాలను అనుసరిస్తోంది.

'సివిల్ ఇంజనీరింగ్‌ను పీపుల్–పాజిటివ్ ప్రొఫెషన్‌గా చూడాలనేది నా కల. మౌలిక వసతులు, ప్రకృతికి మధ్య ఉండే అంతఃసంబంధాన్ని అర్థం చేసుకోవడంలో మొదట్లో మేము విఫలమయ్యాం. ఆ తరువాత మాత్రం ప్రకృతికి హాని జరగని విధానాలను అనుసరించాం' అంటుంది అనూష. అందమైన కశ్మీర్‌లో పుట్టి పెరిగిన అనూషకు ప్రకృతి విలువ తెలుసు.

కశ్మీర్‌లోని దాల్ సరస్సు సంరక్షణ కోసం దిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఒక సంస్థ కోసం ఇరవై మూడు సంవత్సరాల వయసులో కన్సల్టింగ్ ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా పనిచేసింది. ఆ తరువాత కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్‌తో బ్రిటన్ వెళ్లి 'వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్'లో ఎంఎస్‌సీ చేసింది. 'ప్లాన్ ఫర్ ఎర్త్' అనే క్లైమెట్ ఛేంజ్ కన్సెల్టెన్సీని మొదలు పెట్టి పర్యావరణ సంరక్షణకు సంబంధించిన ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. వివిధ పరిశ్రమలకు సంబంధించిన 'నెట్‌జీరో అండ్ క్లైమెట్ ఛేంజ్' బృందాలతో సమావేశమై విలువైన సూచనలు ఇచ్చింది.

చర్చాకార్యక్రమాల్లో పాల్గొన్నా, వ్యాసాలు రాసినా, టీవీలో ఇంటర్వ్యూ ఇచ్చినా, సమావేశాల్లో ఉపన్యాసం ఇచ్చినా...ప్రతి అవకాశాన్ని పర్యావరణ హిత ప్రచారానికి ఉపయోగించుకుంది.

'మన గురించి మాత్రమే కాదు భవిష్యత్ తరాల గురించి కూడా ఆలోచించాలి. ఉన్నతమైన విలువలతో ప్రయాణించినప్పుడే మన గమ్యస్థానం చేరుకోగలం' అంటుంది అనూష. 'క్లైమెట్ ఛేంజ్ ఇన్ ఇంజనీరింగ్' అంశానికి సంబంధించి అనూష చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు గానూ 'యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్' నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించింది.

కొన్ని సంవత్సరాల క్రితం బ్రిటన్ నుంచి ముంబైకి వచ్చింది అనూష. ఆ సమయంలో తన స్వస్థలం కశ్మీర్‌ను వరదలు ముంచెత్తాయి. ఎంతో మంది చనిపోయారు. ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. ఇది అనూషను బాగా కదిలించింది. 'విషాదం నుంచి కూడా నేర్చుకోదగినవి చాలా ఉంటాయి. ఇది అలాంటి విషాదమే' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది అనూష.

'ముందుచూపు, ముందు జాగ్రత్త ఉన్న వాళ్ల వైపే అదృష్టం మొగ్గు చూపుతుంది' అనేది అనూష షాకు బాగా ఇష్టమైన మాట.

'మన వల్ల ఏమవుతుంది అనే భావన కంటే ఔట్ ఆఫ్ బాక్స్‌లో ఆలోచించి, ధైర్యంగా ముందుకు వెళ్లడం వల్లే ఎక్కువ మేలు జరుగుతుంది. సంకల్పబలం ఉన్న చోట అద్భుతమైన ఫలితాలు వస్తాయి' అనేది ఆమె బలంగా చెప్పే మాట.

న్యూస్‌మేకర్



మోదీపై పీహెచ్‌డీ

నరేంద్ర మోదీ గుజరాత్ సి.ఎం. అయ్యాక, ప్రధాని పదవి చేపట్టాక ఆయనపై పీహెచ్‌డీలు చేసిన వారు చాలామంది ఉన్నారు. కాని వారిలో ముస్లిం స్కాలర్లు... అందునా మహిళా ముస్లిం స్కాలర్లు దాదాపుగా లేరు. ఆ విధంగా చూస్తే మోదీపై పీహెచ్‌డీ చేసిన మొదటి మహిళా స్కాలర్‌గా వారణాసికి చెందిన నజ్మా పర్వీన్ గుర్తింపు పొందింది.

చేనేత కుటుంబంలో పుట్టి

నజ్మా పర్వీన్‌ది వారణాసి దాపున ఉన్న లల్లాపుర. తల్లిదండ్రులు చేనేత కార్మికులు. కాని వారు ఆమె చిన్నప్పుడే మరణించారు. అయినా తన చదువుకు ఆటంకం కలిగించకుండా కొనసాగించింది పర్వీన్. బెనారస్ హిందూ యూనివర్సిటీ (బి.హెచ్.యు.)లో పొలిటికల్ సైన్స్ చదివి 2014లో పీహెచ్‌డీ సీటు తెచ్చుకుంది. ఆ సమయంలో ఆమె ఎంచుకున్న అంశం 'నరేంద్రమోడీస్ పొలిటికల్ లీడర్‌షిప్: యాన్ అనలిటికల్ స్టడీ'.

నజ్మా పర్వీన్ తన పీహెచ్‌డీకి ఈ అంశం తీసుకున్నాక 'నాక్కూడా భవిష్యత్తులో రాజకీయ నేత కావాలని ఉంది. అందుకే నేను భారతీయ అవామ్ పార్టీనీ స్థాపించాను కూడా. ఆ పార్టీని ఎలా రూపుదిద్దాలి అనుకున్నప్పుడు నాకు నరేంద్ర మోదీ నాయకత్వం మీద దృష్టి మళ్లింది. ఆయన రాజకీయాలలో ధ్రువతార వంటి వారు. 2014 నుంచి దేశంలో ఆయన సమర్థ నాయకత్వం కొనసాగింది. ట్రిపుల్ తలాక్ మీద ఆయన తెచ్చిన చట్టాన్ని సమర్థిస్తూ నేను మొదటగా శుభాకాంక్షలు తెలియచేశాను' అని తెలిపింది నజ్మా.

పేదరికంలో ఉన్న నజ్మా పర్వీన్ చదువుకు 'విశాల్ భారత్ సంస్థాన్' స్థాపించిన ప్రొఫెసర్ రాజీవ్ శ్రీవాస్తవ సహకరిస్తే బి.హెచ్.యు. ప్రొఫెసర్ సంజయ్ శ్రీవాస్తవ గైడ్‌గా వ్యవహరించారు. 8 ఏళ్ల సమయం తీసుకుని 20 హిందీ, 79 ఇంగ్లిష్ గ్రంథాలు అధ్యయనం చేసి నజ్మా ఈ పీహెచ్‌డీని పూర్తి చేసింది.

ఇంటిప్



అరకప్పు వంటసోడాలో నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని అవెన్‌లో లోపలి భాగంలో రాయాలి. హీటింగ్ కాయిల్స్, ఫ్యాన్ బ్లేడ్స్, లైట్స్ మీద రాయకూడదు. కింద, సైడు గోడలకు రాసి రాత్రంతా ఉంచేయాలి. ఉదయాన్నే కాటన్ వస్త్రంతో వంటసోడాని తుడిచేయాలి. సోడా పూర్తిగా పోయిన తరువాత నీటిలో కలిపిన వెనిగర్‌తో మరో సారి తుడవాలి. ఇలా చేస్తే అవెన్‌లో పేరుకుపోయిన మురికి, అవెన్ గోడలకు పడ్డ మచ్చలూ పోయి కొత్త దానిలా మెరుస్తుంది.

వ్యాపారాన్ని ఫైల్ చేసింది!

సాధారణంగా చదువు అయిపోగానే వెంటనే ఉద్యోగ వేటలో పడతారు చాలామంది. మంచి ఉద్యోగం కోసం వెతికి వెతికి చివరికి చిన్నపాటి జాబ్ దొరికినా చేరిపోతారు. కొంతమంది మాత్రం తాము కోరుకున్న దానికోసం ఎంత సమయం అయినా ప్రయత్నిస్తూనే ఉంటారు. వీరందరిలాగే ప్రయత్నించింది పూనమ్ గుప్తా. కానీ ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. దీంతో తనే ఒక వ్యాపారాన్ని ప్రారంభించి వందలమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగింది. సమస్య ఏదైనా నిశితంగా ఆలోచిస్తే ఇట్టే పరిష్కారం దొరుకుతుందనడానికి పూనమ్ గుప్తానే ఉదాహరణగా నిలుస్తోంది.



● పూనమ్ గుప్తా

ఢిల్లీకి చెందిన ఓ వ్యాపార కుటుంబంలో పుట్టింది పూనమ్ గుప్తా. లేడీ శ్రీరామ్ కాలేజీలో ఎకనమిక్స్‌తో డిగ్రీ పూర్తి చేసిన పూనమ్.. తరువాత ఎమ్‌బీఏ చేసింది. చదువు అయిన వెంటనే ఉద్యోగాన్వేషణ ప్రారంభించింది. ఎంత ప్రయత్నించినా ఎక్కడా ఉద్యోగం రాలేదు. ఇలా జాబ్ ప్రయత్నాల్లో ఉండగానే... 2002లో పునీత్ గుప్తాతో వివాహం జరిగింది. పునీత్ స్కాట్‌లాండ్‌లో స్థిరపడడంతో పూనమ్ కూడా భర్తతో అక్కడికే వెళ్లింది. పెళ్లి అయినా.. దేశం మారినా పూనమ్ మాత్రం ఉద్యోగ ప్రయత్నాన్ని మానుకోలేదు. ఎలాగైనా జాబ్ చేయాలన్న కోరికతో అక్కడ కూడా ఉద్యోగం కోసం కాళ్లు అరిగేలా తిరిగింది. అనుభవం లేదని ఒక్కరూ ఉద్యోగం ఇవ్వలేదు. స్కాట్‌లాండ్‌లో అయినా జాబ్ దొరుకుతుందనుకున్న ఆశ నిరాశగా మారింది.



● భర్తతో...

అలా వచ్చిన ఆలోచనే...

ఉద్యోగం కోసం వివిధ ఆఫీసులకు వెళ్లిన పూనమ్‌కు.. అక్కడ కట్టలు కట్టలుగా పేర్చిన ఫైళ్లు కనిపించేవి. ఉద్యోగం దొరకక సొంతంగా ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఆ ఫైళ్లను రీసైక్లింగ్ చేయవచ్చు గదా. అన్న ఐడియా వచ్చింది. పేపర్‌ను రీసైక్లింగ్ ఎలా చేయాలి, ఈ వ్యాపారంలో ఎదురయ్యే సవాళ్లను క్షుణ్ణంగా తెలుసుకుని కంపెనీ పెట్టాలని నిర్ణయించుకుంది. స్కాటిష్ ప్రభుత్వం ఓ పథకం కింద ఇచ్చిన లక్షరూపాయల రుణంతో 2003లో 'పీజీ పేపర్ కంపెనీ లిమిటెడ్' కంపెనీని పెట్టింది. ప్రారంభంలో యూరప్, అమెరికాల నుంచి పేపర్ వ్యర్థాలను కొని రీసైక్లింగ్ చేసేది. రీసైక్లింగ్ అయిన తరువాత నాణ్యమైన పేపర్‌ను తయారు చేసి విక్రయించడమే పూనమ్ వ్యాపారం. ఏడాదికేడాది టర్నోవర్‌ను పెంచుకుంటూ కంపెనీ విలువ ఎనిమిది వందల కోట్లకు పైకి చేరింది. ప్రస్తుతం అరవై దేశాల్లో పీజీ పేపర్స్ వ్యాపారాన్ని విస్తరించింది. అమెరికా, చైనా, ఇండియా, ఈజిప్టు, స్వీడన్‌లలో సొంతకార్యాలయాలు ఉన్నాయి.

> **అందరూ అదర్శమే...**
> "నాకు చాలామంది రోల్ మోడల్స్ ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి ఒక్కో విషయాన్ని నేర్చుకుని ఈ స్థాయికి ఎదిగాను. నాన్న, మామయ్య, టీచర్స్ నన్ను చాలా ప్రభావితం చేశారు. పెద్దయ్యాక మదర్ థెరిసా, ఇందిరా గాంధీ వంటి వారు మహిళలు ఏదైనా చేయగలరని నిరూపించి చూపించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ముందుకెళ్తూ విజయాలు సాధిస్తున్నాను".
> – పూనమ్ గుప్తా

పూనమ్‌కు అండగా...

పీజీ పేపర్స్‌ని పూనమ్ ప్రారంభించిన రెండేళ్లకు భర్త పునీత్‌గుప్తా కూడా ఎనభై లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి కంపెనీలో చేరారు. భార్యాభర్తలు ఇద్దరు కలిసి వ్యాపారాభివృద్ధికి కృషిచేశారు. దీంతో అనతి కాలంలోనే పీజీ పేపర్స్ ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపుని తెచ్చుకుంది. పేపర్ ట్రేడింగ్ కంపెనీతో పాటు డెంటల్ హెల్త్ వంటి వ్యాపారాల్లోనూ పూనమ్ రాణిస్తోంది.



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రవాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం



దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా



డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.



ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244.** వికెట్ల పతనం: 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. బౌలింగ్: రబడ 10-0-40-0, ఎన్గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247.** వికెట్ల పతనం: 1-64, 2-66, 3-116, 4-139, 5-182. బౌలింగ్: ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు



ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ X పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా-అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.


సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్టె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్టుని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిధున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

రెండు హృదయాల కల



● జాన్వీ కపూర్

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చూస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.



● 'ది ట్రయల్' పోస్టర్

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
11-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
72	30
64,905	19,425

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,726	▲	2
డోజోన్స్	34,145	▲	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,360	▽	95
డాక్స్	15,234	▽	118
షాంఘై	3,039	▽	14
నికాయ్	32,568	▽	78

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
60,240	▲	143
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,999	▲	143
వెండి (కేజీ)		
70,416	▲	116

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.23	103.53
€	యూరో	ఒకటి	87.43	90.47
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.27	55.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.83	54.14
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.32	61.67
SAR	సౌదీ రియాల్	ఖాతాప్రకారం	22.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాప్రకారం	21.79	23.59
¥	చైనా యువాన్	ఖాతాప్రకారం	10.31	12.38

బంగారానికి ధనత్రయోదశి డిమాండ్

పసిడి, వెండి కాయిన్ల కొనుగోళ్లు



న్యూఢిల్లీ: దీపావళికి ముందు ధనత్రయోదశి సందర్భంగా శుక్రవారం బంగారం షాపులు సందడిగా కనిపించాయి. సాధారణ రోజులతో పోలిస్తే బంగారం, వెండి విక్రయాలకు డిమాండ్ ఏర్పడింది. బంగారం ధరలు కూడా కొంత తగ్గడం సానుకూలించింది. అక్టోబర్ 28న 10 గ్రాముల బంగారం (24 క్యారెట్లు) రూ.63,000 వరకు వెళ్లగా, అక్కడి నుంచి రూ.1,500 వరకు తగ్గడంతో వినియోగదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపించారు. ధనత్రయోదశి నాడు బంగారం కొనుగోలు చేస్తే మంచి దనే నమ్మకం ఎక్కువ మందిలో ఉండడం తెలిసిందే. గురువారం బంగారం 10 గ్రాముల ధర రూ.400 తగ్గి రూ.60,950 వద్ద ముగియగా, ధనత్రయోదశి సందర్భంగా ఢిల్లీలో 10 గ్రాములకు రూ.50,139 (పన్నులు కాకుండా) పలికింది. సాధారణంగా ధనత్రయోదశి నాడు దేశవ్యాప్తంగా 20–30 టన్నుల వరకు బంగారం అమ్ముడుపోతుంటుంది. మధ్యాహ్నం తర్వాత నుంచి షాపులకు కస్టమర్ల రాక పెరిగినట్టు వర్తకులు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత త్రయోదశి రావడం తెలిసిందే. శనివారం మధ్యాహ్నం వరకు త్రయోదశి ఉంటున్నందున కొనుగోళ్లు మరింత పెరగొచ్చని వర్తకుల అంచనాగా ఉంది. ''బంగారం ధరలు వ్యాపారానికి అనుకూలంగా ఉన్నాయి. మంచి విక్రయాలు నమోదవుతాయని భావిస్తున్నాం. కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తోంది'' అని అఖిల భారత జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ డైరెక్టర్ దినేష్ జైన్ తెలిపారు.

రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం మేరకు దేశవ్యాప్తంగా రూ.30,000 కోట్ల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు, ఆర్టికల్స్ కొనుగోళ్లు జరిగాయి. ఇందులో బంగారం కొనుగోళ్లు రూ.27,000 కోట్లుగా, వెండి కొనుగోళ్లు రూ.3,000 కోట్ల వరకు ఉంటాయని ఆల్ ఇండియా జ్యుయలర్స్, అండ్ గోల్డ్ స్మిత్స్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ పంకజ్ అరోరా తెలిపారు. గతేడాది ధనత్రయోదశి రోజున బంగారం, వెండి కొనుగోళ్లు రూ.25,000 కోట్లుగా ఉన్నాయి.

నెమ్మదించిన పారిశ్రామికోత్పత్తి



సెప్టెంబర్‌లో ఐఐపీ 5.8%కి పరిమితం

న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధి నెలవారీగా చూస్తే సెప్టెంబర్‌లో మందగించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5.8 శాతానికి పరిమితమైంది. ఆగస్టులో ఇది 10.3 శాతంగా ఉంది. గతేదాది సెప్టెంబర్‌లో ఐఐపీ 3.3 శాతంగా నమోదైంది. తాజాగా తయారీ, మైనింగ్ రంగాలు మెరుగుపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో నమోదైన 7.1 శాతంతో పోలిస్తే సమీక్షాకాలంలో ఐఐపీ 6 శాతానికి పరిమితమైంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన ఐఐపీ గణాంకాల ప్రకారం..

- తయారీ రంగ వృద్ధి 4.5 శాతంగా (గత సెప్టెంబర్‌లో రెండు శాతం) నమోదైంది.
- విద్యుదుత్పత్తి వృద్ధి గత సెప్టెంబర్‌లో 11.6%గా ఉండగా ఈసారి 9.9%కి పరిమితమైంది.
- మైనింగ్ ఉత్పత్తి గతేడాది సెప్టెంబర్‌లో మైనస్ 5.2 శాతంగా ఉండగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో 11.5 శాతం పెరిగింది.
- క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ వృద్ధి 7.4 శాతంగా (గత సెప్టెంబర్‌లో 11.4 శాతం) నమోదైంది. కన్జూమర్ డ్యూరబుల్స్ వృద్ధి గత సెప్టెంబర్‌లో మైనస్ 5.5 శాతంగా ఉండగా ఈసారి ఒక్క శాతం మేర నమోదైంది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి మైనస్ 5.7 శాతం నుంచి 2.7 శాతానికి చేరింది.
- మౌలిక/నిర్మాణ రంగ ఉత్పత్తుల వృద్ధి 7.5%గా ఉంది. గత సెప్టెంబర్‌లో ఇది 8.2 శాతం.

రెండు కంపెనీలకు ఐఎస్‌పీ లైసెన్స్



న్యూఢిల్లీ: జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్, భారతి గ్రూప్ ప్రమోట్ చేస్తున్న వన్‌వెబ్ తాజాగా టెలికం శాఖ నుంచి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ (ఐఎస్‌పీ) లైసెన్స్ అందుకున్నట్టు సమాచారం. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించేందుకు ఈ రెండు సంస్థలకు ఏడాది క్రితమే అనుమతులు లభించాయి. ఈ కంపెనీలు టెరెస్ట్రియల్ నెట్‌వర్క్‌లతో లేదా వీశాట్ ద్వారా శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించవచ్చని ఒక అధికారి తెలిపారు.

కోల్ ఇండియా లాభం అప్

- క్యూ2లో రూ. 6,800 కోట్లు
- షేరుకి రూ. 15.25 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం కోల్ ఇండియా పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం పుంజుకుని రూ. 6,800 కోట్లను తాకింది. అధిక అమ్మకాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 6,044 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 15.25 చొప్పున తొలి మధ్యంతర డివిడెండును బోర్డు ప్రకటించింది. కాగా.. మొత్తం అమ్మకాలు సైతం రూ. 27,539 కోట్ల నుంచి రూ. 29,978 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు 9 శాతం పెరిగి రూ. 26,000 కోట్లను దాటాయి. ఈ కాలంలో ఇంధన కొనుగోలు ఒప్పందం(ఎఫ్‌ఎస్‌ఏ)లో భాగంగా ఒక్కో టన్ను బొగ్గుకు సగటున దాదాపు రూ. 1,542 చొప్పున లభించినట్లు కంపెనీ వెల్లడించింది. దేశీ బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం వాటాను ఆక్రమిస్తున్న కంపెనీ తాజా సమీక్షా కాలంలో 157.42 మిలియన్ టన్నులను ఉత్పత్తి చేసింది. గతేడాది క్యూ2లో 139.23 ఎంటీ బొగ్గు మాత్రమే ఉత్పత్తయ్యింది. ఇక అమ్మకాలు సైతం 154.53 ఎంటీ నుంచి 173.73 ఎంటీకి జంప్ చేశాయి. ఈ ఏడాది 780 ఎంటీ విక్రయాలను కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు యథాతథంగా రూ. 324 వద్ద ముగిసింది.

ఎల్ఐసీ లాభం 7,925 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ ఇండియా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం క్షీణించి రూ. 7,925 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 15,952 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం సైతం రూ. 1,32,632 కోట్ల నుంచి రూ. 1,07,397 కోట్లకు వెనకడుగు వేసింది. అయితే తొలి ఏడాది ప్రీమియం రూ. 9,125 కోట్ల నుంచి రూ. 9,988 కోట్లకు మెరుగుపడింది. ఇక మొత్తం ఆదాయం రూ. 2,22,215 కోట్ల నుంచి రూ. 2,01,587 కోట్లకు నీరసించింది. పెట్టుబడుల నుంచి మాత్రం ఆదాయం రూ. 93,942 కోట్లకు ఎగసింది. గత క్యూ2లో రూ. 84,104 కోట్లు లభించింది. స్థూల మొండిబకాయిలు 5.6 శాతం నుంచి 2.43 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఎల్ఐసీ షేరు ఎన్ఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 610 వద్ద ముగిసింది.

బీ న్యూ దీపావళి ఆఫర్లు



ముంబై: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ 'బీ న్యూ' మొబైల్స్ దీపావళికి ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.5,999 స్మార్ట్ వాచ్ లేదా రూ.2,999 బ్లూటూత్ ట్రూ వైర్‌లెస్ బహుమతిగా పొందొచ్చని సంస్థ సీఈఓ వై.సాయి నిఖిలేష్ తెలిపారు. స్మార్ట్ టీవీ కొనుగోలుపై రూ.17,999 విలువైన 120 వాట్స్ సౌండ్‌బార్‌ను రూ.999లకు, ఎంపిక చేసిన ల్యాప్‌టాప్‌పై రూ.17,999 విలువైన 120 వాట్స్ సౌండ్‌బార్ ఉచితంగా పొందొచ్చన్నారు. ఐఫోన్ 15 సిరీస్‌పై రూ.41,400, ఐఫోన్ 13 సిరీస్‌పై రూ.39,900 వరకు తగ్గింపు ఉంటుందన్నారు. శాంసంగ్ ఎస్–సిరీస్‌పై రూ.15,999 విలువైన బోట్ క్వాకే 200 వాట్స్ సౌండ్‌బార్, ఫోల్డ్ సిరీస్‌పై రూ.24,999 విలువైన ఎంఐ టీవీని ఉచితంగా లభిస్తుందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 80% వరకు రాయితీ అందిస్తామన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ.11 వేల వరకు, హెచ్‌డీబీ ద్వారా రూ.10 వేల వరకు, క్లవర్‌పే ద్వారా 15% వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుందన్నారు. నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం ఉందన్నారు.

సంవత్ 2079కు లాభాల వీడ్కోలు

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడేలో పరిమిత శ్రేణి ట్రేడింగ్



ముంబై: సంవత్ 2079 ఏడాదికి స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో వీడ్కోలు పలికింది. ట్రేడింగ్ చివర్లో మెటల్, ఫైనాన్స్, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 251 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 72 పాయింట్ల లాభంతో 64,905 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 66 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ ఆఖరికి 30 పాయింట్లు పెరిగి 19,425 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల నేపథ్యంలో సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఐటీ, టెలికమ్యూనికేషన్, ఆటో, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అధిక ద్రవ్యోల్బణ కట్టడికి అవసరమైతే కఠిన ద్రవ్య పాలసీ విధాన అమలుకు వెనకాడమని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- ఈ సంవత్ 2079 ఏడాదిలో సెన్సెక్స్ 5,073 పాయింట్లు, నిఫ్టీ 1,694 పాయింట్లు చొప్పున పెరిగాయి. ఇదే కాలంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.44 లక్షల కోట్లు పెరిగింది.
- ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేరు లిస్టింగ్ రోజు 15% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.60)తో పోలిస్తే 20% ప్రీమియంతో రూ.71 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 24% ర్యాలీ చేసి రూ.75 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో 15% లాభంతో రూ.69 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,555 కోట్లుగా నమోదైంది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్టం 83.33 స్థాయి వద్ద స్థిరపడింది. కొనసాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ, క్రూడాయిల్ ధరల్లో అస్థిరతలు దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఈ సెప్టెంబర్ 18న 83.32 స్థాయి వద్ద ఆల్‌టైం కనిష్టాన్ని తాకిన సంగతి తెలిసిందే. పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ డేటా రూపాయి గమనాన్ని నిర్దేశిస్తాయని ట్రేడర్లు పేర్కొన్నారు.

ఆదివారం మూరత్ ట్రేడింగ్

దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆదివారం గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. సాయంత్రం 6.15 గంటలకు మొదలై 7.15 గంటలకు ట్రేడింగ్ ముగియనుంది. ఈ ఘడియల్లో షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు గడిస్తాయని మార్కెట్ వర్గాల నమ్మకం. బలిప్రతిపద సందర్భంగా నవంబర్ 14న(మంగళవారం) ఎక్స్ఛేంజీలకు సెలవు.

హ్యాపీ మొబైల్స్ 'ఫెస్టివ్ క్యాష్‌బ్యాక్ ధమాకా'



హైదరాబాద్: దీపావళి సందర్భంగా హ్యాపీ మొబైల్స్ 'ఫెస్టివ్ క్యాష్‌బ్యాక్ ధమాకా' ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, ఎల్ఈడీ స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ ద్వారా 10% వరకు క్యాష్‌బ్యాక్ పొందొచ్చని సంస్థ సీఎండీ కృష్ణ పవన్ చెప్పారు. అన్ని మొబైల్ యాక్సెసరీస్‌లపై 65% వరకు తగ్గింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ కన్నా తక్కువ ధరలు, అద్భుతమైన డీల్స్, ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తున్నామని కంపెనీ ఎండీ కోట సంతోష్ వివరించారు.

రిలయన్స్ డిజిటల్ దీపావళి ఆఫర్లు



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ దీపావళి సందర్భంగా 'అన్‌లిమిటెడ్‌సెలబ్రేషన్స్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ఇందులో భాగంగా స్మార్ట్ టీవీలు, మొబైల్స్, వాషింగ్ మెషిన్లు, ల్యాప్‌టాప్‌లు, వైర్‌లెస్ ఇయర్ బడ్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, గృహోపకరణాలపై భారీ రాయితీ పొందవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డులపై గరిష్టంగా రూ.15వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. ఈఎంఐ, సులభ ఫైనాన్స్ సదుపాయాలు ఉన్నాయి. రిలయన్స్ డిజిటల్ స్టోర్లు, మై జియో స్టోర్లు, రిలయన్స్‌డిజిటల్.ఇన్ ద్వారా కస్టమర్లు ఈ ఆఫర్లు పొందవచ్చు.

సింధియాకు అగ్నిపరీక్ష

అసెంబ్లీ ఎన్నికలు ఇంకా వారం కూడా లేని వేళ మధ్యప్రదేశ్‌లో కీలకమైన గ్వాలియర్–చంబల్ ప్రాంతం అధికార బీజేపీకి తలనొప్పిగా మారుతోంది. పార్టీలోని పాత నేతలకు, మూడేళ్ల కింద కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన జ్యోతిరాదిత్య సింధియా అనుయాయులకు అస్సలు సరిపడకపోవడం, ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తుండటం అధిష్టానానికి మింగుడు పడటం లేదు. ఈ ప్రాంతంలో 34 కీలక అసెంబ్లీ స్థానాలున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టాలంటే ఇక్కడ మంచి ఫలితాలు సాధించడం కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ చాలా కీలకం. అలాంటి ప్రాంతంలో పాత, కొత్త నేతలు సయోధ్యకు ససేమిరా అంటుండటం పార్టీ నాయకత్వంతో పాటు సింధియాకు కూడా ఇబ్బందికరంగానే మారింది. పైగా శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై జనంలో నెలకొన్న వ్యతిరేకత కూడా దీనికి తోడయ్యేలా కన్పిస్తుండటం మరింత గుబులు రేపుతోంది. ఈసారి గ్వాలియర్ ప్రాంతంలో బీజేపీ సాధించబోయే సీట్ల సంఖ్యపై పార్టీలో సింధియా భవితవ్యం కూడా చాలావరకు ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఓటర్ల తీర్పు ఎలా ఉండనుందన్నది ఆసక్తికరంగా మారింది...

గ్వాలియర్‌లో 'పాత–కొత్త' కొట్లాటలు

- బీజేపీలో పెరుగుతున్న కుమ్ములాటలు
- భయపెడుతున్న ఓటర్ల నిరాసక్తత
- సింధియా రాజకీయ భవిష్యత్తుకు పరీక్ష



అది గ్వాలియర్‌లోని హజీరా ప్రాంతం. సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఇంధన మంత్రి ప్రద్యుమ్నసింగ్ తోమర్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. బీజేపీకి ఓటెయ్యాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మాత్రం కాంగ్రెస్‌కు ఓటెయ్యాల్సిందిగా కోరారాయన! ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచిన అనంతరం యువ నేత జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న 16 మంది ఎమ్మెల్యేల్లో తోమర్ ఒకరు. ఆయన రాకతో కినుక వహించిన స్థానిక బీజేపీ నేతలు ఇప్పుడాయనకు సహాయ నిరాకరణ చేస్తున్నారు. దాంతో ఒకరకంగా ఆయనది ఒంటరి పోరుగానే మారింది. ఆయనకు మాత్రమే కాదు, బీజేపీ టికెటిచ్చిన సింధియా వర్గానికి చెందిన మరో 17 మంది నాయకులకూ దాదాపుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది! అంతేగాక ఓటర్లు కూడా వారిపట్ల నిరాసక్తతే చూపుతున్నారు. ''వారికే పరస్పరం కుదరడం లేదు. అలాంటి వాళ్లకు మా మంచీ చెడూ గురించి ఆలోచించేంత సమయం ఎక్కడుంటుంది?'' అని ప్రశ్నిస్తున్నారు!

బీజేపీ వర్సెస్ సింధియా వర్గం

2020 మార్చిలో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి సింధియా బీజేపీలో చేరారు. దాంతో కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలి శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. వారంతా రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలొచ్చాయి. గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో ఇలా రాజీనామా చేసిన 16 మందిలో 9 మంది తిరిగి నెగ్గారు. దాంతో అక్కడ బీజేపీ బలం 16కు పెరిగింది. ఈసారి ఆ స్థానాలన్నింటినీ నిలుపుకోవడంతో పాటు మరిన్ని చోట్ల నెగ్గాల్సిన కఠిన పరీక్ష సింధియా ముందుంది. కానీ పరిస్థితులు ఆయనకు అంత సానుకూలంగా కన్పించడం లేదు. ఆ ప్రాంత ప్రజల్లో మెజారిటీ సింధియా నిర్ణయాన్ని తప్పుబడుతుండటం విశేషం. ఆయనసలు కాంగ్రెస్‌ను వీడాల్సిందే కాదన్నది వారి నిశ్చితాభిప్రాయం. దీనికి తోడు సింధియా వర్గానికి చెందిన 18 మందికి బీజేపీ నాయకత్వం టికెట్లివ్వడం కూడా పార్టీలో విభేదాలకు కారణమైంది. పలువురు ఆశావహులు పార్టీలు మారి బరిలో దిగి సవాలు విసురుతున్నారు. మోరెనా అసెంబ్లీ స్థానంలో సింధియా వర్గం ఎమ్మెల్యే రఘురాయ్ కన్సానాకు టికెటివ్వడాన్ని వ్యతిరేకిస్తూ రాకేశ్ రుస్తుం సింగ్ బీజేపీని వీడారు. బీఎస్పీ టికెట్‌పై బరిలో దిగి సవాలు విసురుతున్నారు. బీజేపీ ఓటు బ్యాంకును ఆయన గణనీయంగా చీల్చడం ఖాయమంటున్నారు. పలు ఇతర అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే పరిస్థితి! దీన్ని గమనించే బీజేపీ ట్రబుల్ షూటర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అక్టోబర్ 30 నుంచి వారం లోపే ఏకంగా రెండుసార్లు గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో పర్యటించారు. అసంతృప్త పార్టీ నేతలతో వరుస సమావేశాలు జరిపి బుజ్జగించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ''అసలు బీజేపీ నేతల్లోనే చాలామంది సింధియాను వ్యతిరేకిస్తున్నారు. ఇది ఈసారి ఆ పార్టీకి బాగా చేటు చేసేలా కనిపిస్తోంది'' అని రాజకీయ, మీడియా విశ్లేషకులు చెబుతున్నారు. నిజానికి గ్వాలియర్ రాజవంశీకునిగా సింధియాపై ఈ ప్రాంతవాసులకు చెప్పలేనంత అభిమానముంది. కానీ ఆయన పార్టీ మారిన తీరు వారికి పెద్దగా నచ్చలేదు.

వ్యతిరేక పవనాలు..!

అంతేగాక మధ్యలో ఓ ఏడాదిన్నర మినహా రాష్ట్రంలో 18 ఏళ్లుగా బీజేపీ పాలనే సాగుతుండటంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత కూడా సింధియాకు ప్రతికూలంగా మారుతోంది. ''నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మాకొచ్చే రోజువారీ కూలీ ఏ మూలకూ చాలడం లేదు. పోయినసారి బీజేపీకి ఓటేశాం. ఈసారి మాత్రం కాంగ్రెస్‌కే వేసి చూద్దామనుకుంటున్నాం'' అన్న మాలతీ కిరార్, ఆమె సోదరుడు యోగేంద్ర మాటలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసినా తనకిప్పటికీ ఉద్యోగం దొరకలేదని భగవాన్ దాస్ అనే యువకుడు వాపోయాడు. ''మూడేళ్లుగా ప్రభుత్వోద్యోగాల భర్తీయే లేదు. బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి?'' అన్న ఆయన ప్రశ్న యువతలో కూడా కమలం పార్టీకి సానుకూలంగా లేదనేందుకు రుజువేనంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

2018 అసెంబ్లీ ఎన్నికల్లో గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో పార్టీలవారీగా ఫలితాలు


అసెంబ్లీ స్థానాలు	34
కాంగ్రెస్	26
బీజేపీ	7

పంచతంత్రం

రెండో విడత ఎన్నికల బరిలో ఉన్న 253 మంది కోటీశ్వరులు

ఏడీఆర్ నివేదిక వెల్లడి

ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం ఆస్తులు రూ.447 కోట్లు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఈనెల 17న రెండో విడత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 253 మంది కోటీశ్వరులు. ఈ జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత, డిప్యూటీ సీఎం టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్లతో మొదటి స్థానంలో నిలిచారు. మొత్తం 958 మందికిగాను 953 మంది అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడించిన ఆస్తుల వివరాలను విశ్లేషించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)తెలిపింది. అభ్యర్థుల ఆస్తుల సరాసరి రూ.2 కోట్లని తెలిపింది. అత్యంత ధనికులైన ముగ్గురు అభ్యర్థులు కూడా కాంగ్రెస్‌కు చెందిన వారేనని పేర్కొంది. సుర్గుజా రాచకుటుంబ వారసుడైన టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్ల ఆస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. అంబికాపూర్ నుంచి పోటీ చేస్తున్న ఈయన 2018 ఎన్నికల సమయంలో రూ.500 కోట్ల ఆస్తులున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత మణేంద్రగఢ్ స్థానంలో పోటీ చేస్తున్న రమేశ్ సింగ్ రూ.73 కోట్ల పైచిలుకు ఆస్తులు, రజిమ్‌లో పోటీ చేస్తున్న అమితేశ్ శుక్లా రూ.48 కోట్ల పైచిలుకు ఆస్తులున్నట్లు ప్రకటించారని వెల్లడించింది. కాంగ్రెస్‌కు చెందిన 70 మంది అభ్యర్థుల్లో 60 (86%)మంది, బీజేపీకి చెందిన 70 మంది అభ్యర్థుల్లో 57 (81%)మంది, జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జే)కి చెందిన 62 మందిలో 26 (42%) మంది, ఆప్‌నకు చెందిన 44 మందిలో 19 (43%) మంది అభ్యర్థులు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులున్నట్లు ప్రకటించారని వివరించింది.

ఆస్తులే లేవన్న ముగ్గురు అభ్యర్థులు

భట్‌గావ్ సీటుకు పోటీ చేస్తున్న కళావతి సార్థి, బెల్తారాలో పోటీ చేస్తున్న గౌతమ్ ప్రసాద్ సాహు అనే స్వతంత్ర అభ్యర్థులు, ఖర్సియాలో పోటీలో ఉన్న జోహార్ ఛత్తీస్‌గఢ్ పార్టీకి చెందిన యశ్వంత్ కుమార్ నిషాద్ తమకు ఎలాంటి ఆస్తులు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఏడీఆర్ తెలిపింది. అదేవిధంగా, రెండో విడత ఎన్నికల బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు అతి తక్కువగా ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. ముంగేలి ఎస్సీ రిజర్వుడు సీటుకు పోటీ చేస్తున్న నేషనల్ యూత్ కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌రత్న ఉయికే తన వద్ద కేవలం రూ.500 ఉన్నట్లు తెలిపారు. రాయ్‌గఢ్‌లో ఆజాద్ జనతా పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్న కాంతి సాహు రూ.1,000 మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. అదే విధంగా, బెల్తారా బరిలో నిలిచిన ఆజాద్ జనతా పార్టీకే చెందిన ముకేశ్ కుమార్ చంద్రాకర్ రూ. 1,500 ఉన్నట్లు వెల్లడించారని ఏడీఆర్ తెలిపింది.

సీఎం బఘేల్‌కు అత్యధిక ఆదాయం

ఆప్ అభ్యర్థి విశాల్ కేల్కర్, కాంగ్రెస్ నేత, సీఎం భూపేశ్ బఘేల్, బీజేపీ నేత ఓపీ చౌధరి తమకు అత్యధిక ఆదాయం వస్తున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారని ఏడీఆర్ పేర్కొంది. కేల్కర్ తన మొత్తం ఆదాయం రూ.2 కోట్లుగా, సీఎం బఘేల్, చౌధరిలు రూ.కోటికి పైగా ఆదాయం ఉన్నట్లు చెప్పారు.

52 శాతం మంది 12వ తరగతిలోపే

మొత్తం అభ్యర్థుల్లో 499(52 శాతం) మంది తమ విద్యార్హతలను 5 నుంచి 12వ తరగతి మధ్య ఉన్నట్లు తెలపగా మరో 405(42%)మంది గ్రాడ్యుయేషన్ ఆపైన చదువుకున్నట్లు వెల్లడించారని ఏడీఆర్ విశ్లేషించింది. 19 మంది అక్షరాస్యులమని మాత్రమే తెలపగా, ఆరుగురు నిరక్షరాస్యులమని తెలిపారు. ముగ్గురు అభ్యర్థులు విద్యార్హతలను పేర్కొనలేదు.



కుల గణన.. విప్లవాత్మక ముందడుగు

అధికారంలోకి వస్తే కుల గణన నిర్వహిస్తాం

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ

సాత్నా: కుల గణన అనేది విప్లవాత్మకమైన ముందడుగు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. కుల గణన ప్రజల జీవితాల్లో మార్పు తెస్తుందని అన్నారు. మధ్యప్రదేశ్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఓబీసీల జనాభా ఎంత ఉందో తెలుస్తామన్నారు. కుల గణన ఎక్స్–రే లాంటిదని చెప్పారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు కుల గణన తోడ్పడుతుందని వివరించారు. కేంద్రంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని హామీ ఇచ్చారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని సాత్నా, బర్వానీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ పాలన మొదలయ్యాక దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని విమర్శించారు. తాను ఓబీసీనని పదే పదే చెప్పుకొనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులగణనపై మాత్రం నోరు మెదపడం లేదని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో 53 మంది ఐఏఎస్ అధికారులు ఉండగా, వారిలో ఓబీసీ అధికారి ఒక్కరే ఉన్నారని రాహుల్ ఆక్షేపించారు. రాష్ట్ర బడ్జెట్ 100 రూపాయలు అనుకుంటే.. అందులో కేవలం 33 పైసలు మాత్రమే ఓబీసీ ఐఏఎస్ అధికారి పరిధిలో ఉన్నట్టు అవుతుందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో ప్రజల మద్దతుతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధన బలం ప్రయోగించి బీజేపీ కూల్చివేసిందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. నలుగురు ఐదుగురు బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.14 లక్షల కోట్ల రుణాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. సామాన్య ప్రజలకు మాత్రం బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజస్తాన్ అసెంబ్లీ బరిలో 1,875 మంది

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి ఈనెల 25న జరగనున్న ఎన్నికలకు 1,875 మంది పోటీలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం ఆఖరి రోజు. గడువులోగా మొత్తం 490 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారని అధికారులు తెలిపారు. బరిలో 183 మంది మహిళలు, 1,692 మంది పురుష అభ్యర్థులు మిగిలారని వివరించారు. నామినేషన్ పత్రాలను వెనక్కి తీసుకున్న వారిలో బీజేపీ రెబల్ అభ్యర్థి మాజీ మంత్రి రాజ్‌పాల్ సింగ్ కూడా ఉన్నారు. జోత్వారా నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎంపీ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పోటీ చేస్తున్నారు. ఈ స్థానంలోనే రెబెల్‌గా రాజ్‌పాల్ సింగ్ నామినేషన్ వేశారు. నామినేషన్లను వెనక్కి తీసుకున్న వారిలో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నేతలున్నారు. మొత్తం 2,605 మంది నామినేషన్లు వేయగా అధికారుల పరిశీలించి 240 నామినేషన్లను తిరస్కరించారు. జోత్వారాలో అత్యధికంగా 18 మంది పోటీలో ఉండగా దౌసా జిల్లా లాల్‌సోట్‌లో ముగ్గురే బరిలో నిలిచారు.

ద్వారకాతిరుమలలో ధర్మ ప్రచార మాసోత్సవాలు

ప్రారంభించిన మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి ఆలయంలో ధర్మ ప్రచార మాసోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేపట్టారు. ఆలయ అనివేటి మండపంలో జరిగిన ధార్మిక సభలో మంత్రి కొట్టు మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాలతో రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రధాన దేవాలయాల్లో ధర్మ ప్రచార కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఉత్తరాంధ్ర, డెల్టా, రాయలసీమ ప్రాంతాల్లోని అన్ని జిల్లాల్లో కళాకారుల ప్రదర్శనలు, దేవతామూర్తుల కల్యాణాల ద్వారా ఈ ధర్మ ప్రచారం చేయనున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఆగస్ట్ 6న అన్నవరం, సెప్టెంబర్ 14న శ్రీకాళహస్తి, అక్టోబర్ 14న కాణిపాకం ఆలయాల్లో ఈ మాసోత్సవాలు ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. కాణిపాకంలో ఇటీవల చేపట్టిన గణపతి హోమాలను ఎక్కడైనా నిర్వహించడానికి ఎవరైనా ముందుకువస్తే తాము అన్ని సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ రాము సత్యనారాయణ, డీసీ విజయరాజు, ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు, ఆర్‌జేసీ సురేష్‌బాబు, ఏసీ రంగారావు (ఏలూరు), ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్ కం రోడ్డు బ్రిడ్జిపై నేటి నుంచి రాకపోకలు



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) : గోదావరి నదిపై రాజమహేంద్రవరం – కొవ్వూరు మధ్య ఉన్న రైల్ కం రోడ్డు బ్రిడ్జిపై (ఆర్‌సీఆర్‌బీ) కొద్ది రోజులుగా చేపట్టిన రహదారి మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో ఈ వంతెనపై రాకపోకలు శనివారం ఉదయం 9 గంటలకు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్‌సీఆర్‌బీ మన్నికను దృష్టిలో పెట్టుకుని వంతెనపై ఇక నుంచి భారీ వాహనాలు, లారీలు, లగేజ్ బస్సుల రాకపోకలను నిషేధించారు. బైక్‌లు, ఆటోలు, కార్లు, ఏపీఎస్ ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను మాత్రమే అనుమతిస్తున్నట్టు ఆర్ అండ్ బీ తూర్పు గోదావరి జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఎస్‌బీవీఎన్ రెడ్డి తెలిపారు. వంతెన పైకి భారీ వాహనాలు రాకుండా రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపు ప్రత్యేకంగా ఇనుప గడ్డర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాగా, దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెనపై రహదారి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది. వంతెనపై 2.92 కి.మీ. మేర రూ.2.10 కోట్లతో వివిధ పనులు చేపట్టింది. బ్రిడ్జిపై గతంలో ఉన్న ప్యాచ్ వర్క్, లేయర్లను పూర్తిగా తొలగించారు. గట్టి బేస్‌ను టచ్ చేస్తూ 30 ఎంఎం బీటీ రోడ్డు నిర్మించారు. ఫుట్ పాత్‌లకు పెయింటింగ్, రోడ్ సేఫ్టీ మార్కింగ్స్, గడ్డర్లు ఏర్పాటు చేశారు. పనులను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సుమారు 43 రోజుల పాటు జరిగిన మరమ్మతుల అనంతరం రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి.

మెడ్‌టెక్ జోన్‌లో మెగా ఎక్స్‌పో సిటీ

లక్షకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణం... 150 రోజుల్లో నిర్మాణం

ప్రారంభమైన తొలి రోజే అంతర్జాతీయ కాంగ్రెస్

14 నుంచి డబ్ల్యూహెచ్‌వో ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఫోరం సదస్సు

హాజరుకానున్న 80దేశాల ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులు



విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో నిర్మించిన ఇండియా ఎక్స్‌పో సిటీ

సాక్షి, విశాఖపట్నం: కోవిడ్ సమయంలో ర్యాపిడ్ టెస్ట్ కిట్‌ల తయారీ... భారత వైద్యరంగంలో ప్రపంచస్థాయి గామా రేడియేషన్ సెంటర్... ప్రపంచంలోనే మొదటి డేటా సెంటర్ ఏర్పాటు.. ఇలా వైద్యరంగంలో విప్లవాత్మక ఆవిష్కరణలకు కేంద్రంగా మారిన విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ మరో రికార్డును సొంతం చేసుకుంది. తాజాగా ఇండియా ఎక్స్‌పో సిటీ పేరుతో భారీ ఎగ్జిబిషన్ సెంటర్‌ను నిర్మించింది. కేవలం 150 రోజుల్లోనే లక్షకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఎగ్జిబిషన్ సెంటర్‌ను ఏర్పాటుచేసి రికార్డు సృష్టించింది. ఈ ఇండియా ఎక్స్‌పో సిటీని శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ తొలి రోజే 5వ ఇంటర్నేషనల్ క్లినికల్ ఇంజినీరింగ్ అండ్ హెల్త్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ ప్రారంభం కావడం విశేషం.

తొలి రోజే అంతర్జాతీయ సదస్సు

ఇండియా ఎక్స్‌పో సిటీ అందుబాటులోకి వచ్చిన తొలి రోజే అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్(ఏఏఎంఐ), గ్లోబల్ క్లినికల్ ఇంజినీరింగ్ అలయెన్స్ (జీసీఈఏ) ఆధ్వర్యంలో 5వ ఇంటర్నేషనల్ క్లినికల్ ఇంజినీరింగ్ అండ్ హెల్త్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కాంగ్రెస్ (ఐసీఈహెచ్‌టీఎంసీ) ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించనున్న సదస్సులో కోవిడ్–19 అనంతర పరిణామాలతోపాటు వైద్య పరికరాల వినియోగం, అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలు, హెల్త్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చిస్తారు. అమెరికా, చైనా, వెనుజులా, మెక్సికో, స్కాట్లాండ్, బ్రెజిల్, స్పెయిన్, కొలంబియా తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కాంగ్రెస్‌లో భాగంగానే 14 నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఫోరం సమావేశం కూడా మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించనున్నట్లు ఏఏఎంఐ చీఫ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాబర్ట్ బరోస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 80కి పైగా దేశాలకు చెందిన జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు.

ఇవీ ప్రత్యేకతలు...

- మెడ్‌టెక్ జోన్‌లోని ప్రగతి మైదాన్‌లో 1,03,951 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇండియా ఎక్స్‌పో సిటీ నిర్మాణ పనులు జూన్ 14న ప్రారంభించారు. శుక్రవారం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. మొత్తం 5.40లక్షల పని గంటల్లో నిర్మాణం పూర్తిచేశారు.
- ఈ ఎక్స్‌పో సిటీ నిర్మాణం కోసం 3,577 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్, 718 మెట్రిక్ టన్నుల స్టీల్ వినియోగించారు.
- లోపల భాగంలో ఒక్క కోలమ్ కూడా నిర్మించకుండా దీనిని పూర్తి చేయడం విశేషం.
- రోజుకు 10వేల మంది సందర్శించేలా ఎక్స్‌పో సిటీని నిర్మించారు.
- ఎక్స్‌పో సిటీలో నాలుగు కాన్ఫరెన్స్ హాల్స్, బోర్డ్‌రూమ్‌లు ఉన్నాయి.
- 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో డిస్‌ప్లే షాప్స్ ఏర్పాటుచేసుకోవచ్చు.

ముగిసిన భారత్–బంగ్లాదేశ్ నౌకాదళ విన్యాసాలు

ఐఎంబీఎల్‌లో ఇండియన్ నేవీ సత్తా



భారత్, బంగ్లా ద్వైపాక్షిక విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం: రక్షణ సంబంధాలు మరింత బలపడేలా ఏటా నిర్వహించే ద్వైపాక్షిక విన్యాసాల్లో భారత్–బంగ్లాదేశ్ నౌకాదళాలు సంయుక్తంగా సత్తా చాటాయి. ఈ నెల 7 నుంచి బొంగోసాగర్–2023 పేరుతో ద్వైపాక్షిక విన్యాసాల నాలుగో ఎడిషన్, కార్పాట్–23 పేరుతో సమన్వయ గస్తీ ఐదో ఎడిషన్‌ను నిర్వహించారు. ఇంటర్నేషనల్ మేరీటైమ్ బౌండరీ లైన్ (ఐఎంబీఎల్) పరిధిలో జరిగిన ఈ విన్యాసాలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. బంగ్లాదేశ్ తరఫున అబుబకర్, అబుఉబైదా యుద్ధ నౌకలతో పాటు మేరీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎంపీఏ) పాల్గొనగా.. భారత్‌కు ఐఎన్ఎస్ కుతార్, కిల్తాన్ యుద్ధ నౌకలు, ఎంపీఏలు, డార్నియర్స్ ప్రాతినిధ్యం వహించాయి. కమ్యూనికేషన్ డ్రిల్స్, సముద్ర ఉపరితలంపై గన్ షూట్స్, యుద్ధ సమయంలో అనుసరించాల్సిన వ్యూహాత్మక విన్యాసాల్లో భారత్ నౌకాదళం సత్తా చాటింది. కార్పాట్‌లో భాగంగా.. విపత్తు సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై రెండు దేశాలు ఎలా అడుగులు వేయాలన్న అంశాలపై విన్యాసాలు నిర్వహించారు. దీన్లోభాగంగా.. సముద్ర శోధన, నడి సముద్రంలో చిక్కుకుపోయిన వారిని ఎలా రక్షించాలనే అంశాలపై రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించారు. భవిష్యత్‌లో భారత్, బంగ్లాదేశ్ రక్షణ దళాలు పరస్పర సహకారంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తాయని ఇండియన్ నేవీ వర్గాలు వెల్లడించాయి.

కామాంధులకు కఠిన శిక్షలు

- విశాఖ ఘటనలో 25 ఏళ్ల జైలు, జరిమానా
- అనంతపురం ఘటనలో జీవితఖైదు..

విశాఖ లీగల్/అనంతపురం క్రైం/గుత్తి రూరల్: అభంశుభం తెలియని చిన్నారులపై అకృత్యాలకు పాల్పడిన కామాంధులకు కఠిన శిక్షలు విధిస్తూ విశాఖ, అనంతపురం పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానాల న్యాయమూర్తులు శుక్రవారం తీర్పులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. విశాఖ ఉక్కు నగరానికి చెందిన నిందితుడు రాజేష్‌కుమార్ సీఐఎస్ఎఫ్ పోలీస్ విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాధిత చిన్నారి (3) కూడా పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో ఉంటోంది. 2023 జనవరి 13న నిందితుడు బాలికను తన ఇంట్లోకి తీసుకువెళ్లి అతిక్రూరంగా హింసించాడు. విషయాన్ని గమనించిన బాలిక తల్లిదండ్రులు అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ఉక్కునగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ విశాఖ పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని సంచలన తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అలాగే బాధిత బాలికకు ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే అనంతపురం గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన రాముల చరణ్ రాజు 2021 అక్టోబర్ 12న ఆరేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి గ్రామ సమీప పొలాల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేయసాగాడు. చిన్నారి గట్టిగా కేకలు వేస్తూ అరవడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించారు. అంతలోనే అతను తప్పించుకుని పారిపోయాడు. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గుత్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధించడమే కాకుండా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు.

వీలైనంత వేగంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

థాంక్స్ గివింగ్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు అవంతి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ తదితరులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : వీలైనంత వేగంగా జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయించిన నేపథ్యంలో విశాఖ అక్రిడేటెడ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ నేతృత్వంలో శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన థాంక్స్ గివింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని సుబ్బారెడ్డి హామీనిచ్చారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం దీపావళి కానుకగా అభివర్ణించారు. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15వేల నుంచి 20 వేల మంది జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరనుందన్నారు. జీఓలో ఇబ్బందికరమైన ఆంక్షలు ఏమైనా ఉంటే జర్నలిస్టులకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా చూస్తామని మంత్రి హామీనిచ్చారు. మూణ్ణెలలోపు ఈ ప్రక్రియ పూర్తిచేస్తే బాగుంటుందని మాజీమంత్రి, భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ గౌరవాధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి.జనార్ధనరావు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున సహకారాన్ని మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఏపీఎంఎస్ఎండీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వేంకటేశ్వరరావు (జీవీ), సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెషర్ కుక్కర్‌లో డ్రగ్స్ తయారీ

- గుట్టురట్టు చేసిన బెంగళూరు క్రైం బ్రాంచ్ పోలీసులు
- రూ.10 కోట్ల విలువైన సరుకు స్వాధీనం



నిందితుడు



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ బి.దయానంద, డీసీపీ శ్రీనివాసగౌడ

బనశంకరి: ఇంట్లోనే ఓ విదేశీయుడు సింథటిక్ డ్రగ్స్ తయారు చేస్తున్నాడన్న సమాచారంతో బెంగళూరు క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. రూ.10 కోట్ల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద శుక్రవారం వెల్లడించారు. నైజీరియాకు చెందిన బెంజిమన్ వ్యాపార వీసాపై నగరానికి వచ్చాడు. 2021 నుంచి రామమూర్తినగర, ఆవలహళ్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. దుస్తుల వ్యాపా రం చేస్తున్నట్లు నమ్మించాడు. కానీ ఇంట్లోనే వంట చేసే ప్రెషర్ కుక్కర్‌లో డ్రగ్స్ తయారు చేయడం ప్రారంభించాడు. ఢిల్లీ, వేర్వేరు ప్రాంతాలనుంచి సబ్ పెడ్లర్లను పిలిపించి డ్రగ్స్ విక్రయించేవాడు. దీనిపై పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడిచేసి బెంజిమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి వంద గ్రాముల ఎండీఎం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ శ్రీనివాసగౌడ, ఏసీపీ శివకుమార్, సీఐ భరత్‌గౌడ ఆధ్వర్యంలో బెంజిమన్ ఇంట్లో సోదాలు చేయగా కుక్కర్ ద్వారా ఎండీఎంఏ క్రిస్టల్ తయారుచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.10 కోట్ల విలువచేసే వివిధ రకాల డ్రగ్స్, ఎండీఎంఏ తయారుచేసే హైడ్రాలిక్ యాసిడ్, రసాయనాలు, గ్యాస్‌స్టౌవ్‌లు, మొబైల్స్, కుక్కర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో హైదరాబాద్‌లో అరెస్ట్ అయినట్లు సమాచారం ఉందని, దాన్ని కూడా పరిశీలిస్తున్నామని, వీసా గడువు కూడా 2022లోనే ముగిసినట్టు గుర్తించామని కమిషనర్ తెలిపారు. నిందితుడిపై రామమూర్తినగర పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమ్మకానికి మారుపేరు జగన్

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కురబలకోట: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దాదాపుగా అమలు చేశారని, ఇదొక్కటి చాలు మరోసారి ఆయన సీఎం కావడానికి అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అంగళ్లలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ నమ్మకానికి మారుపేరు అని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు చెబితే నయవంచనే గుర్తుకు వస్తుందని అన్నారు. అబద్ధాలు చెప్పి గతంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాడన్నారు. ప్రత్యేకాంధ్రకు తొలి సీఎంగా ఆయన రైతులకు రుణమాఫీ, డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చేస్తానని ప్రజలను వంచించాడన్నారు. ముఖ్యమంత్రి జగన్ హయాంలో వివిధ పథకాల ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలకే నగదు జమ అవుతోందన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారా.. అని ప్రశ్నించారు. పేదల ఆత్మ గౌరవానికి ప్రతీకలుగా ముఖ్యంగా సీఎం జగన్ పథకాలు నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మాజీ సీఎం చంద్రబాబుకు ఇప్పటికే ఫ్యూజులు ఎగిరిపోయాయన్నారు. పవన్ లాంటి వాళ్లు జాకీ పెట్టినా చంద్రబాబు ఇక లేవలేడన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బైసాని చంద్రశేఖరరెడ్డి, కె.హరినాథరెడ్డి, డీఆర్ ఉమాపతిరెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, వై.సతీష్‌కుమార్ రెడ్డి, కోళ్ల వాసుదేవ రెడ్డి, ఎం. ఫిరోజ్‌ఖాన్, ఫజురుల్లా, కె.గిరినాథరెడ్డి, ముట్ర దాము తదితరులు పాల్గొన్నారు.

పీఆర్–126 వరికి ప్రభుత్వ గుర్తింపు లేదు

సాగు చేయొద్దని రైతులకు వ్యవసాయ శాఖ సూచన



పాలకోడేరు ప్రాంతంలో నాట్లు వేసిన పీఆర్–126 వరి వంగడం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ గుర్తింపు లేని పీఆర్–126 బియ్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కొనుగోలు చేయనందున.. ఆ రకాన్ని సాగు చేయవద్దని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. పంజాబ్ రైస్‌గా ప్రచారంలో ఉన్న ఈ వరి వంగడాన్ని మూడేళ్ల క్రితం సార్వా సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ప్రాంతంలో వేయగా ఆ తరువాత మరికొన్ని మండలాలకు విస్తరించింది. వరిపైరు ఏపుగా పెరగడంతోపాటు తెగుళ్లు కూడా పెద్దగా ఆశించకపోగా.. దిగుబడి ఉండడంతో రైతులు ఈ వంగడం వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ రకానికి ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో విత్తనాల సమస్య ఏర్పడుతోంది. పైగా పీఆర్–126 ధాన్యం సన్నరకం కావడంతో దానిని మిల్లింగ్ చేసే యంత్రాలు ఈ ప్రాంతంలో లేవు. గతంలో రైస్ మిల్లర్లు సొంతంగా ధాన్యం కొనుగోలు చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు ఇచ్చేవారు. అయితే ధాన్యం కొనుగోలులో దళారి వ్యవస్థను నిర్మూలించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు కమీషన్ ప్రాతిపదికన ఇస్తున్నది. దాంతో రైస్ మిల్లర్లు గత నాలుగేళ్లుగా నేరుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో కొంతమంది బియ్యం వ్యాపారులు పీఆర్–126 రకం ధాన్యం కొనుగోలు చేసి బీపీటీ రకంలో కల్తీ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. ఆ నిబంధనలకు విరుద్ధంగా పీఆర్–126 పండిస్తే ధాన్యం అమ్ముదానికి ఇబ్బందులు పడాల్సి ఉన్నందున రైతులు ఆ రకం సాగుకు దూరంగా ఉండాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ధనత్రయోదశి ధగధగలు

కళకళలాడిన బంగారం దుకాణాలు

- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న జ్యూవెలర్స్
- గ్రాము బంగారంపై రూ.50 నుంచి రూ.250 వరకూ రాయితీ
- సెంటిమెంట్‌తో దుకాణాల బాట పడుతున్న ప్రజలు



విజయవాడలోని ఓ నగల దుకాణంలో కొనుగోలుదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని బంగారు దుకాణాలు కళకళలాడుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ధనత్రయోదశి ఘడియలు ప్రారంభమయ్యాయి. దీంతో నగరంలోని బంగారు ఆభరణాలను విక్రయించే దుకాణాలు పలు ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం వరకూ త్రయోదశి ఉండటంతో శనివారం భారీగా వ్యాపారం జరగనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వినియోగదారులను తమ దుకాణాలకు రప్పించేందుకు వాటి యజమానులు షాపులను సర్వాంగసుందరంగా అలంకరించారు.

ధనత్రయోదశి ప్రత్యేకత ఇది..

దీపావళి పర్వదినానికి ముందు వచ్చే త్రయోదశిని, ధనత్రయోదశిగా ఉత్తరాదిన ధన్‌తేరస్‌గా పిలుస్తారు. ఆ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఆ సంవత్సరమంతా మంచి ఆదాయముంటుందని ప్రజల నమ్మకం. ప్రజల సెంటిమెంట్‌తో దుకాణాలు విభిన్న మోడల్స్, వివిధ ఆఫర్లతో నగరవాసులను రప్పించేందుకు ఆయా దుకాణాలు భారీ ప్రకటనలు ఇచ్చాయి.

విజయవాడలో భారీగా వ్యాపారం

నగరంలోని పలు కార్పొరేట్ దుకాణాల్లో సంవత్సరం మొత్తం జరిగే అమ్మకాల్లో అక్షయతృతీయ, ధనత్రయోదశి రోజుల్లోనే 15 నుంచి 20 శాతం వ్యాపారం జరుగుతుందని వ్యాపారుల అంచనా. దీపావళికి లక్ష్మీపూజ నిర్వహించడం భారతీయుల సంప్రదాయం. దేశంలో దక్షిణాది కన్నా ఉత్తరాదినే ఈ సంప్రదాయం బాగా కనిపిస్తుంది. లక్ష్మీపూజ కొన్ని ప్రాంతాల్లో మూడు రోజుల పాటు చేస్తారు. ఆశ్వీయుజ బహుళ త్రయోదశి నుంచి అమావాస్య రోజు వరకూ ఈ పూజా కార్యక్రమం కొనసాగుతుంది. అందులో భాగంగానే ధన్‌తేరస్ హడావుడి కూడా ఇటీవల మనకు కనిపిస్తుంది. శుక్రవారం సాయంత్రం నుంచి నగరంలోని దుకాణాలు సందడిగా కనిపించాయి.

దశాబ్దకాలంగా విస్తృత ప్రచారం

ధనత్రయోదశి రోజున బంగారం కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందని, రానున్న రోజుల్లో చక్కని ఆదాయం ఉంటుందని కొంత మంది నమ్మకం. ఆదాయం వృద్ధి చెందుతుందనే అంశానికి సంబంధించి నిర్దిష్టమైన పౌరాణికగాథ లేకున్నా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ అభిప్రాయం బలంగా ఉంది. గడిచిన దశాబ్దకాలంగా దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా మన రాష్ట్రంలో అక్షయతృతీయ, ధనత్రయోదశి పర్వదినాలను వ్యాపార సంస్థలు బాగా ప్రచారం చేస్తున్నాయి.

ఆకట్టుకుంటున్న ఆఫర్లు

ధనత్రయోదశి సందర్భంగా ఆయా దుకాణాలు ప్రకటించిన ఆఫర్లు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వజ్రాభరణాలకు కూడా ప్రత్యేక రాయితీలను ప్రకటించాయి. నగరంలో చాలా దుకాణాలు ఆరు శాతం నుంచి తరుగు లెక్కిస్తామని చెప్పినా వాస్తవంగా పది నుంచి 22 శాతం వరకూ తరుగును లెక్కగడుతుంటాయి. కానీ ప్రస్తుతం ధన్‌తేరస్ సందర్భంగా గ్రాముకు రూ.50 నుంచి రూ.250 వరకూ రాయితీనిస్తున్నాయి. అలాగే కొన్ని దుకాణాలు ఎంత బంగారం కొంటే అంతే బరువు వెండి ఉచితంగా అందిస్తున్నాయి. వినియోగదారులు ఆయా దుకాణాలు ప్రకటిస్తున్న రాయితీలను పరిశీలించి కొనుగోలు చేస్తే మంచి రాయితీని పొందవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాకుండా కొన్ని దుకాణాలు మజూరీలో 10 నుంచి 50 శాతం అని రాయితీ ప్రకటించాయి. అలాగే చాలా దుకాణాలు బంగారు నాణెలను అందిస్తున్నట్లు ప్రకటించాయి. శనివారం సైతం నగరంలో ధనత్రయోదశి సందడి కొనసాగనుంది.

'తెలంగాణలో కాంగ్రెస్‌కే అధికారం'



గన్నవరం: కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆయన బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డితో కలిసి ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో వీరికి ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పార్టీ నేతలు సుంకర పద్మశ్రీ, నరహరశెట్టి నరసింహారావు, ధనేకుల మురళీ స్వాగతం పలికారు. అనంతరం శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ అసమర్థ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు.

రేపు ఎన్టీఆర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.దిలీప్ ప్రసన్న బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

యరగోళు ప్రాజెక్టు నేడే జాతికి అంకితం


నిండుకుండలా యరగోళు జలాశయం


ప్రారంభానికి సిద్ధమైన యరగోళు ప్రాజెక్టు

- సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- నేడు జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య
- మూడు తాలూకాల ప్రజలకు తీరనున్న నీటి సమస్య
- నెరవేరనున్న జిల్లా ప్రజల చిరకాల వాంఛ

కోలారు: జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన యరగోళు ప్రాజెక్టు శనివారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రారంభం కానుంది.ఈ ప్రాజెక్టు ప్రారంభంతో జిల్లాలోని కోలారు, బంగారుపేటె, మాలూరు తాలూకాలతో పాటు ప్రాజెక్టు కాలువ పైప్‌లైన్ ద్వారా 45 గ్రామాలకు తాగునీరు అందనుంది. ప్రాజెక్టు ప్రారంభంతో మూడు తాలూకాల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. యరగోళ ప్రాజెక్టును 17 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. భూస్వాధీన ప్రక్రియ ఆలస్యంతో పాటు పలు కారణాలతో ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అవుతోంది. పనులు కూడా నత్తనడకన సాగాయి. తరుచుగా ప్రభుత్వాలు మారుతుండడం కూడా ప్రాజెక్టు ఆలస్యానికి కారణమైంది. యరగోళ ప్రాజెక్టుకు 2007వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ధర్మసింగ్ శంకుస్థాపన నెరవేర్చారు. అనేక అవాంతరాల మధ్య ప్రాజెక్టు సుదీర్ఘ కాలం నిర్మాణం పూర్తి చేసుకుని నేడు సిద్ధమైంది.

2007లో డ్యాంకు శంకుస్థాపన

ధరంసింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కురిసిన కుంభవృష్టితో జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు నిండి మరువ పారాయి. ఆ సమయంలో బేతమంగల వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు జీప్‌తో సహా వరదలో కొట్టుకు పోయారు. ఈ భారీ వానకు యరగోళు కనుమలో 15 నుంచి 20 అడుగుల వరకు నీరు నిలబడింది. దీనిని పాపేగౌడ అనే ఇంజినీర్ గుర్తించారు. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే జిల్లా ప్రజల తాగునీటి సమస్య తీరుతుందని భావించి కాంట్రాక్టర్ రవి, నాటి నగరసభ సభ్యుడు కెఎస్ త్యాగరాజ్ తో కలిసి కోలారు పాత్రికేయులతో దీని గురించి చర్చించారు. పత్రికల్లో వచ్చిన వార్తలు, ప్రజల డిమాండ్, ఒత్తిడి, పోరాటాల అనంతరం 2007 ఏప్రిల్ 12న ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. నాటి కోలారు ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ దీనిపై ఆసక్తి కనపరిచి అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. క్రిబ్కో చైర్మన్ కూడా అయిన శ్రీనివాసగౌడ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.88 కోట్లను విడుదల చేయించారు.

తడిసి మోపెడైన నిర్మాణ వ్యయం

ప్రాజెక్టు కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ తీసుకుంది. కరోనా తదితర నానా కారణాలతో పనులు ఆలస్యం కావడంతో కాంట్రాక్టు తీసుకున్న సంస్థ నిర్ణీత అవధిలో పనులు పూర్తి చేయలేదని ప్రభుత్వం రూ.2.5 కోట్ల జరిమానా కూడా విధించింది. యరగోళ ప్రాజెక్టుకు రూ.308 కోట్లను వ్యయం చేశారు. 40 మీటర్ల ఎత్తు, 414 మీటర్ల పొడవుతో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. 500 ఎంసీఎఫ్‌టీల నీటి నిల్వ సామర్థ్యం కలిగింది. 120 అడుగుల లోతుకు పైగా నీరు నిల్వ అవుతుంది. డ్యాం నిర్మాణం కోసం 375 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. జలాశయం నిండితే 3 తాలూకాలు, 45 గ్రామాలకు రెండేళ్ల పాటు తాగునీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రారంభ సమయంలో రూ.130 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం కలిగినా అనంతరం దీనిని రూ.240 కోట్లకు పెంచారు. అయితే ప్రస్తుతం దీనిని సవరించి రూ.308 కోట్లను ఖర్చు చేశారు. యరగోళ ప్రాజెక్టు ప్రారంభం అవుతుండడంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటి: జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌లో కనీస మద్దతు ధర పథకం కింద రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసే అంశంపై చర్చించేందుకు శుక్రవారం తన కార్యాలయ హాలులో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కనీస మద్దతు ధర పథకం కింద రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం వరికి క్వింటాల్‌కు రూ.2183 నుంచి రూ.2203 వరకు ధర అందించిందన్నారు. ఆ మేరకు జిల్లాలోని రైతుల నుంచి వరిధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు వీలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆయన ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జగద్గురు బసవేశ్వర విగ్రహ ఊరేగింపు


బసవేశ్వర విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

గంగావతి: నూతనంగా ఆవిష్కరించే జగద్గురు బసవేశ్వర కాంస్య విగ్రహాన్ని నగరంలో ఘనంగా ఊరేగించారు. బసవన్న కాంస్య విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ముందు భాగంలో అన్ని సమాజాల గురువులు, మహాపురుషుల చిత్రాలతో మహిళలు యూనిఫాంలో నృత్యాలు చేస్తూ డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. శరణ మల్లికార్జున మఠం నుంచి గాంధీ సర్కిల్, బసవణ్ణ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా విగ్రహ ప్రతిష్టాపన స్థలమైన నెహ్రూ పార్క్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు పరణ్ణ మునవళ్లి, జీ.వీరప్ప, బసవదళ ప్రముఖులు, బసవేశ్వర ట్రస్ట్ అధ్యక్షులు మహాలింగప్ప బన్నికొప్ప, అడ్వకేట్ పట్టణశెట్టి తదితర ప్రముఖులు నేతృత్వం వహించారు.

అవినీతిపై జాగృతే లోకాయుక్త కర్తవ్యం


మాట్లాడుతున్న లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫి

కంప్లి: సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రజల్లో జాగృతి కల్పించడం లోకాయుక్త కర్తవ్యం అని లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫి తెలిపారు. శుక్రవారం తాలూకా కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన అవినీతిపై జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు నిర్ణీత సమయంలోగా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ప్రజల పనులకు సంబంధించి ఎలాంటి లంచం పొందడం నేరమన్నారు. ఒక వేళ లోకాయుక్త దాడిలో చిక్కితే భవిష్యత్తులో మచ్చ ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్రజలు లోకాయుక్త అధికారులకు కొన్ని అర్జీలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన


బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తుకారాం

కంప్లి: తాలూకాలోని అంకమ్మనాళ్, డీ.మల్లాపుర క్యాంప్, హీరాళ తిప్పనమరడి, దొడ్డ ఉప్పారహళ్లి, కాళింగేరి, త్యాగదాళ్, జగేనహళ్లి యర్రయ్యనహళ్లి, తుంబరగుద్ది గ్రామాల్లో శుక్రవారం శాసకర నడె హళ్లి కడె పేరిట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటనను సండూరు ఎమ్మెల్యే తుకారాం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి బస్టాండ్‌ను ప్రారంభించడమేగాక ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి గోడును ఆలకించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇతర సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

20 నుంచి వివిధ కార్యక్రమాలు


పోస్టర్ విడుదల చేస్తున్న స్వామీజీలు

హొసపేటి: జగద్గురు కొట్టూరు స్వామి సంస్థానమఠంలో ఈనెల 20 నుంచి వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జగద్గురు కొట్టూరు స్వామి సంస్థాన మఠం బసవలింగ మహాస్వామి తెలిపారు. శుక్రవారం మఠంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరుగనున్న కార్యక్రమాల్లో రాష్ట్ర కేబినెట్ మంత్రులు, వివిధ మఠాధీశులు, ఎమ్మెల్యేలు, నాయకులు, సమాజ పెద్దలు పాల్గొంటారన్నారు. నూతన విద్యార్థుల హాస్టల్ భవనం, కప్పిన చెన్నబసవేశ్వర అతిథి గృహాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా బసవ దర్శన ప్రవచనంతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.

చివరికి చింతేనా?

- దెబ్బ తిన్న పంటను పరిశీలించిన నేతలు


నేలమట్టమైన పైరును పరిశీలిస్తున్న ఎంపీ కరడి సంగణ్ణ, మాజీ ఎమ్మెల్యే తదితరులు


ఆనెగుంది వద్ద నేలవాలిన వరి పంటను మాజీ ఎమ్మెల్సీ శ్రీనాథ్‌కు చూపుతున్న రైతు

గంగావతి: తాలూకాలో బుధవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా కనకగిరి నియోజకవర్గంలో నేలమట్టమైన వరి పైరును శుక్రవారం కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు రైతులు ప్రతి ఏటా తీవ్ర నష్టాలకు గురవుతూ అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పంట దెబ్బ తిన్న రైతులకు ఎకరాకు రూ.40 వేల నష్ట పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి కేంద్రం నుంచి రావాల్సిన పరిహారం కోసం తాను ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కాగా మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్ శ్రీనాథ్ ఆనెగుంది ప్రాంతంలోని 8 గ్రామాల్లో పంట నష్టాన్ని పరిశీలించారు. తక్షణం రైతులకు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే బసవరాజ్ దఢేసూగూరు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆగని అన్నదాతల ఆందోళనలు


నగరంలోని రోడ్డులో బైఠాయించిన రైతులు


ర్యాలీగా వస్తున్న రైతు సంఘం నేతలు

- పలు రోడ్లలో రాస్తారోకోలు, బైఠాయింపులు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీకి నవంబర్ 30వ తేదీ వరకు నీటిని సరఫరా చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరుసేన, తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. బళ్లారి బంద్‌కు పిలుపునివ్వడంతో ఆయా రహదారులను దిగ్బంధించారు. ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు, ద్విచక్ర వాహనాలు, కాలి నడకన వివిధ ప్రాంతాల నుంచి రైతులు బళ్లారికి చేరుకొని రాయల్ సర్కిల్, మోతీ సర్కిల్, బెంగళూరు రోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వేలాది మంది చేరుకొని బైఠాయించి ఆందోళనకు దిగారు. పంటలు పూర్తిగా చేతికి అందేవరకు నీటిని అందించకపోతే ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. జిందాల్ తదితర ప్రముఖ ఫ్యాక్టరీలకు అక్రమంగా నీటిని అందించడం నిలిపివేసి రైతుల పంటలను కాపాడాలన్నారు.

నీరందించకుంటే మూల్యం తప్పదు

హెచ్ఎల్‌సీ పరిధిలో సాగు చేసిన పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు నీటిని అందించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హసిరుసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి కరూరు హెచ్చరించారు. రైతుల పంటలు దక్కకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. రైతుల మేలు కోసం పంటలకు నీటిని సరఫరా చేయాలన్నారు. ఈవిషయంపై జిల్లా మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మనవి చేశారు. హెచ్ఎల్‌సీ పరిధిలో ఒక లక్ష ఎకరాల్లో వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, మిర్చీ ఈ పంటలు సాగు చేయడానికి ఒక్కో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారని గుర్తు చేశారు. తుంగభద్ర డ్యాంలో తగినంత నీరు కూడా ఉందని, ఫ్యాక్టరీలకు నీటిని వదలడం నిలిపివేసి రైతుల పంటలను కాపాడాలని ఒత్తిడి చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నేత, సీనియర్ న్యాయవాది మల్లికార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గురువు స్థానం ఎంతో విశిష్టం

- వేడుకగా పూర్వ విద్యార్థుల గురువందన


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ, ఉపాధ్యాయులు

కంప్లి: భారతీయ సంస్కృతి, గురుశిష్యుల పరంపర ఎంతో శ్రేష్టత కలిగినవని, అక్షరమనే విత్తనం నాటి జ్ఞాన దీపాన్ని వెలిగించే గురువుకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని కల్మఠం శాంతవీర స్వామీజీ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని గవిమఠంలో 1967–68వ సంవత్సరపు ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన గురువందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జ్ఞానదీపం వెలిగించి నలుగురినీ స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దిన గురువు స్థానం విశిష్టమైనదని, తల్లిదండ్రుల తర్వాత ఆ స్థానం గురువుకే దక్కుతుందన్నారు. గురువుల మార్గదర్శనంలో ఉత్తమ విద్యాభ్యాసం చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు.

మేగోటె దుర్గాదేవి అమ్మవారికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గంగావతి: మేగోటె దుర్గాదేవికి శుక్రవారం విశేష పూజలను అర్చకులు బ్రహ్మానంద స్వామి నెరవేర్చారు. ఉదయాన్నే అమ్మవారికి పలు రకాల అభిషేకాలు, విశేష అలంకరణ, మహామంగళారతి లాంటి ధార్మిక కార్యక్రమాలను చేపట్టారు. 11 గంటలకు లోకకళ్యాణం కోసం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విశేష హోమాన్ని నెరవేర్చారు. మధ్యాహ్నం భక్తులకు ఉచిత ప్రసాదాలను ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు.

పెట్టుబడి కూడా చేతికందదు

- మంత్రి నాగేంద్రకు రైతుల గోడు
- తమను ఆదుకోవాలని వేడుకోలు


సిరుగుప్ప తాలూకాలో రైతుల పొలాలను పరిశీలిస్తున్న మంత్రి నాగేంద్ర

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయిన నేపథ్యంలో మంత్రి నాగేంద్ర శుక్రవారం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా సిరుగుప్ప తాలూకాలోని రారావి, అగసనూరు, మిట్టసూగూరు, బొమ్మలాపుర, కొత్తలచింత, కుడదరాళు తదితర గ్రామాల్లో ఆయన రైతులు సాగు చేసి దెబ్బ తిన్న పంట పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు కన్నీరు పెడుతూ తమ వ్యథను వివరించారు. కరువు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు వ్యవసాయాధికారి మల్లికార్జున, ఉద్యాన, రెవిన్యూ శాఖాధికారులు పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాలో కరువు పీడిత ప్రాంతాలను పూర్తిగా అధ్యయనం చేసి ఖచ్చితంగా ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. సీఎం సిద్ధరామయ్య, డీసీఎం శివకుమార్‌ల దృష్టికి తీసుకెళ్లి తగిన సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కరువులోను బీజేపీ రాజకీయం

రాష్ట్రంలో, జిల్లాలో ఈఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను ఆదుకోవాల్సిన సమయంలో బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం పర్యటనలు చేస్తున్నారని మంత్రి నాగేంద్ర ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి కరువు సాయం తీసుకోరావాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. మాజీ సీఎం యడియూరప్ప తదితర నాయకులు కరువు ప్రాంతాల పర్యటన పేరుతో రాజకీయం చేస్తున్నారని జనం గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన 25 మంది ఎంపీలున్నా కేంద్రం నుంచి ఎలాంటి నిధులు తీసుకు రావడం లేదని మండిపడ్డారు.


ఎండిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ తదితరులు

పంటలు ఎండుతున్నా పట్టించుకోవట్లేదు

రాయచూరు రూరల్: పంటలు ఎండుతున్నా పట్టించుకొనేవారు కరువయ్యారని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. జిల్లాలో గురువారం సింధనూరు, మస్కి తాలూకాల్లో, శుక్రవారం మాన్వి, సిరవార, రాయచూరు తాలూకాల్లో హుబ్లీ ఎమ్మెల్యే అరవింద్ బెల్లద్ నేతృత్వంలో బీజేపీ నేతలు పర్యటించారు. 12 గంటల ఉచిత విద్యుత్ 4 గంటలుగా మారిందని రాష్ట్ర సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ బ్యాగవాట్, ప్రతాప్‌గౌడ పాటిల్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమానంద యాదవ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు లేఖన సామగ్రి పంపిణీ

కంప్లి: 2001–02వ సంవత్సరపు పూర్వ విద్యార్థులు శతమానోత్సవం పూర్తి చేరుకున్న హరవనహళ్లి పాఠశాలలో గురువందన కార్యక్రమంతో పాటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్సు, పెన్నులు అందించారు. అనంతరం పూర్వవిద్యార్థి మాట్లాడుతూ ప్రతి ఏటా తమ బ్యాచ్ పరంగా పిల్లలకు సహాయపడే సామగ్రి 5, 6, 7, 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా నోట్సు, పెన్నులు అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని తిలకించిన పాఠశాల విద్యార్థులు మున్ముందు కూడా గురువులను పూజిస్తూ వారి ఆశీర్వాదంతో భవిష్యత్తులో మరింతగా ఎదగాలని సూచించారు.

ఆర్టీసీ డీసీకి గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకున్న దేవేంద్రమ్మ

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ రాయచూరు ఆర్టీసీ విభాగంలో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేంద్రమ్మకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆమె గత నెల 30న గోవా రాజధాని పణజిలోని బ్రిగంజ భవనంలో జరిగిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ విశ్వనాథ్ చినకోడ్ చేతుల మీదుగా హ్యూమన్ డెవలప్‌మెంట్ విశ్వవిద్యాలయం నుంచి పట్టాను అందుకున్నారు.

డ్రెయినేజీ పనులతో రోడ్లు అధ్వానం


నగరంలో దుస్థితికి చేరిన ఓ రోడ్డు

రాయచూరు రూరల్: నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో రోడ్లు అధ్వానంగా మారాయి. గాంధీ చౌక్, పటేల్ రోడ్డు, మహాబలేశ్వర చౌక్, హరిహర రోడ్డు, తీన్ కందిల్, బైరూన్ కిల్లాలో దుస్థితికి చేరిన రోడ్లలో ప్రయాణిస్తున్న వారు ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలో గుంతలు పడ్డ రోడ్లను సత్వరం మరమ్మతు చేయాలని నగరసభ పాలక మండలిని, పాలకులను ప్రజలు కోరుతున్నారు.

అలరించిన పగటి వేషగాళ్ల ప్రదర్శన

కంప్లి: హంపీలోని చక్రతీర్థ వద్ద తుంగభద్ర నది ఒడ్డున పగటివేషధారణ కళాకారులు రామాయణంలో భాగమైన హనుమాయణ ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శన విదేశీయులను అలరించింది. బ్రెజిల్, బెల్జియం దేశాలను చెందిన సుమారు 60 మంది పర్యాటకులకు భారతీయ కళ, పరంపర, సంస్కృతిని పరిచయం చేసేందుకు కళాకారుడు రాము కడ్డిరాంపుర ఆధ్వర్యంలో 20 మంది కళాకారులు కిష్కింధకాండంలో వచ్చే సన్నివేశాలు, వాలి, సుగ్రీవ కాళగ ఇతర కధలను పాటలు, నృత్య ప్రదర్శనలు జరిపి పర్యాటకులను మంత్రముగ్ధులను చేశారు.

సరళంగా టిప్పుసుల్తాన్ జయంతి


పూలమాల వేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో సరళంగా టిప్పుసుల్తాన్ 229వ జయంతిని ఆచరించారు. శుక్రవారం టిప్పుసుల్తాన్ సర్కిల్ వద్ద సువర్ణ కర్ణాటక రక్షణ సేన ఆధ్వర్యంలో సంచాలకుడు సాదిక్ నేతృత్వంలో వివిధ సంఘాల సభ్యులు టిప్పుసుల్తాన్ జయంతిని జరుపుకున్నారు. టిప్పుసుల్తాన్ సంఘం సంచాలకుడు హైఫ రోజ్, దళిత సేన సంచాలకుడు విశ్వనాథ్ పట్టి తదితరులు పాల్గొన్నారు.

కేఈఏ పరీక్షల్లో అక్రమాలు.. మరో ఇద్దరు అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన వారు వీరే

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, కలబుర్గిలో జిల్లాల్లో గత నెలలో జరిగిన కేఈఏ పరీక్షల్లో బ్లూటూత్ ద్వారా పరీక్షలకు సహకరించి, అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై కింగ్‌పిన్ ఆర్‌డీ పాటిల్ కోసం గాలిస్తుండగా మరో ఇద్దరిని కలబుర్గి పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో ఆర్‌డీ పాటిల్‌కు సహకరించిన రవితో పాటు ముగ్గురిని లొంగదీసుకున్న పోలీసులు విచారణను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. రుద్రగౌడ పాటిల్‌కు సహకరించిన కలబుర్గి వరదా కాలనీలోని మహాలక్ష్మి అపార్ట్‌మెంట్‌ను బాడుగకిచ్చిన శహాపుర శంకర్‌గౌడ యళవార, మేనేజర్ దిలీప్ పవార్‌ను పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

ఆయుర్వేదంపై అవగాహన అవసరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, విద్యార్థులకు ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే మేలుపై అవగాహన కల్పించాలని జెడ్పీ ఉప కార్యదర్శి శశికాంత్ శివపురే వైద్యులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఆయుష్ ఆరోగ్య కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 8వ జాతీయ ఆయుష్ దినోత్సవం, ధన్వంతరి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి వద్ద మొక్కలు పెంచితే పర్యావరణానికి మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. జిల్లా ఆయుష్ ఆరోగ్య అధికారి శంకర్‌గౌడ, జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, వైద్యులు షకీల్, వెంకటేష్ దేశాయి, అంజాద్, అస్లాం, శంకర్‌లున్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో యువత అన్నిరంగాల్లో రాణించాలని ఎస్ఆర్‌కే బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎస్ఆర్‌కే బీఈడీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెలుగులోకి రావాలంటే జ్ఞానం, విశ్రాంతి, సామాజిక భద్రతను కల్గిఉండాలన్నారు. పాఠ్యాంశాలకు తోడు పాఠ్యేతర అంశాలపై కూడా యువత దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో యువజన క్రీడా శాఖాధికారి ఈరేష్ నాయక్, సంతోష్, ప్రతిమలున్నారు.

తేనెటీగల దాడిలో విద్యార్థులకు గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

కంప్లి: హరపనహళ్లి ఎస్ఆర్ఎంపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగిన తేనెటీగల దాడిలో గాయపడిన ఆరుగురు పారా మెడికల్ విద్యార్థులు అనివార్య పరిస్థితిలో కర్ణాటక నర్సింగ్ మండలి పరీక్షకు గైర్హాజరయ్యారు. నర్సింగ్ కాలేజీ కొత్రేష్, వికాస్, మంజునాథ్, వరమహాలక్ష్మి, ప్రతిభ, అర్షియాలను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

డిగ్రీ ఫలితాల విడుదలకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో డిగ్రీ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను విడుదల చేయాలని జయ కర్ణాటక జనపర వేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి వేదిక అధ్యక్షుడు జంబన్న మాట్లాడారు. బీఏ, బీకాం, బీఎస్సీ పరీక్షలు రాసి రెండేళ్లు కావస్తున్నా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే వీలు లేకుండా రాయచూరు విశ్వవిద్యాలయం అధికారులు ఫలితాల వెల్లడిలో నిర్లక్ష్యం వహించడాన్ని ఖండించారు. వివిధ కోర్సుల్లో విద్యనభ్యసించేవారి పరిస్థితిని అర్థం చేసుకుని విద్యార్థుల పరీక్ష ఫలితాల విడుదలకు చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.